thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal
సంపుటి - 20 సంచిక - 187 కరీంనగర్ ఆదివారం, 14 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కశ్మీర్‌లో 9,500 బంకర్లు.. మరిన్ని నిర్మిస్తాం: సీఎస్ అటల్


జమ్మూకశ్మీర్ : భారత్ – పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి 9,500 బంకర్లు ఉన్నాయని, జనావాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ కాల్పు లకు తెగబడుతుండడంతో స్థానికుల భద్రత దృష్ట్యా వాటి సంఖ్యను మరింత పెంచుతామని జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అటల్ డుల్లూ అన్నారు. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న కాల్పుల ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లా డారు. అవసరానికి అనుగుణంగా బంకర్ల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రాణ, ఆస్తినష్టాలు జరిగాయని నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తా మని తెలిపారు. బాధితులకు సంఘీభావాన్ని ప్రకటించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి భద్రతకు, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.




# మరోసారి భేటీ!

## భారత్-అమెరికా టారిఫ్ చర్చలు త్వరలో తిరిగి ప్రారంభం

న్యూఢిల్లీ : భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆరవ రౌండ్ చర్చలు త్వరలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చర్చలు ఆగస్టు చివరి వారంలో జరగాల్సి ఉండగా, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దిగుమతులపై 50 శాతం సుంకం విధించిన తర్వాత ఈ చర్చలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఈ చర్చలు తిరిగి మొదలవ్వబోతున్నాయి. భారత్, అమెరికా ట్రేడ్ టారిఫ్ చర్చలు పునఃప్రారంభమవుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ధృవీకరించారు. రెండు దేశాల 'వాణిజ్య అడ్డంకులను పరిష్కరించడానికి చర్చలు కొనసాగిస్తున్నాయి' అని ట్రంప్ తెలిపారు. 'రాబోయే కొన్ని వారాల్లో నా మంచి స్నేహితుడు, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడటానికి నేను ఎదురు చూస్తున్నాను. మన రెండు గొప్ప దేశాలకు విజయవంతమైన ముగింపుకు రావడంలో ఎటువంటి ఇబ్బంది ఉండదని నేను కచ్చితంగా భావిస్తున్నాను!' అని ఆయన ట్రంప్ ఉద్ఘాటించారు. అయితే, ట్రంప్ సందేశంతో భారత ప్రధాని నరేంద్రమోదీ సానుకూల దృక్పదాన్ని కనబర్చారు. భారత్, అమెరికా ట్రేడ్ టారిఫ్ చర్చలు ఫలప్రదం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ట్రంప్ కు మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఇలా ఉండగా, అమెరికాకు చెందిన వ్యవసాయ, పాడి పరిశ్రమకు సంబంధించిన ఉత్పత్తులు భారత మార్కెట్లలోకి అనుమతివ్వాలని ట్రంప్ పదే పదే డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ అంశంపై తన వైఖరికి కట్టుబడి ఉండాలని భారత్ భావిస్తోంది. చౌకైన అమెరికన్ వస్తువులు భారత మార్కెట్లలోకి ప్రవేశిస్తే, ఇక్కడి రైతులు, ఆయా పరిశ్రమలు నీరుగారిపోయే ప్రమాదం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తున్నారు. దేశంలో కోట్లాది మంది రైతులు, పశువుల పెంపకందారులు, మత్స్యకారులు, ఇంకా మహిళల జీవనోపాధికి ముప్పు వాటిల్లుతుందని భావిస్తున్న భారత్ ట్రంప్ డిమాండ్ కు తలొగ్గడంలేదు. దేశంలో ఎక్కువ మందికి ఈ ఉత్పత్తులే జీవనాధారం కావడంతో భారత్ సర్కారు ఈ అంశంపై అమెరికాకు తలొగ్గకూడదని గట్టి పట్టుదలతో ఉంది.




హైదరాబాద్, సెప్టెంబరు13: మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు సుజాత తెలంగాణ డీజీపీ జితేందర్ ఎదుట ఇవాళ లొంగిపోయారు. సీపీఐ మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్‌గా సుజాత ఉన్నారు. సుజాత అలియాస్ పోతుల కల్పన గద్వాలకు చెందిన వారు. 1984లో కిషన్‌జీని వివాహం చేసుకున్నారు సుజాత. ఆమె మొత్తం 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. 43 ఏళ్లుగా ఆమె అజ్ఞాతంలో ఉన్నారు. సుజాత లొంగుబాటు అనంతరం డీజీపీ జితేందర్ మీడియాతో మాట్లాడారు.

**మావోలతో చర్చలతో ఉపయోగం లేదు..** 'మావోయిస్టులతో చర్చలతో ఏలాంటి ఉపయోగం లేదు. గతంలో జరిగిన చర్చలతో ఏలాంటి ఫలితాలు రాలేదు. 43 ఏళ్లుగా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో అజ్ఞాతంలో పనిచేశారు సుజాత. అనారోగ్యం దృష్ట్యా సుజాత లొంగిపోయారు. ఆమెపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఆ రివార్డు మొత్తాన్ని డీడీ రూపంలో సుజాతకు అందజేస్తాం. పునరావాసంలో భాగంగా అన్ని ప్రయోజనాలు అందేలా చూస్తాం. ఆగు మల్లోజుల కోటేశ్వరావు అలియాస్ కిషన్‌జీని ఆమె వివాహం చేసుకున్నారు. 2011 నవంబర్‌లో కిషన్ జీ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. సుజాత తన అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ ఏడాది ఇప్పటివరకు 404 మంది యూజీ క్యాడర్లు, నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక డివిజన్ కమిటీ కార్యదర్శి, 8 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 34 మంది ఏరియా కమిటీ సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు' అని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు.

**మావోల లొంగుబాటు సాధ్యం కాదు..** 'ప్రస్తుతం సీపీఐ మావోయిస్టు పార్టీలో తెలంగాణకి చెందిన వారు 78 మంది మాత్రమే ఉన్నారు. 15 మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో 10 మంది తెలంగాణకు చెందినవారు ఉన్నారు. మావోయిస్టుల లొంగుబాటు అనేది అంత సులభంగా జరుగదు. మావోయిస్టులు రెండు, మూడు రోజుల్లో లొంగుబాటనేది సాధ్యం కాదు. పోలీసులకు మావోలు లొంగిపోవాలంటే ప్రాసెస్ ఉంటుంది. దాని ప్రకారం లొంగిపోతారు. గతేడాది 22 మంది మావోయిస్టులు తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 10 మంది మావోయిస్టులు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. గతంలో కూడా పోలీసులకు మావోయిస్టులకు మధ్య చర్చలు జరిగాయి... అయినా కూడా ఎలాంటి ప్రగతి సాధించలేదు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో మావోయిస్టులు వారిని కాపాడుకునేందుకే చర్చల ప్రతిపాదనను తెరపైకి తీసుకొస్తున్నారు. తెలంగాణ కమిటీలో 11మంది మావోయిస్టులు తెలంగాణ వారు, ఇతర రాష్ట్రాల వారు 62 మంది ఉన్నట్లు గుర్తించాం. తెలంగాణ కమిటీలో మొత్తం 73మంది మావోయిస్టులు ఉన్నట్లు గుర్తించాం' అని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు.

# ఈశాన్య రాష్ట్రాల దశ మారుస్తాం

## మణిపూర్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకువస్తాం.. మోదీ భరోసా

ఇంఫాల్: భారతదేశ ప్రగతికి మణిపూర్ కీలక స్తంభమని, ధైర్యవంతులు, దృఢసంకల్పానికి ప్రతీక ఈనేల అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి కొండలు వెలకట్టలేని ప్రకృతి వరప్రసాదమని, ప్రజల కఠోర పరిశ్రమకు సంకేతాలని కొనియాడారు. మణిపూర్ ప్రజల స్ఫూర్తికి సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. మణిపూర్‌లో నూతన ఉషోదయం ప్రారంభం కానుందని, ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకున్నారని, వారికి కేంద్రం బాసటగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. మణిపూర్‌లో శనివారంనాడు పర్యటిస్తున్న ప్రధాని జాతుల ఘర్షణలకు కేంద్రమైన చురాచంద్‌పూర్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. 2023లో ఘర్షణల తర్వాత రెండేళ్లకు ప్రధాని రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. శాంతిభద్రతల పునరుద్ధరణకు కేంద్రం కట్టుబడి ఉందని బాధిత కుటుంబాలకు ప్రధాని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. చురాచంద్‌పూర్‌లో రూ.7,300 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో మణిపూర్ అర్బన్ రోడ్లు, డ్రైనేజీలు, అసెట్ మేనేజ్‌మెంట్ ఇన్వాల్వ్‌మెంట్ ప్రాజెక్టు, 5 నేషనల్ హైవే ప్రాజెక్టులు, మణిపూర్ ఇన్ఫోటెక్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు, తొమ్మిది ప్రాంతాల్లో వర్కింగ్ ఉమన్ హాస్టళ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, మణిపూర్‌ను అభివృద్ధి బాట పట్టిస్తామని చెప్పారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఇక్కడకు వచ్చిన ప్రజల ప్రేమకు తాను ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. భారీ వర్షాల కారణంగా హెలికాప్టర్‌లో రాలేకపోయానని, రోడ్డు మార్గంలో వచ్చానని చెప్పారు. అదికూడా మంచిదే అయిందని, మణిపూర్




యువకులు, పెద్దలు తమ చేతుల్లో త్రివర్ణ పతాకాలతో కనిపించారని, ఈ క్షణాలను తాను జీవితంలో మరిచిపోలేని అన్నారు. 'మణిపూర్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది. అదే స్ఫూర్తితో ఈరోజు నేను ఇక్కడికి వచ్చాను. కొద్ది సేపటి క్రితమే ఇదే వేదిక నుంచి రూ.7,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించాను. ఈ ప్రాజెక్టులతో మణిపూర్ ప్రజలు, మన గిరిజన తెగల ప్రజల జీవితాలు గణనీయంగా మెరుగుపడతాయి' అని మోదీ భరోసా ఇచ్చారు. మణిపూర్ పేరులోనే మణి ఉందని, భవిష్యత్తులో యావత్ ఈశాన్య ప్రాంతాన్ని ఈ మణి ఉజ్వలంగా ప్రకాశింపజేస్తుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. అభివృద్ధికి శాంతి కీలకమని, మీ పిల్లల అభివృద్ధి కోసం శాంతి మార్గంలో పయనించాలని కోరుతున్నానని అన్నారు. మణిపూర్‌లో రైల్వే, రోడ్ల అనుసంధానానికి బడ్జెట్ కేటాయింపులు పెంచామని చెప్పారు.




# మళ్ళీ తలుపులు తెరుచుకున్నాయ్!

## తెలంగాణ కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్..

## ఆ నేతలే టార్గెట్‌గా..

హైదరాబాద్ : గత అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీని వీడి బీఆర్ఎస్, బీజేపీలో చేరిన నేతలకు కాంగ్రెస్ పార్టీ ఆహ్వానం పలుకుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడం, ఇతర నేతలతో విభేదాల కారణంగా కొందరు కాంగ్రెస్ ముఖ్య నేతలు పార్టీని వీడాల్సి వచ్చింది. ఇప్పుడు వారందరినీ తిరిగి పార్టీలోకి తీసుకోవాలని డిసైడ్ అయ్యారు పెద్దలు. ఈ మేరకు టి.పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో భట్టి ప్రతిపాదన పెట్టగా కార్యవర్గం అంతా ఏకగ్రీవంగా ఆమోదం కూడా తెలిపింది. కాంగ్రెస్ పార్టీలో ఏళ్ల తరబడి పనిచేసి ఐడియాలజీ ఉన్న నేతలను చేర్చుకుంటే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పీసీసీ భావిస్తోంది. దీంతో మళ్లీ పార్టీలోకి ఎంట్రీ ఇచ్చే పాత నేతలెవరనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు మాజీ పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీని వీడారు. అంతేకాకుండా మూల విక్రమ్‌గౌడ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలువురు కాంగ్రెస్ నేతలు పార్టీ నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ నేతలంతా బీఆర్ఎస్, బీజేపీల్లో కొనసాగుతున్నారు. ఇప్పుడు వీరందరినీ తిరిగి పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం అవుతుందని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. అందులో భాగంగానే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలకు ముందు పార్టీని వీడిన వారిని పార్టీలో చేర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ఆచితూచి అడుగులు వేసింది. దీనిపై ఎవరిని పార్టీలోకి తీసుకోవాలి, ఎవరిని తీసుకోవద్దనే దానిపై ముందుగానే అంచనాకు వచ్చింది పీసీసీ. గాంధీభవన్‌లో జరిగిన టీ పీసీసీ విస్తృత స్థాయి మీటింగ్‌లో కూడా పార్టీ వీడిన నేతలను తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిపాదన తీసుకొచ్చారు. డిప్యూటీ సీఎం చేసిన ప్రతిపాదనకు పీసీసీ కార్యవర్గమంతా ఆమోదం తెలిపింది. దీంతో కాంగ్రెస్ పాత నేతలకు గాంధీ భవన్ గేట్లు తెరుచుకోబోతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయింది. అంతేకాకుండా త్వరలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగబోతుంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు సైతం నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. దీంతో సంస్థాగతంగా కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలంటే గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇతర పార్టీల్లో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పాలని నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. భట్టి విక్రమార్క చేసిన ప్రతిపాదనతో త్వరలోనే సీనియర్లు తిరిగి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లుగా చర్చ జరుగుతోంది. ఎంత మంది మళ్లీ సొంత గూటికి చేరుతారో, పార్టీ మళ్లీ వారికి ఎలాంటి స్థానం కల్పిస్తుందో వేచి చూడాలి.




2025-26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని మండిపడ్డారు. "2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు కూడా 27 శాతం పన్ను విధించేవారు. నేడు వీటిపై కేవలం 5శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ చాలా ఖరీదైనదిగా మారింది" అని అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని.. సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈవిధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం తగ్గించామంటూ వ్యాఖ్యానించారు. మన ఆర్థికవ్యవస్థ తయారీ రంగం వృద్ధి మన జాతీయ భద్రతకు చాలా ముఖ్యమైనదన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో.. ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాలే మన దేశాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర పోషించాయన్నారు.




## రూ.140 కోట్లకు దిల్లీ బంగళా.. అత్యధిక ధర చెల్లించిన హైదరాబాద్ వ్యాపారవేత్తలు

దిల్లీలో 883 చదరపు మీటర్లలో విస్తరించిన ఓ భవంతిని హైదరాబాద్‌కు చెందిన విశ్వ సముద్ర గ్రూప్ కొనుగోలు చేసింది. వ్యాపారవేత్తలు శశిధర్ చింతా, లక్ష్మీ ప్రియదర్శిని చింతా ఆ విశాలమైన బంగళాను దక్కించుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో రిజిస్టర్ లావాదేవీకి సంబంధించిన సేల్ డీడ్ నమోదైంది. రూ.8.96 కోట్లను స్టాంప్ డ్యూటీ కింద కంపెనీ ప్రతినిధులు చెల్లించారు. విశ్వసముద్ర గ్రూప్ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పన వ్యాపారాల్లో రాణిస్తోంది. ప్రస్తుతం కొనుగోలు చేసిన బంగళా ఉమ్మడి యాజమాన్యంలో ఉంది. దీంతో 10 మంది ఆస్తి బదిలీకి చెందిన దస్త్రాలపై సంతకాలు చేసినట్లు తెలిసింది. తాజాగా జరిగిన లావాదేవీతో లుటియన్స్ బంగళా జోన్(ఎల్‌బీజడ్) మరోసారి వార్తల్లోకెక్కింది. భారతదేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాంతాల్లో ఆస్తులకు డిమాండ్ నిరంతరం పెరుగుతోందనే విషయాన్ని ఈ లావాదేవీ నిరూపించింది. ఎల్‌బీజడ్, దక్షిణ దిల్లీలో ఇటీవల కాలంలో రూ.100 కోట్ల విలువైన స్థిరాస్తి లావాదేవీలు చాలా జరిగాయి. 'లుటియన్స్ దిల్లీ(%ణవశ్రీష్ట్రఱ%)కి బయటి వ్యాపారవేత్తల నుంచి డిమాండ్ బాగా ఉంది. ఈ ప్రాంతం తమ చిరునామాగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. అందుకోసం మార్కెట్ విలువ ఎంతైనా చెల్లించడానికి సిద్ధపడుతున్నారు' అని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పేర్కొన్నారు.

**6 నెలల్లో వెండికీ తప్పనిసరి హాల్‌మార్కింగ్!..** 28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో లుటియన్స్ బంగళా జోన్ కేంద్రీకృతమైంది. దాదాపు 3 వేల బంగళాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ ప్రధానంగా మంత్రులు, న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు నివసిస్తున్నారు. భారత్‌లోని సంపన్న వ్యాపారవేత్తలకు చెందిన 600 స్థిరాస్తులు ఇక్కడ ఉన్నట్లు సమాచారం.

## 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: ఈ నెల 23 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ దృష్ట్యా.. నీటిపారుదల రంగ నిపుణులు, న్యాయ నిపుణులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌తో పాటు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నామన్నారు. న్యాయంగా రావాల్సిన నీటివాటాను సాధిస్తామని తెలిపారు. ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తామని చెప్పారు. తాగు, సాగునీటితో సహా పరిశ్రమలకు నీటి వినియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైబ్యునల్ విచారణ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వచ్చి సమీక్షిస్తారని తెలిపారు.

**గత పాలకుల నిర్లక్ష్యమే కారణం..** తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65 శాతం మేర నీటి కేటాయింపులు ఉండాల్సిందేనని అన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రైబ్యునల్ కు సమర్పించామన్న ఉత్తమ్... ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని పునరుద్ఘాటించారు. జూన్, జూలై మాసాల్లో 80 టీఎంసీల నీటిని అందుబాటులో ఉంచడంతో పాటు ఆపరేషన్ ప్రోటోకాల్ అనుసరించి నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణకు ఉండేలా ట్రైబ్యునల్ ముందు ఉంచుతామని తెలిపారు.

ఏపీ అక్రమంగా వినియోగిస్తున్న 291 టీఎంసీల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున... ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందేనని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతోందని... రాష్ట్ర హక్కులను కూడా ట్రైబ్యునల్ ఎదుట జరిగే వాదనల్లో వినిపిస్తామని చెప్పారు.

ప్రతిపాదిత ప్రాజెక్టుల అంశాలతో కూడిన ప్రత్యేక జీఓను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే కృష్ణా జలాలను తెలంగాణ వినియోగించుకోలేక పోయిందని భారత రాష్ట్ర సమితి నేతలపై ఉత్తమ్ మండిపడ్డారు. గత పాలకుల ఉదాసీనత కారణంగా ఏపీ అక్రమంగా నీటిని తరలించుకుపోయి ప్రయోజనం పొందిందని విమర్శించారు.




ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని చూస్తోంది. ఈక్రమంలో ఈయూ, జీ7 దేశాలు భారత్, చైనాలపై టారిఫ్‌లు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. జీ7 దేశాల ఆర్థిక మంత్రులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య సుంకాల విధింపుపై చర్చ జరిగింది. ఈ చర్చకు సంబంధించిన విషయాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. "ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకురావాలని యూఎస్ వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారు. ఇందుకోసం మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై సుంకాలు విధించాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదనలను ఉద్ఘాటించారు. ఇప్పటికే.. భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని అక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామంటూ జీ7 సభ్యదేశాలు అమెరికాకు హామీ ఇచ్చాయి. ఈ క్లిష్ట సమయంలో అమెరికాతో కలిసి ఈ దేశాలు కూడా నిర్ణయాత్మక చర్యలు చేపడుతాయని ఆశిస్తున్నాం" అని జామిసన్ గ్రీర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

దీంతో భారత్, చైనాలపై సుంకాల విధింపునకు ఆయా దేశాలు కూడా సిద్ధమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాగా.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య(ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జీ7 దేశాల ముందుపెట్టడం గమనార్హం.

## కొమురం భీం జిల్లాలో విషాదం.. నీటిగుంతలో పడి నలుగురు మృతి




కొమురం భీం: వాంకిడి మండలం డాబా గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ నీటిగుంతలో పడి తల్లి, ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతిచెందిన వారిని మోర్లే బుజ్జి బాయి (35), మోర్లే గన్ను(12), వాడే మహేశ్వరీ(9), అదే శశికళ(9)గా గుర్తించారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మోర్లే బుజ్జి బాయి అనే మహిళ పొలం వద్ద పనిచేస్తున్న సమయంలో నీటి కోసం ముగ్గురు పిల్లలు కుంటలో దిగారు.

కుంటలో లోతు ఎక్కువగా ఉండటంతో.. చిన్నారులు నీటిలో మునిగిపోయారు. అది గమనించిన మహిళ చిన్నారులను రక్షించేందుకు నీటిగుంతలోకి దిగింది. గుంతలో నీరు, బురద ఎక్కువగా ఉండటంతో నలుగురు నీటిగుంతలోనే చిక్కుకుని మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మహిళా సాధికారతకు పట్టం సుశీల కర్కి నియామకం.. మోదీ ప్రశంసలు




చురాచంద్‌పూర్: నేపాల్ తొలి మహిళా ప్రధానమంత్రిగా నియమితులైన సుశీల కర్కికు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆమె నియామకం మహిళా సాధికారతకు ఒక ఉజ్వల ఉదాహరణ అని అన్నారు. నేపాల్ భారత్‌కు సన్నిహిత దేశమని, 140 కోట్ల భారత ప్రజానీకం తరఫున ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నానని మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మాట్లాడుతూ ప్రధాని అన్నారు. 'దేశ అత్యున్నత పదవిని కర్కి చేపట్టడం మహిళా సాధికారతకు బలమైన ఉదాహరణ. నేపాల్‌లో శాంతి, సుస్థిరత, అభ్యుదయానికి ఆమె పాటుపడతారని నేను బలంగా నమ్ముతున్నాను' అని మోదీ అన్నారు. నేపాల్‌లో రాజకీయ సంక్షోభం, భారీ నిరసనల నేపథ్యంలో కర్కి నేపాల్ తాత్కాలిక ప్రధానిగా శుక్రవారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. అవినీతి నిరోధక కార్యకర్తగా, నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా సుశీల కర్కి పేరు తెచ్చుకున్నారు. కాగా, నేపాల్ కొత్త ప్రధానిగా పగ్గాలు చేపట్టిన సుశీల కర్కిని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శనివారం ఉదయం అభినందించారు. పొరుగుదేశాలతో శాంతి, ప్రగతి, ప్రజల అభ్యున్నతికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు.




**హైదరాబాద్: తెలంగాణలోని ఐదు జిల్లాల్లో శనివారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరో 19 జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు పేర్కొంది. నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. 19 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు**




## అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి సర్వే నంబర్ 217లోని 12 ఎకరాల భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. 2011లో ఈ భూములను బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్‌కు ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఇటీవల ఓ నిర్మాణ సంస్థ కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టింది. ఈక్రమంలో ఫిర్యాదు అందుకున్న హైడ్రా చర్యలు తీసుకుంది. శనివారం పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది.

## గ్రూప్ 1 పోస్టుల వ్యవహారం.. అప్పీల్‌కు వెళ్లాలనుకోవడం సిగ్గుచేటు: హరీశ్‌రావు



హైదరాబాద్: గ్రూప్ 1 పోస్టులకు రూ.లక్షలు లంచం తీసుకున్నట్లు ఆరోపణలున్నాయని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అభ్యర్థులను మంత్రులు, అధికారులు రూ.లక్షలు లంచం అడిగారన్నారు. ఈ అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయించాలని.. లేదంటే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లాలనుకోవడం సిగ్గుచేటన్నారు.

తప్పు దిద్దుకోకుండా అప్పీల్‌కు వెళ్లాలనుకోవడం సరికాదని చెప్పారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. నిరుద్యోగుల తరఫున తమ పార్టీ పోరాటం చేస్తుందని చెప్పారు. అసెంబ్లీలో నిలదీసి న్యాయం జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.




## రేణు అగర్వాల్ హత్య కేసులో నిందితులు అరెస్ట్.. వెలుగులోకి కీలక విషయాలు..

హైదరాబాద్: కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 10వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. రేణు అగర్వాల్ అనే మహిళ స్వాన్ లేక్ అపార్ట్మెంట్‌లో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. రేణు అగర్వాల్‌ను హత్య చేసిన ఇద్దరు నిందితులు రోషన్, హర్షలను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సీపీ ఇవాళ(శనివారం) మీడియాతో మాట్లాడారు..

**కుక్కర్‌తో కొట్టి.. కాళ్లు, చేతులు కట్టేసి..** రేణు అగర్వాల్ అనే మహిళ స్వాన్ లేక్ అపార్ట్మెంట్‌లో భర్త, కుమారుడితో నివాసం ఉంటుంది. అయితే.. హర్ష కొద్ది రోజుల క్రితమే ఆమె ఇంట్లో పనికి కుదిరాడు. రోషన్ కూడా అదే అపార్ట్మెంట్‌లో పై అంతస్తులో గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. కాగా, రేణు అగర్వాల్ ఇంట్లో డబ్బులు, బంగారం ఉన్నట్లు నిందితులు తెలుసుకున్నారు. ఈ నెల 10వ తేదీన రేణు కుమారుడు, భర్త ఇంట్లో నుంచి బయటకు వెళ్లగానే నిందితులు ఇద్దరు ఇంట్లోకి ప్రవేశించారు. అదే సమయంలో ఇంట్లో పనిచేసుకుంటున్న రేణు తలపై కుక్కర్‌తో మోదారు. ఆ తర్వాత ఆమె కాళ్లు చేతులు కట్టేశారు. అనంతరం ఇంట్లోని 7 తులాల బంగారు ఆభరణాలు, పది వాచ్‌లు, డబ్బుతో పరారయ్యారు.

**రాంచీలో పట్టుబడ్డ నిందితులు..** ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇద్దరు నిందితులను రాంచీకి చెందిన వారిగా గుర్తించినట్లు సీపీ అవినాష్ పేర్కొన్నారు. 2023లో రోషన్‌పై మూడు కేసులు నమోదు అయినట్లు తెలిపారు.

8వ తేదీ నుంచి దోపిడీకి ప్లాన్ చేసుకున్నారని చెప్పారు. దర్యాప్తులో భాగంగా టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిన్న(శుక్రవారం) రాంచీ వద్ద ఇద్దరు నిందితులు పట్టుబడ్డారని స్పష్టం చేశారు. హర్ష అనే నిందితుడు మత్తు పదార్థాలు సేవిస్తాడని, గతంలో రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స తీసుకున్నాడని చెప్పుకొచ్చారు. ఈ కేసులో రోషన్ సోదరుడిని కూడా అదుపులోకి తీసుకున్నామని అన్నారు. దోచుకున్న ఆభరణాలు దాచడానికి అతను సహాయ పడ్డాడని తెలిపారు.

చురకలు



# తొలి తరం స్త్రీ నవలా రచయిత్రి బొమ్మ హేమాదేవి - సెప్టెంబర్ 14...బొమ్మ హేమాదేవి జయంతి



బొమ్మ హేమా దేవి తెలుగు సాహిత్య చరిత్రలో తొలి తరానికి చెందిన స్త్రీ నవలా రచయిత్రిగా విశిష్ట స్థానం పొందిన అరుదైన ప్రతిభావతి. 1931 సెప్టెంబర్ 14వ తేదీన నిజామా బాద్‌లో రామా గౌడ్, గంగాదేవి దంపతులకు జన్మించిన ఈమెకు యమున అని పేరు పెట్టారు. దాతృత్వం, ఉదారతకు కీర్తి పొందిన అపర దానకర్ణుడు రాజా నర్సాగౌడ్ పెద్ద మనుమరాలు అయిన ఆమెను చెల్లెలు రంజనతో కలిసి హైదరాబాదు నారాయణ గూడలోని ఆంధ్ర గర్ల్స్ హైస్కూలులో చదివించారు. ఆ పాఠశాలే ఆ కాలంలో నిజాం రాష్ట్రంలో ఏకైక తెలుగు మాధ్యమ విద్యాసంస్థ. విద్యాభ్యాసం ద్వారా సాహిత్యంపై ఆకర్షణ పెంపొందించి, ఆరంభ దశలోనే సృజనాత్మకతను ఆవిష్కరించ గలిగింది. పదహారేళ్ల వయసులో కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన బొమ్మ నారాయణ గౌడ్‌తో వివాహం జరిగింది. వివాహానంతరం రుక్మిణి అనే పేరుతో కుటుంబ జీవితం ప్రారంభించినా, రచనా రంగంలో మాత్రం యమున, దేవిరమ వంటి కలం పేర్లతో సాహిత్య సృజన మొదలు పెట్టింది. నారాయణగౌడ్ ఇంజనీరుగా హైదరాబాదులో స్థిరపడడంతో, ఆ నగరమే ఆమె జీవితానికి, రచనలకు కేంద్రమైంది. 1973లో కోడలి పేరుతో "హేమా దేవి" అనే కలం పేరు స్వీకరించి వ్రాసిన కుంకుమ పూలు కథకు తొలి బహుమతి దక్కడంతో ఆ పేరే శాశ్వతమైంది. అప్పటి నుండి ఆమె రచనలు "బొమ్మ హేమాదేవి" పేరిట తెలుగు పాఠక లోకంలో విస్తారంగా ప్రసిద్ధి చెందాయి. హేమా దేవి రచనా ప్రస్థానం 1960లలో ప్రారంభమై, దాదాపు నలభై ఏళ్లపాటు అచంచలంగా కొనసాగింది. తొలి నవల భావన భార్గవి 1960లో వెలువడింది. అనంతరం నవధాన్యాలు, నవరసాలు, దీప, తార, లవ్ స్టోరీ, తపస్విని, కుంకుమ పూలు, నవ భారతి, ప్రేమే నేరమౌనా, వంటి నవలలు వెలువరించింది. నవలలతో పాటు వందకు పైగా కథలను కూడా రచించింది. అన్నపూర్ణ, అభయ, ఆలింగనము, ఇజాజత్ హై, ఏక్ స్కూటర్ కీ వాపసీ, మిస్టర్ అనంత్, మేఘన, బాంచెన్ దొరసానీ, చిరుదీపం, నవతరం వంటి కథలు సామాజిక అన్యాయాలు, కుటుంబ విభేదాలు, ప్రేమ, మానవ సంబంధాల వివిధ కోణాలను స్పష్టంగా ప్రతిఫలించాయి. రేడియో నాటికల రచనలోనూ ఆమె ప్రతిభ ప్రతిభా సంపన్నమైంది. పొగమంచు వంటి రేడియో నాటికలు ఆ కాలంలో శ్రోతల ఆదరణ పొందాయి. హేమా దేవి రచనలు ఆ కాలంలో ప్రసిద్ధిగాంచిన జయశ్రీ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ప్రజాతంత్ర, తరుణ, కళాసాగర్, అనామిక, సామ్య, ప్రభవ మొదలైన పత్రికలలో ధారా వాహికలుగా వచ్చాయి. ఆమె సాహిత్యంలో మహిళా జీవితానుభవాలు, కుటుంబ ఆచారాలు, సంప్రదాయాల ఒత్తిడి మాత్రమే కాకుండా, బిసి వర్గాల వాస్తవాలు, దళిత జీవన చిత్రణ కూడా చోటు చేసుకున్నాయి. అందువల్ల ఆమెను తెలుగులో తొలి బిసి స్త్రీవాద రచయిత్రిగా పరిగణించారు. %వశ్రీబస్త్రబ ఔశీఎవఅ ఔతీఱవతీం 1950-%1975 వంటి పరిశోధన గ్రంథాల్లో ఆమె రచనలకు ప్రత్యేక ప్రస్తావన లభించింది. 2017లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో "బొమ్మ హేమాదేవి కథలు" అనే కథల సంకలనం వెలువడింది. ఈ గ్రంథం ఆమె సాహిత్య వారసత్వాన్ని తదుపరి తరాలకు చేరువ చేసింది. 1996 నవంబరు 26న 65 ఏళ్ల వయసులో హేమాదేవి కన్నుమూశారు. కానీ ఆమె సాహిత్యం మాత్రం చిరస్థాయిగా నిలిచింది. మహిళా స్వరాన్ని వెలుగులోనికి తెచ్చిన ఆమె రచనలు స్త్రీ వాద చైతన్యానికి బలాన్నిస్తూనే, సమాజంలోని అన్యాయాలపై ప్రశ్నలెత్తే అగ్ని జ్వాలలుగా నిలిచాయి. సరళమైన శైలి, యదార్థ వాదం, సామాజిక చైతన్యం కలగలిపిన ఆమె నవలలు, కథలు నేటికీ పాఠక హృదయాలను కదిలిస్తూనే ఉన్నాయి. అందువల్ల బొమ్మ హేమా దేవి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయి కీర్తిని సంపాదించిన విశిష్ట రచయిత్రిగా నిలిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆ ఆఫర్లు ప్రమాదకరం.. రష్యా సైన్యంలో చేరొద్దు




దిల్లీ: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో కొందరు భారతీయులు రష్యా సైన్యం తరఫున పనిచేస్తున్నట్లు పలుమార్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఈ అంశం కేంద్రం దృష్టికిరాగా.. ఈ నియామకాలపై విదేశాంగశాఖ స్పందించింది. రష్యన్ ఆర్మీ ఆఫర్లు ప్రమాదకరమని హెచ్చరించింది. "రష్యా సైన్యంలో భారతీయ పౌరులను నియమించు కున్నట్లు ఉన్న నివేదికలు మా దృష్టికి వచ్చాయి. రష్యా సైన్యంతో పనిచేయడం వల్ల కలిగే ప్రమాదాల గురించి ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు హెచ్చరించింది. ఇదంతా ప్రమాదకర వ్యవహారం కాబట్టి.. రష్యా సైన్యంలో చేరేందుకు ఇచ్చే ఆఫర్లకు దూరంగా ఉండాలని, అందులో చేరొద్దని మరోసారి సూచిస్తున్నాం. అక్కడ పనిచేస్తున్న వారిని కూడా వెనక్కి పంపించాలని కోరుతూ రష్యా అధికారులతో చర్చలు జరుపుతున్నాం. బాధిత కుటుంబాలనూ సంప్రదిస్తున్నాం" అని ప్రభుత్వ ప్రకటన ద్వారా విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అప్రమత్తం చేశారు.

**జోక్యం చేసుకోవద్దు.. అమెరికాకు చైనా వార్నింగ్...** నిర్మాణపనుల సాకుతో తమను రష్యాకు రప్పించి యుద్ధంలో మోహరించారని ఉక్రెయిన్‌లోని దొనెట్స్క్ ప్రాంతంలోని ఇద్దరు భారతీయులు ఆరోపించారు. వారు స్టూడెంట్ లేక విజిటర్స్ వీసా మీద అక్కడికి వెళ్లారని సమాచారం. ఈ విషయం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ఈ వ్యవహారాన్ని దిల్లీ, మాస్కోలోని రష్యా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. గతంలోనూ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం.. అక్కడ ఉన్నవారిని స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంపై తీవ్రఒత్తిడి తీసుకువచ్చింది. గతేడాది రష్యాలో పర్యటించిన ప్రధాని మోదీ.. ఈ పరిస్థితి గురించి పుతిన్‌తో ప్రధానంగా చర్చించిన విషయం తెలిసిందే.

# అమెరికాకు చైనా వార్నింగ్




తమను అదుపు చేయాలనుకోవడం, లేదా తమ విషయాల్లో జోక్యం చేసుకొనే ప్రయత్నాలు చేయొద్దని చైనా అమెరికాను హెచ్చరించింది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్, చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్‌లు వర్చువల్‌గా సమావేశమై మాట్లాడుకున్నారు. ఈసందర్భంగా నేపాల్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితులతో సహా పలు కీలక అంశాలపై చర్చించారు. స్వాతంత్ర్యానికి మద్దతు ఇస్తున్నా మంటూ చైనాను అదుపు చేసేందుకు తైవాన్‌ను పావుగా ఉపయోగించుకోవాలని చూడొద్దని డాంగ్ పేర్కొన్నారు. తమ విషయాల్లో జోక్యం చేసుకొనే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన యూఎస్‌ను హెచ్చరించారు. ఈసందర్భంగా తైవాన్ తమ భూభాగంలో భాగమని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఉన్న వాషింగ్టన్ రక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. కొన్ని దేశాలు దక్షిణ చైనా సముద్రంలో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలను చేపట్టాయని డాంగ్ ఆరోపించారు. బయటి దేశాలు అశాంతిని సృష్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు.

**ఫ్రాన్స్‌లో నిరసనల ఉద్ధృతి...** సమానమైన, గౌరవప్రదమైన శాంతియుతంగా ఉండే సైనిక సంబంధాన్ని నిర్మించుకోవాలని ఈసందర్భంగా డాంగ్ పిలుపునిచ్చారు. ఒకరి ప్రయోజనాలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. వాషింగ్టన్‌తో సైనిక సంబంధాలకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చైనాతో చర్చలు అద్భుతంగా జరిగాయని పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ పేర్కొన్నారు. బీజింగ్‌తో ఎలాంటి వివాదాన్ని తాము కోరుకోవడం లేదని హెగ్సేత్ ఆ దేశానికి స్పష్టంచేశారని పార్నెల్ తెలిపారు. చైనాలో పాలన మార్పును కోరడం లేదన్నారు. ఆసియా- పసిఫిక్ తీరంలో చైనా ఆధిపత్యాన్ని హెగ్సేత్ ఈసందర్భంగా ఖండించినట్లు వెల్లడించారు. తైవాన్ జలసంధిలో శాంతికి మద్దతు తెలపడంతో పాటు అంతర్జాతీయ జలాల్లో అందరికీ సమాన హక్కులు ఉంటాయని హెగ్సేత్ పునరుద్ఘాటించినట్లు వెల్లడించారు. ఇరుదేశాల మధ్య తదుపరి చర్చలకు ఇద్దరు మంత్రులు అంగీకరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంపై భారత్‌తో సహా చైనాపై కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో చైనా, అమెరికా నేతల మధ్య చర్చలు జరగడం గమనార్హం. మరోవైపు.. అక్టోబరులో దక్షిణ కొరియాలో జరగనున్న ఆసియా- పసిఫిక్ ఆర్థిక సహకార వాణిజ్య మంత్రుల సమావేశానికి ట్రంప్ హాజరువుతారని ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో ఆయన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా ద్వైపాక్షిక భేటీ జరపనున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి.

# నేపాల్ తగలబడడానికి 'నెపోకిడ్స్' విలాసాలే కారణం



నేపాల్ రాజకీయాలపై ఇటీవలి పరిణామాలు ఒక గట్టి హెచ్చరికను అందిస్తున్నాయి. అధికారం కేవలం కుటుంబాల చుట్టూ తిరిగితే.. ప్రజలు నిర్లక్ష్యానికి గురైతే, అసమానతలు విపరీతంగా పెరిగితే యువత మౌనంగా ఉండదు. అదే జరిగింది కాఠ్మండూ వీధుల్లో అని నిరూపితమైంది. నేపాల్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు కేవలం ఒక ప్రభుత్వ పతనంగా మాత్రమే చూడలేం. ఇవి దేశ రాజకీయ%-%సామాజిక వ్యవస్థలో లోతైన మార్పుల అవసరాన్ని సూచిస్తున్నాయి. రాజకీయ నాయకులు దశాబ్దాలుగా ప్రజా సంక్షేమం పేరుతో కుర్చీలను దక్కించుకున్నారు. అయితే, వారసత్వ రాజకీయాన్ని ఒకవైపు భద్రపరుస్తూ, మరోవైపు విలాసాలకు విరాళమిచ్చారు. ఈ రాజకీయ నేతల పిల్లలు "నెపో కిడ్స్" లగ్జరీ జీవితాన్ని ప్రదర్శించగా, దేశంలోని యువత ఉద్యోగాల కోసం తలుపులు తట్టుకుంటూనే ఉన్నారు. సోషల్ మీడియా ఈ రెండు ప్రపంచాల మధ్య ఉన్న అసమానతను బహిర్గతం చేసింది. చివరికి, అది తిరుగుబాటు చిచ్చు పెట్టింది. ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేయడం ఒక ముఖ్యమైన సంఘటన. కానీ అసలు ప్రశ్న ఏమిటంటే ఇది కేవలం వ్యక్తిగత రాజీనామా వరకే పరిమితమా? లేక వ్యవస్థను కదిలించే దిశగా మొదటి అడుగా? యువత డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. అవినీతి నిర్మూలన, రాజ్యాంగ మార్పులు, ఆర్థిక సమానత్వం. ఇవి నెరవేరకపోతే, ఈ అగ్ని మళ్లీ రగులుతుందనే సందేహం లేదు.

**రాజకీయ కుటుంబాల విలాసాలు - ప్రజల కోపానికి కేంద్రబిందువు...** నేపాల్‌లో నేతల కుటుంబాలు, ముఖ్యంగా వారి పిల్లలు, "నెపో కిడ్స్" పేరుతో విలాసవంతమైన జీవనశైలిని ప్రదర్శించడం యువతలో అసహనాన్ని పెంచింది.

సాధారణ ప్రజలు నిరుద్యోగం, పేదరికంతో అల్లాడుతుంటే, రాజకీయ వారసుల ఖరీదైన దుస్తులు, లగ్జరీ టూర్లు, సోషల్ మీడియాలో షో ఆఫ్ చేయడం కోపాన్ని రగిలించింది.

**జెన్‌జెడ్ పాత్ర - సోషల్ మీడియా నుంచి వీధుల వరకు...** సోషల్ మీడియా నిషేధం యువతను కట్టడి చేయడానికి ప్రభుత్వ ప్రయత్నంగా కనిపించినా, అదే నిర్ణయం తిరుగుబాటుకు చిచ్చు పెట్టింది. #NepoBabiesNepal వంటి క్యాంపెయిన్‌లు ఆగ్రహాన్ని ఒకే దిశలో కేంద్రీకరించాయి. ఆన్‌లైన్ నుంచి ఆఫ్‌లైన్‌కి మారిన ఈ ఆందోళనలు, జెన్‌జెడ్ సమూహాన్ని ఒక కొత్త రాజకీయ శక్తిగా నిలిపాయి.

**నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు - మూల కారణాలు...** నేపాల్‌లో 15-24 ఏళ్ల యువతలో 20% కంటే ఎక్కువ మంది నిరుద్యోగులు. వార్షిక ఆదాయం తక్కువగా ఉండడం, వలసల పెరుగుదల, అవినీతి ఇవన్నీ అసంతృప్తికి కారణమయ్యాయి. ఈ క్రమంలో, నెపో కిడ్స్ విలాసాలు సామాజిక అసమానతకు బలమైన ప్రతీకగా మారాయి.

**హింసాత్మక నిరసనలు - ప్రభుత్వ వైఫల్యం...** ప్రదర్శనలను అణచడానికి ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దింపడం, కర్ఫ్యూలు విధించడం ఆందోళనలను మరింత పెంచింది.. 20 మందికి పైగా మరణించడం, వేలాది గాయపడడం ఇది ప్రభుత్వ అణచివేత విధానాన్ని బయటపెట్టింది. చివరికి, ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేయక తప్పలేదు.

**భవిష్యత్తు దిశ - మార్పు కోసం అవకాశమా?...** మాజీ చీఫ్ జస్టిస్ సుషీలా కార్కి తాత్కాలిక ప్రధానిగా ఎంపిక అవుతారనే వార్తలు యువతలో ఆశలను రేకెత్తిస్తున్నాయి. కానీ ప్రధాన సవాలు ఏమిటంటే.. ఈ ఆగ్రహాన్ని రాజ్యాంగ మార్పులు, అవినీతి విచారణలు, ఆర్థిక సంస్కరణలు వంటి వ్యవస్థాగత మార్పులుగా మలచగలరా అన్నది. నేపాల్‌లో "నెపో కిడ్స్" పై తిరుగుబాటు కేవలం రాజకీయ వారసత్వాన్ని ప్రశ్నించడం మాత్రమే కాదుబీ అది సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం కోసం యువత పోరాటం. ఈ సందర్భం దక్షిణాసియా రాజకీయాలకు ఒక గట్టి హెచ్చరిక.. అసమానతలు పెరిగితే, యువత సామాజిక మాధ్యమాలనుంచి వీధుల్లోకి వస్తారు.

# గణేష్ నిమజ్జనంలో మృత్యుశకటమైన లారీ.. భక్తులపైకి.. మరణమృదంగం

కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఘోర ప్రమాదం సంభవించింది. మోసలే హొసహళ్లి ప్రాంతంలో గ్రామస్తులు ఆనందోత్సాహాలతో వినాయక విసర్జన శోభాయాత్రలో పాల్గొంటున్న సమయంలో ఒక లారీ అదుపుతప్పి ఊరేగింపులోకి దూసుకెళ్లింది. ఈ భయానక ప్రమాదంలో తొలుత 8 మంది మృతిచెందినట్లు సమాచారం అందగా.. అనంతరం సంఖ్య 9కి పెరిగింది. మృతుల్లో ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు, ఆరుగురు గ్రామస్తులు ఉన్నారని అధికారులు ధృవీకరించారు.

**ప్రమాదం ఇలా జరిగింది...** రాత్రి 8 గంటల సమయంలో జాతీయ రహదారి (%చీ%-373)పై ఈ ఘటన జరిగింది. ఎదురుగా వస్తున్న ఒక బైక్‌ను తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించగా లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఎక్కి తప్పు దిశలో దూసుకెళ్లింది. భారీ వేగంతో దూసుకొచ్చిన లారీ క్షణాల్లోనే ఊరేగింపులోకి దూసుకెళ్లి దారుణానికి కారణమైంది. ప్రమాద తీవ్రత అంతలా ఉండటంతో భక్తులు గాల్లో ఎగిరిపడిపోగా, అక్కడి వాతావరణం ఒక్కసారిగా కల్లోలమైంది.

**గాయపడిన వారి పరిస్థితి...** ఈ ఘటనలో దాదాపు 25%-%30 మంది వరకు గాయపడ్డారు. వారిని సమీపంలోని కిమ్స్ ఆసుపత్రి సహా వివిధ ఆసుపత్రులకు తరలించారు. వారిలో కొందరి పరిస్థితి



విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం పోలీసులు, రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.


**అధికారుల స్పందన...** హసన్ జిల్లా ఎస్పీ మహమ్మద్ సుజీత్ ఎంఎస్ మాట్లాడుతూ... "ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ గాయపడినప్పటికీ అతడిని అదుపులోకి తీసుకున్నాం. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం" అని తెలిపారు. హసన్ డిప్యూటీ కమిషనర్ కెఎస్ లతా కుమారి మాట్లాడుతూ... "22 మంది కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో ఏడుగురు ప్రైవేట్ ఆసుపత్రిలో ఉన్నారు. మృతులలో ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఉన్నారని సమాచారం" అని చెప్పారు.

**ప్రభుత్వం ప్రకటించిన సాయం...** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించడంతో పాటు గాయపడిన వారి వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. "ఉత్సవంగా ప్రారంభమైన వినాయక విసర్జన క్షణాల్లో విషాదంగా మారడం అత్యంత బాధాకరం. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది" అని సీఎం పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా హృదయపూర్వక సంతాపం వ్యక్తం చేస్తూ... "మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ తీవ్ర దుఃఖాన్ని భరించే ధైర్యం కలగాలని దేవుని ప్రార్థిస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి" అని అన్నారు.

**స్థానికుల దిగ్భ్రాంతి...** అనుకోకుండా జరిగిన ఈ దారుణ ఘటనతో మోసలే హొసహళ్లి ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉత్సవంగా సాగిన గణేష్ విసర్జన ఊరేగింపు క్షణాల్లో శోకసంద్రంగా మారిపోవడంతో గ్రామం మొత్తం కన్నీటి వాతావరణంలో మునిగిపోయింది.

# శాంతించిన బంగారం ధరలు.. సామాన్యుడికి ఊరట దొరికేనా?

బంగారం.. బంగారం.. బంగారం.. ప్రస్తుతం ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ.. కారణం సామాన్యుడికి అందనంత ఎత్తుకు ఎదిగిపోవడమే అని చెప్పవచ్చు. ఒకప్పుడు బంగారం ధరలు అందరికీ అందుబాటులో ఉండేవి. చాలామంది తమకు ఇష్టమైన, నచ్చిన ఆభరణాన్ని తయారు చేయించుకొని మరీ ధరించేవారు. కానీ ఇప్పుడు బంగారం అంటేనే భయపడిపోతున్నారు. సాధారణంగా మన భారత దేశంలో ఫంక్షనులకు , పెళ్లిళ్లకు బంగారం తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందే. ఇలాంటి సమయంలో తులం 22 క్యారెట్ల బంగారం ఏకంగా లక్ష రూపాయలు దాటడంతో సామాన్యుడు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇలాంటి సమయంలో కాస్త సామాన్యుడికి ఊరట కలిగింది అని చెప్పవచ్చు. ముఖ్యంగా శాంతించిన ఈ బంగారం ధరలు కొంతమేర ఉపశమనం కలిగించాయి అని చెప్పడంలో



సందేహం లేదు. ఇకపోతే ఈరోజు అనగా సెప్టెంబర్ 13వ తేదీ శనివారం బంగారం ధరలు ఏ విధంగా ఉన్నాయి అనే విషయం ఇప్పుడు ఒకసారి చూద్దాం. భౌగోళిక, రాజకీయ అనిశ్చిత్తుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తులు వైపు మొగ్గుచూపడం వల్లే ఇప్పుడు బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. దీనికి తోడు డాలర్ తో పోల్చుకుంటే రూపాయి విలువ క్రమంగా క్షీణించడం కూడా బంగారం ధర పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. మరి ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయి అనే విషయానికొస్తే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర పై ఏకంగా 110 రూపాయలు తగ్గి రూ.1,11,170కి చేరుకోగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై వంద రూపాయలు తగ్గి రూ.1,01,900 కి చేరుకుంది. బంగారం ధరలలో దాదాపు 100 రూపాయల వరకు తగ్గుదల కనిపించగా అటు వెండిలో మాత్రం ఏకంగా వెయ్యి రూపాయల పెరుగుదల కనిపించి సామాన్యుడికి మరో షాక్ కలిగింది అని చెప్పవచ్చు.

నిన్నటి వరకు రూ.1,42,000గా నమోదైన కేజీ వెండి.. ఇప్పుడు ఏకంగా రూ.1000 పెరిగి 1,43,000 కి చేరుకుంది. రెండు రోజుల్లోనే కేజీ సిల్వర్ పై ఏకంగా రూ.3 వేలు పెరగడం గమనార్హం. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

# సంపాదకీయం

## అమ్మ రాయబారం

### బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది?

తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్‌లో నెలకొన్న అంతర్గత రాజకీయ కుంపటిని చల్లార్చే దిశగా పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రయత్నాలు ప్రారంభించారా? ఇప్పటి వరకు ఎలా ఉన్నా.. భవిష్యత్తులో ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పార్టీ పరిణామాలను సరిచేసేందుకు ఆయన రెడీ అయ్యారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. తాజాగా కేసీఆర్ సతీమణి.. కల్వకుంట్ల శోభ.. తన కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు.. కవిత ఇంటికి వెళ్లారు. అయితే.. ఆమె చెబుతున్న కారణం వేరే ఉన్నా.. ఈ రాక వెనుక.. రాయబారం ఉందన్న వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. కత్తికి లొంగనిది కూడా.. కన్నతల్లికి లొంగుతుందన్న సామెతను నిజం చేసే దిశగా బీఆర్ ఎస్‌లో నెలకొన్న వివాదాలను పరిష్కరించేందుకు శోభ ప్రయత్నిస్తున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. తండ్రికి మద్దతు ఇస్తున్న కవిత.. హరీష్‌రావు, సంతోష్ రావులను తీవ్రంగా విభేదిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరగలేదని విపక్ష నేతలు చెబుతుంటే.. జరిగిందన్నట్టుగా మాట్లాడి మరో రచ్చ చేశారు. దీంతోనే ఆమెపై బహిష్కరణ వేటు వేయాలని పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చారు. కానీ, కేసీఆర్ అంత పనిచేయలేక.. కేవలం సస్పెన్షన్‌కే పరిమితం చేశారు. అయితే.. ఈ విషయంలోనూ.. కేసీఆర్‌పై ఒత్తిళ్లు పనిచేస్తున్నాయని తెలుస్తోంది. కన్న బిడ్డపై వేటు వేయడం ద్వారా.. పార్టీని బలహీన పరుచుకోవడం సరికాదని సీనియర్లు, ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌తో ఉన్న వారు కూడా చెబుతున్నారు. తప్పులు జరుగుతాయని.. తప్పులు జరగకపోతే రాజకీయాలు లేవని.. అంత మాత్రాన.. ఇంటి బిడ్డపై వేటు వేస్తే.. అది తప్పుడు సంకేతాలు ఇచ్చినట్టు అవుతుందని వారు చెబుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే కేసీఆర్.. మున్ముందు ఈ పరిణామాలు పెరగకుండా.. ప్రస్తుతం నెలకొన్న ఇబ్బందులను తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. ఇక, తాజాగా శోభ.. తన కుమార్తె ఇంటికి వచ్చారు. తన అల్లుడు అనిల్ కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని కూతురు, అల్లుడికి కొత్త బట్టలు తీసుకువచ్చారు. పైకి ఈ కారణమే చెబుతున్నా.. లోలోపల మాత్రం చర్చల దిశగానే కుమార్తెను ఊరడించేందుకు సంయమనం పాటించేలా సర్దుబాటు చేసేందుకు శోభ ప్రయత్నించారని సమాచారం. ఎందుకంటే.. వారం కిందట మనవడి పుట్టిన రోజుకు రావాలని పిలిచినా రాని శోభ.. అల్లుడి పుట్టిన రోజుకు రావడం వెనుక రాజకీయ కారణాలే ఉంటాయని అంటున్నారు. మరి "అమ్మ రాయబారం" ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

## తెలుగు జాతికి గాడిచర్ల బహుముఖ సేవలు - సెప్టెంబర్ 14...గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతి




ఆంధ్రులలో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా పేరుపొందిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు (సెప్టెంబర్ 14, 1883 – ఫిబ్రవరి 29, 1960) స్వాతంత్ర్య సమర యోధుడిగా, పత్రికా రచయితగా, సంపాదకులుగా, సాహితీకారుడిగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా ఆయన తెలుగు జాతికి బహుముఖ సేవలు అందించారు. ఆంగ్ల పదం ఎడిటర్ కు సంపాదకుడు అనే తెలుగు పదాన్ని ప్రవేశపెట్టిన వ్యక్తి.ఎం.ఏ డిగ్రీ పొందిన ఆంధ్రులలో ఆయన రెండవ వారు. 1883 సెప్టెంబర్ 14 న కర్నూలులో భాగీరథీ బాయి, వెంకటరావు దంపతులకు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జన్మించారు . వారి పూర్వీకులు కడప జిల్లా, సింహాద్రిపురం గ్రామానికి చెందినవారు. వారిది పేద కుటుంబం. కర్నూలు, గుత్తి, నంద్యాలలో ప్రాథమిక, ఉన్నత విద్య చదివారు. ఇంకా చదువుకునే ఆర్థికస్తోమత లేకున్నప్పటికీ, ప్రతిభా పారితోషికాల సహాయంతో 1906లో మద్రాసు లో ఎం.ఏ డిగ్రీ పూర్తి చేసారు. తరువాత రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతుండగా,1907లో స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారు. రాజమండ్రిలో బిపిన్ చంద్ర పాల్ చేసిన ఉపన్యాస స్ఫూర్తితో విద్యార్థులంతా వందేమాతరం బ్యాడ్జిలు ధరించి తరగతికి వెళ్ళారు. వారికి నాయకుడైన సర్వోత్తమ రావును కళాశాల నుండి బహిష్కరించడమే కాక, ఆయనకు ఎక్కడా ఉద్యోగమివ్వ రాదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తరువాత ఆయన పత్రికా రంగంలోకి అడుగు పెట్టారు. స్వరాజ్య అనే తెలుగు పత్రికను ప్రారంభించి, బ్రిటిషు పాలనపై విమర్శలు ప్రచురించేవారు. 1908లో తిరునెల్వేలిలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు మరణించినపుడు "క్రూరమైన విదేశీ పులి" అనే పేరుతో ఆయన రాసిన సంపాదకీయంపై ప్రభుత్వం కోపించి, ఆయనకు మూడేళ్ళ ఖైదు విధించింది. ఆ విధంగా ఆయన ఆంధ్రులలో ప్రప్రథమ రాజకీయ ఖైదీ అయ్యారు. వెల్లూరు జైలులో, బందిపోట్లు, గజదొంగలూ ఉండే గదిలో ఆయనను బంధించి, అమానుషంగా వ్యవహరించింది, బ్రిటిషు ప్రభుత్వం. జైలు నుండి విడుదల అయ్యాక కూడా ఆయనపై ప్రభుత్వ నిఘా ఉండేది. ప్రజలు ఆయనతో మాట్లాడటానికి కూడా భయపడేవారు. 1914లో బాల గంగాధర తిలక్ యొక్క హోం రూల్ లీగ్కు ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా విస్తృతంగా ప్రచారం చేసారు. 1924లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభల సమయంలో హిందూస్థానీ సేవా దళ్ ఏర్పాటులో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. 1927లో కాంగ్రెసు అభ్యర్థిగా నంద్యాల నియోజక వర్గం నుండి మద్రాసు కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా కూడా పనిచేసారు. 1930 నుండి రాజకీయ కార్యక్రమాలు తగ్గించుకుంటూ, తనకెంతో ప్రీతిపాత్రమైన గ్రంథాలయోద్యమం వైపు దృష్టి మరల్చారు. ఆంధ్ర గ్రంథాలయ సంస్థకు 1934 నుండి జీవితాంతం అధ్యక్షులుగా ఉన్నారు. గ్రంథాలయ కార్యకర్తలకు, వయోజన విద్యా ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచించారు, శిక్షణా శిబిరాలు నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1952లో జరిగిన అఖిలపక్ష సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. దాని తరపున రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేసారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రమే కాక, సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు కూడా చూసి, 1960 ఫిబ్రవరి 29 న గాడిచర్ల హరి.సర్వోత్తమ రావు మరణించారు.

ఆయన స్మారకార్థం విజయవాడలో సర్వోత్తమ భవనం వెలసింది. పత్రికా రచయితగా, సంపాదకులుగా, పుస్తక రచయితగా ఆయన చేసిన కృషి బృహత్తర మైనది. తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, మరాఠీ మొదలైన భాషలు కూడా ఆయనకు వచ్చేవి. ఎం.ఏ చదివే రోజుల్లోనే మొదలైన ఆయన సాహితీ వ్యాసంగం, జీవితాంతం కొనసాగింది. ఎన్నో కొత్త పదాలు సృష్టించారు. ప్రముఖ దినపత్రిక ఆంధ్ర పత్రికకు ఆయన తొలి సంపాదకులుగా, 1916 నుండి 1918 వరకు సంపాదకుడుగా ఉన్నారు. ది నేషనలిస్ట్, మాతృసేవ, ఎడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ, కౌముది, ఆంధ్రవార్త అనే పత్రికలకు కూడా సంపాదకత్వం నిర్వహించారు. మహిళల సమస్యలు పరిష్కరం కోసం " సౌందర్యవల్లి " అనే పత్రిక నడిపారు. మద్రాసు గ్రామ పంచాయితీ అనే పత్రిక యొక్క తెలుగు, తమిళ, ఇంగ్లిషు ప్రతులకు సంపాదకుడిగా ఉన్నారు. సంపాదకుడు, భావకవిత్వం అనే పదాలను పరిచయం చేసింది కూడా ఆయనే. జి.హెచ్.ఎస్ పేరుతో హిందూ పత్రికకు వ్యాసాలు రాసారు. స్పిరిట్యువల్ స్వదేశీ నేషనలిజం అనే పుస్తకం రాసారు. ఆయన రాసిన శ్రీరామ చరిత్ర అనే పుస్తకాన్ని 11 వ తరగతికి ఉపవాచకంగా ప్రభుత్వం తీసుకున్నది. ఆయన రచించిన పౌరవిద్య అనే పుస్తకాన్ని మద్రాసు ప్రభుత్వం 1 నుండి 6 తరగతుల వరకు పాఠ్య పుస్తకంగా నిర్ణయించింది. వయోజన విద్య అనే తెలుగు పుస్తకాన్ని రచించారు. ఆయన వ్రాసిన అబ్రహాము లింకను చరిత్ర (1907) అనే పుస్తకాన్ని కొమర్రాజు వెంకటలక్ష్మణరావు సంకలించి విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో భాగంగా ప్రచురించారు. రాయలసీమ కు ఆ పేరు పెట్టింది ఆయనే. 1928లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో రాయలసీమ పేరును గాడిచర్ల, చిలుకూరు నారాయణ రావు చేసిన సూచనతో ఏకీభవించి ఆ పేరు పెట్టారు. అప్పటి వరకు దత్తమండలం అని పిలిచేవారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## రాజకీయ సాహిత్య సవ్యసాచి బూర్గుల - సెప్టెంబర్ 14... బూర్గుల రామకృష్ణారావు వర్ధంతి

అపర చాణక్యునిగా పేరెన్నిక గన్న దివంగత ప్రధాని పివి నరసింహారావుకు ఆయన గురువు. ఆయన న్యాయవాది, బహుభాషా వేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు, రాజనీతిజ్ఞుడు. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సాహితీ వేత్త. బహు భాషా కోవిదులు. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసిన తొలితరం కాంగ్రెస్ నాయకులు. ఆయనే హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజల ద్వారా ఎన్నికైన మొట్టమొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. బూర్గుల న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఆయన వద్ద పి.వి. సహాయకునిగా పనిచేయడమే కాకుండా రాజకీయాల్లో ఆయన వారసునిగా ఎదిగారు. రామకృష్ణారావు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. ఇంటి పేరు పుల్లం రాజు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే ఇంటి పేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివారు. బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకుల మన్ననలు పొందారు. 1922లో ఆంగ్ల ప్రభుత్వం వారు బీరార్ ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివి నరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొన్నారు. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసారు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖులు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ఆంధ్రమహా సభకు బూర్గుల అధ్యక్షత వహించారు. శాసనోల్లంఘన ఉద్యమం లోను, క్విట్ ఇండియా ఉద్యమం లోను పాల్గొని కారాగార వాసం అనుభవించారు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్య మంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యారు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించారు. 1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు, మహబూబ్ నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యారు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్య మంత్రిగా పేరుగాంచారు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా, బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా నియుక్తులై, 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా కొనసాగారు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా విశేష సాంస్కృతిక సేవలందించారు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. ఆయన అనేక భాషలలో నిష్ణాతులు. అవన్నీ ఆయన సొంతంగా, ఆసక్తితో నేర్చుకున్నవే. అర్ధరాత్రి వరకు ఫైళ్లలో నిమగ్నమై, తర్వాత బూర్గుల సంస్కృతంలో మునిగి తేలేవారు. బూర్గుల బహు భాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. మహారాష్ట్రలో చదివే రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు, సానెట్లు, వ్యాసాలు రాసి కాలేజీ సంచికలో ప్రచురించారు. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్మృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు. ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి. పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీ పంచకమును, శంకరాచార్యుల సౌందర్య లహరి, కనకధారా స్తవమును తెలుగులోకి అనువదించారు. కృష్ణ శతకం, సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీస్తుతి, వాణీస్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలం–మత సంస్కృతులు (పరిశోధనా వ్యాసం) మొదలైనవి ఆయన ఇతర రచనలు. అయన రచించిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరుతో అచ్చయింది. పండిత రాజ పంచామృతం, కృష్ణశతకం, వేంకటేశ్వర సుప్రభాతం, నర్మద్.గీతాలు, పుష్పాంజలి, తొలిచుక్క (కవితలు), నివేదన (కవితలు), పారశీక వ్మాయ చరిత్ర మొదలైన గ్రంథాలు వెలువరించడమే కాకుండా ఎన్నో కావ్యాలకు పీఠికలు రాశారు. అనువాద రచనలు కూడా చేశారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి సాహితీలోక ప్రసిద్ధులైనారు. ఆయనకు1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది. 1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండె పోటుతో మరణించారు.



**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## జాతి ఐక్యతకు దోహదకారి హిందీ - సెప్టెంబర్ 14... రాష్ట్ర భాషా దినోత్సవం

భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏక తాటిపై నడిపి, హిందీ భాష ఆనాడు దోహద పడిందనే భావనతో గాంధీజీ స్ఫూర్తితో, 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగం లోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయ భాషగా గుర్తిస్తూ పొందుపరిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా నుండి ఈ తేదీని "హిందీ దివస్" (రాష్ట్ర భాషా దినోత్సవం) గా జరుపు కోవడం ఆనవాయితీ. ప్రశంసలు పొందిన భారతీయ పండితుడు, చరిత్ర కారుడు, వేదాంతవేత్త, సాహితీ వేత్త, హిందీ పండితుడు, సర్వోదయ కార్యకర్త, గాంధేయ వాది, పాత్రికేయుడు, రాజకీయ నాయకుడు, సంస్కృత భాషపై సాధికారికత కలిగిన, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన బీయాహర్ రాజేంద్ర సింహా, 1949 సెప్టెంబర్ 14 న తన 50 వ పుట్టిన రోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తరువాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బియాహర్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త మరియు సేథ్ గోవింద్ దాస్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ భారత రాజ్యాంగ సభ భారతదేశ రిపబ్లిక్ యొక్క రెండు అధికారిక భాషలలో దేవనాగరి లిపిలో వ్రాయబడిన ఒకటిగా హిందీని రాజ్యాంగ సభ ఆమోదంతో స్వీకరించింది. 1949 సెప్టెంబరు 14వ తేదీన హిందీని జాతీయ భాషగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా, ఈ నిర్ణయం 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో వ్రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారత దేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి, వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించ బడతాయి: హిందీ, ఇంగ్లీష్. అధికారిక భాష హిందీ దేవనాగరిక లిపి నుంచి రూపొందించ బడింది. ఈ భాష ఇండో యూరోపియన్ భాష సంతతికి సంబంధించిన ఇండో–ఆర్యన్ శాఖకు చెందినది. హిందీ అంటే "పర్షియన్ కానుక" అని అర్థం. హిందీ" మరియు "హిందూ" అనే పదాలు పాత పర్షియన్ కు చెందినవి, ఇవి "సింధు నది"ని సూచించే సంస్కృత పేరు సింధు నుండి వచ్చాయి. దీని అర్థం " హింద్ (భారత దేశం) యొక్క లేదా చెందినది". హిందీ భాష చాలా వరకూ సంస్కృతం నుంచి గ్రహించ బడినది. అయితే కాలక్రమంలో ఉత్తర భారతదేశం లోని ముస్లిం ప్రభావం వల్ల పర్షియన్, అరబిక్, టర్కిష్ పదాలు హిందీలో చేరి ఉర్దూ భాష ఆవిర్భవించింది. మనం శుద్ధ హిందీ(ప్యూర్ హిందీ) భాషను రేడియోలలో, టి.వి. వార్తలలో వినవచ్చు. ప్రస్తుతం చలామణిలో ఉన్న హిందీ భాష చాలా వరకూ సులభతరం చేయ బడింది. ఉత్తర భారత దేశంలో ఇస్లామిక్ పరిపాలన వచ్చిన తరువాత, పాత హిందీ పెర్షియన్, అరబిక్ నుండి అనేక రుణ పదాలను సంపాదిం చింది. ఇది హిందూస్థానీ అభివృద్ధికి దారి తీసింది. అవధి మరియు బ్రజ్ భాష వంటి సాహిత్య ప్రామాణీ కరణ ద్వారా హిందీ బెల్ట్ యొక్క వివిధ మాండలికాలు మరియు భాషలు




ప్రాముఖ్యతను సంతరించు కున్నాయి. మొఘల్ కాలం (1800 లు) చివరి భాగంలో భాషా ప్రతిష్ఠను పొందింది. ఆధునిక హిందీ మరియు దాని సాహిత్య సంప్రదాయం 18 వ శతాబ్దం చివరిలో ఉద్భవించింది. ముందుగా దీనిని ఉత్తర భారత దేశం యొక్క భాషగా (ప్రస్తుత పాకిస్తాన్ తో సహా ) బ్రిటిష్ వలస వాదులు మరియు స్వదేశీ ప్రజలు స్వీకరించారు. 19 వ శతాబ్దం చివరలో, ఉర్దూ నుండి వేరుగా ఉన్న హిందూస్థానీ యొక్క ప్రామాణిక రూపంగా హిందీని మరింత అభివృద్ధి చేసే ఉద్యమం ఏర్పడింది. జాతిపిత మహాత్మా గాంధీ కూడా దేశంలో ఐక్యతను తీసుకు రావడానికి ఈ భాషనే వాడేవారు. ఈ భాషను "లాంగ్వేజ్ ఆఫ్ యూనిటీ" అనేవారు. 9 రాష్ట్రాల్లో మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాలలో అధికార భాష కాగా, 3 రాష్ట్రాల అదనపు అధికార భాష. బీహార్, ఛత్తీస్‌గడ్, గుజరాత్ (అదనపు), హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, మధ్యప్రదేశ్, మిజోరం (అదనపు), రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ (బ్లాక్స్, డివిజన్లు లేదా 10 శాతం కంటే ఎక్కువ జనాభా ఉన్న జిల్లాల్లో) అండమాన్ మరియు నికోబార్ దీవులు, దాద్రా మరియు నగర్ హవేలి, డామన్ డయ్యూ, ఢిల్లీలలో రాజ్య మేలుతోంది. 1954 లో, భారత ప్రభుత్వం హిందీ వ్యాకరణాన్ని సిద్ధం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసిందిబీ కమిటీ నివేదిక 1958 లో "ఏ బేసిక్ గ్రామర్ ఆఫ్ మోడరన్ హిందీ"గా విడుదలైంది. రాతలో ఏక రూపతను తీసుకు రావడానికి, కొన్ని దేవనాగరి అక్షరాల ఆకారాన్ని మెరుగు పరచడానికి మరియు ఇతర భాషల నుండి శబ్దాలను వ్యక్తీకరించడానికి కృషి జరిగింది. ఇతరులు అర్థం చేసు కోవడాన్ని సులభమైన బాష హిందీ ఒక్కటేనని గుర్తు చేశారు. ప్రపంచం లోని చాలా దేశాలలో హిందీ భాషను మాట్లాడుతారు. భారత దేశం వెలుపల, హిందీ మాట్లాడేవారు నేపాల్ లో 8 మిలియన్లు, యూ.ఎస్.ఏ లో 8,63,077, మారిషస్ లో 4,50,170బీ ఫిజీలో 3,80,000బీ దక్షిణాఫ్రికాలో 2,50,292బీ సురినామ్‌లో 1,50,000బీ ఉగాండాలో 1,00,000బీ యునైటెడ్ కింగ్‌డమ్‌లో 45,800బీ న్యూజిలాండ్‌లో 20వేలు, జర్మనీలో 20వేలు, ట్రినిడాడ్ మరియు టొబాగోలో 26వేలు, సింగపూర్‌లో 3 వేలు, మారిషస్, ట్రినిడాడ్, అమెరికా, దక్షిణాఫ్రికా, న్యూజి ల్యాండ్ వంటి చాలా దేశాలలో ఇప్పటికీ హిందీ ముఖ్య భాషగా ఉంది. ఆసియా వెలుపల , భోజ్‌పురి , బీహారీ భాషలు , ఫిజియన్ మరియు ఇంగ్లీష్ ప్రభావంతో అవధి భాష (తూర్పు హిందీ మాండలికం) ఫిజీలో మాట్లాడ బడుతోంది. ఇది ఫిజీలో 1997 రాజ్యాంగం ప్రకారం "హిందుస్తానీ" గా పిలువబడే అధికారిక భాష. అయితే 2013 ఫిజి రాజ్యాంగంలో దీనిని " ఫిజి హిందీ " అని పిలుస్తారు. ఫిజీలో 3.8 లక్షల మంది మాట్లాడు తున్నారు. 2011 నేపాల్ జనాభా లెక్కల ప్రకారం నేపాల్‌లో సుమారు 77,569 మంది హిందీని మొదటి భాషగా, ఇంకా 1,225,950 మంది రెండవ భాషగా మాట్లాడతారు. దక్షిణాఫ్రికాలో రక్షిత భాషగా, రాజ్యాంగం ప్రకారం,దక్షిణాఫ్రికా భాషా బోర్డు ఇతర భాషలతో పాటు హిందీ పట్ల గౌరవాన్ని ప్రోత్సహిస్తున్నది. ఉర్దూ మాట్లాడే చాలా మంది పాకిస్తానీయులకు హిందీ అర్థం చేసుకోవడం చాలా సులభం. ఇది హిందీ మాదిరిగానే హిందూస్థానీ భాష యొక్క ప్రామాణిక రిజిస్టర్‌బీ ఆధునిక హిందీ నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలకు మొదటి భాషగా, 1.8 బిలియన్ల ప్రజలు మాట్లాడే భాషగా ఉంది. అంటే దేశంలో 1/8 వ ప్రజలు ఉపయోగించే భాషగా, దేశాన్ని ఏకం చేసే భాషగా హిందీ గుర్తించ బడుతోంది. జాతీయ భాషగా వర్ధిల్లుతోంది. హిందీ నేర్చు కోవడానికి చాలామంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్టికల్ 351 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమకు నచ్చిన భాషలో పని చేయడానికి స్వేచ్ఛను కలిగి ఉన్నాయి. స్థానికేతర హిందీ మాట్లాడే వారిపై బలవంతపు రుద్దడానికి విస్తృతమైన ప్రతిఘటన, ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో (తమిళనాడు వంటివి) 1963 అధికారిక భాషల చట్టం ఆమోదించడానికి దారితీసింది. ప్రపంచం లోనే ఎక్కువగా మాట్లాడే భాషలలో ఒకటిగా హిందీ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉండడం గమనార్హం. అయితే మాతృభాషపై ఉన్న మమకారముతో సంబంధిత రాష్ట్రములలో ప్రతివారికి విద్యా విధానాలు అందాలంటే తప్పని సరిగా మాతృభాష లోనే చదువు కోవాలి. విభిన్న భాషలు ఉన్న భారత దేశములో ఒకరి భావావేశాలు మరొకరు అర్థము చేసు కునేందుకు ఒక కనీస ఉమ్మడి భాష అవసరము ఎంతైనా ఉంది. ప్రపంచ దేశాల ప్రజలతో సంభాషించేందుకు ఇంగ్లీష్ కు ఉన్న ప్రాముఖ్యత మరియేఇతర భాషకు లేదు. ఇంగ్లీష్ నేర్చుకోవడం తప్పనిసరి అవుతున్నది. ఈ విధముగా హిందీయేతర ప్రాంతాలలో మూడు భాషలు నేర్చుకోవడం కష్టతరము, ఇబ్బందులకు హేతువు అవుతుంది. కనుక హిందీని అనవసరముగా నేర్చుకోమని బలవంత పెట్టకూడ దనేది విద్యావేత్తల అభిప్రాయం. నరేంద్ర మోడీ ప్రభుత్వం అందుకే ప్రాథమిక దశలో విద్యార్థులకు మాతృ భాషలో విద్య నేర్చుకునే విషయంపై ప్రధానంగా దృష్టి నిలిపింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## ఎల్లంపల్లిపైనే అన్నదాతల ఆశలు

గంగాధర : వానాకాలం మరో 20 రోజుల్లో ముగియనుంది. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈసారి ఆశించినంతగా భారీ వర్షాలు కురవలేదు. ఎగువ ప్రాంతాల్లో కురిసినవాటికి శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండి వాటి ద్వారా ఉమ్మడి జిల్లాలోని మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలకు నీరు చేరింది. ఈసారి మాత్రం వరుణుడు అంతగా కరుణ చూపలేదు. ఫలితంగా రైతులు వానాకాలంలోనూ ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిపైనే ఆశలు పెట్టుకున్నారు.

**అలాగైతేనే యాసంగి గట్టెక్కేది**

ఈ నెలాఖరు వరకు వర్షాలు కురవకపోతే.. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్, గంగాధర జలాశయాలను నింపి అక్కడి నుంచి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటలు నింపాలని రైతులు కోరుతున్నారు. అలాగైతేనే యాసంగి సాగు సాధ్యమవుతుందని వాపోతున్నారు. ఆయా ప్రాజెక్టుల ద్వారా వరద వృథాగా గోదావరిలో కలిసిపోతుందని.. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటితో ఇక్కడి నీటి వనరులు నింపితే తమను ఆదుకున్నట్లవుతుందని



అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు రైతులు ఇటీవల వినతిపత్రం అందజేశారు.

**ఒకే ఒక్క భారీ వర్షం**

గత నెల 28, 29 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో కురిసిన వర్షమే పెద్దది. ఈ రెండు రోజుల్లో కురిసిన భారీ వర్షంతోనే వ్యవసాయ బావుల్లో నీటి ఊటలు పెరిగాయి. గత నెల సాధారణ వర్షపాతం 203.8 మి.మీ కాగా.. 283.4 మి.మీగా నమోదైంది. ఈనెల 8 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 50.1 మి.మీ కాగా.. కేవలం 30.4 మి.మీ మాత్రమే కురిసింది. ఇంకా 45 రోజులపాటు వరికి నీటి వినియోగం తప్పనిసరి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**చెరువులన్నీ నింపుతాం**

ఆశించిన వర్షాలు కురవకపోవడంతో రైతులు అధైర్యపడొద్దు. ఎల్లంపల్లి ప్రాజెక్టుతో నారాయణపూర్ జలాశయం నింపి ఇక్కడి నుంచి నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నింపుతాం. ఈ మేరకు నీటిపారుదల శాఖ సీఈతో చర్చించాం. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం.మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

## రావడం సరే.. వెళ్లడం ఎలా


పెద్దపల్లి : పాత హాల్టింగ్‌లను పునరుద్ధరించేందుకు ఎట్టకేలకు సమయం ఆసన్నమైంది. 2020 నాటికి వివిధ రైళ్లకున్న హాల్టింగుల సేవలు ఈనెల నుంచి అందుబాటులోకి రానున్నాయి. పెద్దపల్లి, రామగుండం స్టేషన్‌లలో పలు రైళ్ల నిలుపుదలపై ఇప్పటికే రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ఒకవైపు ఇచ్చి మరోవైపు ఎత్తేశారు. తాజా నిర్ణయం మేరకు పెద్దపల్లి స్టేషన్‌పై వివక్ష స్పష్టంగా కనిపిస్తుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. గతంలో రైళ్లన్నింటికి రామగుండం, జమ్మికుంటలో హాల్టింగ్ కల్పించగా.. పెద్దపల్లిలో మాత్రం కేవలం దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు దిగువ(హైదరాబాద్‌వైపు) మార్గంలోనే ఇచ్చారు.

**గతంలో ప్రాధాన్యం**

జీటీ మార్గంలో ప్రధానమైన పెద్దపల్లి స్టేషన్‌కు గతంలో ప్రాధాన్యం ఉండేది. వరంగల్ తరువాత ప్రతి రైలుకు పెద్దపల్లిలో హాల్టింగ్ కల్పించేవారు. అప్పట్లో ప్రతి ఆర్టీసీ బస్సు సైతం రైల్వేస్టేషన్‌కు వెళ్లడం ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులకు ఈ స్టేషన్ బహుముఖ సేవలందించింది. అయితే రానురాను ప్రాభవం కోల్పోయింది. ఇక్కడి నాయకులు పారిశ్రామిక ప్రాంతాలపై దృష్టి పెట్టడంతో వ్యవసాయ, వ్యాపార కేంద్రమైన పెద్దపల్లిపై శీతకన్ను పడింది. ఇదే సమయంలో రైళ్ల హాల్టింగ్‌లు కూడా తగ్గాయి.

**పునరుద్ధరించినవి ఇవే..**

రామగుండంలో ఎస్ఎంవీటీ బెంగళూర్- దానాపూర్ ఎక్స్‌ప్రెస్



సంఘమిత్ర, మైసూర్-దర్బంగా ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం-బనారస్, పట్నా-ఎర్నాకులం.. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు ఇదివరకు ఒకవైపు హాల్టింగ్ ఉండగా తాజా మరోవైపు కల్పించారు.

పెద్దపల్లిలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు కేవలం హైదరాబాద్ వైపు మాత్రమే హాల్టింగ్ ఇవ్వగా.. రాయపూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఎటువైపు ఇవ్వలేదు.

**ప్రత్యేక రైళ్లకు హాల్టింగేది?**

వివిధ రైల్వేజోన్‌లు ప్రకటించిన దసరా, దీపావళి లాంటి పండుగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లకు పెద్దపల్లిలో హాల్టింగ్ కల్పించలేదు. ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయంతో ఎన్ఎస్‌జీ-4 స్థాయికి చేరుకున్నప్పటికి.. కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లో ఎన్ఎస్‌జీ-5 స్థాయి స్టేషన్‌కు ఇచ్చిన ప్రాధాన్యత కూడా రైల్వే అధికారులు పెద్దపల్లికి ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) స్టేషన్‌ను సైతం ఇక్కడినుంచి 15 ఏళ్ల క్రితం రామగుండంకు తరలించారు. తాజాగా పెద్దపల్లిలో ప్రతిపాదించిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నాయకులు పోరుగు స్టేషన్లకు తరలించుకుపోతున్నారు.

## పాఠాలు నేర్వలే.. ప్రమాదాలు ఆగలే



మల్యాల : 2018 సెప్టెంబరు 11న కొండగట్టు ఘాట్‌రోడ్డుపై దేశంలోనే అతిపెద్ద బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. 'వై' జంక్షను నుంచి 104 మంది ప్రయాణికులతో జగిత్యాల వెళ్తున్న బస్సు బ్రేకులు విఫలమై అదుపు తప్పి దాదాపు 15 మీటర్ల లోతు లోయలోకి దూసుకెళ్లింది. మొత్తం 65 మంది మృతి చెందడం అత్యంత విషాదం నింపింది. ఏడేళ్లవుతున్నా ఇప్పటికీ ఘాట్‌రోడ్డు రూపురేఖలు మారలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పాఠాలు నేర్వలేదు.

**అటకెక్కిన ప్రతిపాదనలు**

బస్సు ప్రమాదం తర్వాత ఘాట్ రోడ్డు రూపురేఖలను సమూలంగా మార్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రమాద కారణాలపై అధికారులు విశ్లేషించారు. దాదాపు రూ.కోటితో నాలుగు చోట్ల రక్షణ గోడలు, వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేశారు.నాలుగు చోట్ల ప్రమాదకర మలుపులు, వాలు అధికంగా ఉన్న ప్రాంతాలను సరి చేయడంతో పాటు ఘాట్‌రోడ్డును విస్తరించాలని ప్రభుత్వానికి నివేదించారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద రంగులు వేయించినప్పటికీ కనిపించడం లేదు. ఘాట్‌రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఘాట్‌రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లకుండా ప్రారంభంలో, 'వై' జంక్షను సమీపంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు వంగిపోయాయి. రెండో ఘాట్‌రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఘాట్‌రోడ్డుపై వేగంగా, న్యూట్రల్‌లో వెళ్లకూడదంటూ ఆలయ సిబ్బంది మైకులో చేసిన ప్రచారం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది.

కొండగట్టు దిగువ ప్రాంత వ్యాపారుల విన్నపం మేరకు నాయకులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఘాట్‌రోడ్డు మీదుగా కార్లు, ఆటోలు, వ్యాన్లు, ద్విచక్రవాహనాల రాకపోకలను పునఃప్రారంభించారు.

**రవాణా శాఖ తనిఖీలతోనే అడ్డుకట్ట**

ఘాట్‌రోడ్డుపై ఇప్పటివరకు 120 మందికి పైగా మృత్యువాత పడ్డారు. 2024 నవంబరు 22న ఆటో బోల్తా పడి ఎనిమిది మంది గాయపడ్డారు. 2025 మార్చి 27న ఇద్దరు ఆటో పైభాగంలో కూర్చుని వస్తూ 'వై' జంక్షన్ వద్ద బారికేడుకు తగిలి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపడితే ప్రమాదాలకు అడ్డు కట్ట పడనుంది.

## గుట్టుగా గుటకేస్తున్నారు!



హుజూరాబాద్ : ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టలను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ప్రశ్నిస్తే రోడ్డు పనులకనీ బుకాయిస్తూ రవాణా చేస్తున్నారు. హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లి, సింగాపూర్ గ్రామాల మధ్యలో పాండవుల తదితర పేర్లతో గుట్టలు ఉన్నాయి. జాతీయ రహదారి కోసం ఇక్కడి నుంచి అనుమతులతోనే ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు సైతం మట్టి అక్రమ దందాకు తెరలేపారు. అనుమతులు పొందకుండా నెలల తరబడి గుట్టలు తోడుతూ డంపులుగా పోసి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిళ్లు దూరప్రాంతాలకు తరలిస్తున్నారు.

**డిమాండ్ ఆసరా చేసుకొని**

పాండవుల గుట్ట సమీపంలోని గుట్టల్లో ఎర్రమట్టి లభిస్తోంది. దీనికి డిమాండ్ అధికంగా ఉంటుంది. ఇదే అక్రమ వ్యాపారులకు సిరులు కురిపిస్తోంది. పొక్లెయిన్ తదితర యంత్రాలతో మట్టి తోడి ట్రాక్టర్లు, ట్రిప్పర్లు, లారీల్లో తరలిస్తున్నారు. జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, సైదాపూర్, హుజూరాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రిప్పునకు రూ.1500 నుంచి రూ.2500 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. జాతీయ రహదారి నిర్మాణ కంపెనీ ఆయా గుట్టల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోడుతోందని సమీప గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇష్టానుసారంగా తవ్వటంతో లోతైన గోతులు ఏర్పడ్డాయని, మైనింగ్ అధికారులు ఇటు వైపు ఎందుకు రావటం లేదని ప్రశ్నిస్తున్నారు.

**బహిరంగంగానే డంపులు**

మట్టి విక్రయాల దందా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిత్యం వందల ట్రిప్పుల మట్టిని డంపు చేసి విక్రయిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ఇటీవల రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు మట్టి వాహనాలను పట్టుకోగా ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం హుజూరాబాద్ తహసీల్దారు కార్యాలయానికి సమాచారం రావడంతో తహసీల్దార్, మరికొందరు అధికారులు కలిసి పాండవుల గుట్ట వద్దకు వెళ్లారు. వీరు వెళ్లేలోపే అక్రమార్కులు పరారయ్యారు. దీన్ని బట్టి అధికారులు సైతం అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నట్లు అర్థమవుతోంది. సంబంధిత కిందిస్థాయి ఉద్యోగులు, రాత్రి వేళ గస్తీ తిరిగే అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేస్తాం**

మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. గుట్టల తవ్వకాలకు చట్టప్రకారం అనుమతులు ఉన్నాయా? లేదా? అని పరిశీలిస్తాం. లేకపోతే కఠిన చర్యలు తప్పవు. తమ దృష్టికి వచ్చిన వాటిపై పర్యవేక్షించి ఏడీ మైనింగ్ వారిని తనిఖీ కోసం పంపిస్తాం. సంబంధిత అక్రమార్కులు, దళారుల వ్యవస్థపై చర్యలకు ఆదేశిస్తాం.ఆర్డీవో రమేశ్‌బాబు

## ఇక రైతు వేదికల్లో యూరియా విక్రయాలు




కరీంనగర్ : రైతు వేదికల్లో యూరియా విక్రయాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం అన్ని చోట్ల యూరియా కొరత నెలకొంది. ఒకేసారి కాకుండా దశలవారీగా జిల్లాకు సరఫరా అవుతుంది. దీంతో యూరియా దక్కించుకోవడానికి అన్నదాతలు నానాఅగచాట్లు పడుతున్నారు. ఇక నుంచి రైతులు యూరియా కోసం గంటలపాటు నిరీక్షించే అవసరం లేకుండా మరిన్ని విక్రయ కేంద్రాలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాలో మొదటి విడతలో పలు మండలాల్లోని 11 రైతు వేదికల్లో యూరియా విక్రయాలు చేపట్టాలని ప్రణాళికలు రచించారు.

జిల్లాలో ఇప్పటి వరకు 30 పీఏసీఎస్, 37 కేడీసీఎంఎస్, 16 ఏఆర్ఎస్, 19 ఎఫ్‌పీయూ కేంద్రాలతోపాటు ఇతర ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు విక్రయిస్తున్నారు. కానీ యూరియా కొరత కారణంగా రైతులు పెద్ద ఎత్తున వరుసలో నిలబడటం, పలు చోట్ల గొడవలు సైతం జరుగుతున్నాయి. దీంతో మరిన్ని విక్రయ కేంద్రాలను రైతు వేదికల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా హుజూరాబాద్ డివిజన్‌లో యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు వరుస కట్టడం, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మొదటి విడతలో ఆ ప్రాంతంలోనే అధికంగా రైతు వేదికల ద్వారా విక్రయాలు చేపట్టనున్నారు.

ఆయా ప్రాంతాల్లో ఇలా..

జిల్లాలో మొదటి విడతలో జమ్మికుంట మండలంలోని జమ్మికుంట, మడిపల్లి, బిజిగిరిషరీఫ్, వావిలాల, వీణవంక మండలం కోర్కల్, రెడ్డిపల్లి, గన్నేరువరం మండలంలోని కాశీంపేట, మాదాపూర్, తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం, సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి రైతువేదికల్లో త్వరలో యూరియా విక్రయాలు ప్రారంభిస్తారు.

ఆయా పరిధిలోని ప్యాక్స్ కేంద్రాల బాధ్యులతోపాటు సంబంధిత ప్రాంత ఏఈవోలు బాధ్యతలు అప్పగించారు.

ఏ సొసైటీకి ఎంత యూరియా కేటాయించారనే విషయం రైతులకు ముందుగా తెలియజేస్తారు.

ఆ రైతు వేదికల్లో ఫ్లెక్సీ పెట్టి దానిపై విక్రయ వేళలు, బాధ్యుడి పేరు, చరవాణి నంబరు తప్పనిసరి ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

మరింత రావాల్సి ఉందిజిల్లాలో వానాకాలం సాగుకు సుమారు 43 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా. ఇప్పటి వరకు 27 వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. మరింత యూరియా దశలవారీగా వస్తుంది. వచ్చిన యూరియాను అన్నదాతలకు వారికి సమీపంలోని రైతు వేదికల్లో అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

## వంద రోజులు.. ప్రగతికి బాటలు

కోరుట్ల : పురపాలికల్లో ప్రభుత్వం అమలు చేసిన 100 రోజుల ప్రణాళికతో స్వచ్ఛత మెరుగవడంతో పాటు ప్రగతికి బాటలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కోరుట్లలో పురపాలిక ఆదాయం గణనీయంగా పెరిగేందుకు దోహదపడింది.

**గణనీయంగా పెరిగిన ఆదాయం**

పట్టణంలోని 16,147 కుళాయిలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో రూ.8,85,800 బిల్లులు వసూలయ్యాయి. భువన్ సర్వే ద్వారా 5,079 ఇళ్లను గుర్తించి ఇందులో 4,884(96.16 శాతం) ఆన్‌లైన్ చేశారు. దీంతో రూ.76 లక్షల ఆస్తి పన్ను సమకూరింది. 262 దుకాణాలను గుర్తించి ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడంతో బల్దియాకు రూ.5,03,580 ఆదాయం వచ్చింది. మిక్స్‌డ్ ప్రాపర్టీస్(వాణిజ్య, గృహ)లో ఉన్న 104 దుకాణాలను గుర్తించి లైసెన్స్‌లు జారీ చేయడంతో రూ.3.19 లక్షల ఆదాయం సమకూరింది. పాత మున్సిపల్‌లో మహిళా సంఘాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించగా వారికి రూ.22 వేల ఆదాయం వచ్చింది. కొత్తగా 16 స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయడంతో పాటు 82 సంఘాలకు రూ.7.91 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేశారు. 44 వీధి వ్యాపారుల గ్రూపులు ఏర్పాటు చేయించారు. అంతర్గత రహదారులపై గుంతలకు మరమ్మతు చేయించారు. 160 వీధి కుక్కలను ఏబీసీ కేంద్రానికి తరలించి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించారు.

**పరిశుభ్రతపై ప్రజా చైతన్యం**

స్వశక్తి మహిళలకు చెత్త వర్గీకరణపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడళ్ల వద్ద కళాకారుల ప్రదర్శనలు, సిబ్బందితో ర్యాలీలు నిర్వహించారు.

వ్యర్థాల శుద్ధీకరణ, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాల్లో, డంపింగ్ యార్డులోని బయోమైనింగ్ విధానాలపై మహిళలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు.

పాఠశాలల్లో కంపోస్టు తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

హోటళ్లు, దుకాణాల్లో తనిఖీలు జరిపి ప్లాస్టిక్ వినియోగించినందుకు జరిమానాలు విధించారు.

మహిళలతో స్వచ్ఛ రాఖీల తయారీతో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం నిర్వహించారు. బల్దియా కార్యాలయంలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 100 రోజుల ప్రణాళికపై ప్రచారం చేశారు.


**అందరి భాగస్వామ్యంతోనే విజయవంతం**

అధికారులు, సిబ్బంది, కార్మికులు, ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమం విజయవంతమైంది. సంపూర్ణ పారిశుద్ధ్య సాధన దిశగా విస్తృతంగా అవగాహన కల్పించాం. కుళాయిల ఆన్‌లైన్‌తో, అనుమతి లేని ఇళ్లను, దుకాణాలు గుర్తించి లైసెన్సులు జారీ చేయడం ద్వారా పురపాలికకు ఆదాయం భారీగా పెరిగింది. రవీందర్, మున్సిపల్ కమిషనర్

## అమ్మో ఆకలి.. ఎంతని ఓర్చుకోవాలి

సిరిసిల్ల : విద్యారంగం బలోపేతానికి పలు సంస్కరణలు అమలు చేస్తున్న సర్కారు ఇంటర్ విద్యార్థుల ఆకలి బాధలు తీర్చడంలో సంకోచిస్తోంది. ఏళ్ల తరబడి ప్రకటనలకు పరిమితమైన మధ్యాహ్న భోజనం క్షేత్ర స్థాయిలో అమలుకు నోచడం లేదు. కళాశాలల్లో విద్యార్థులు అర్ధాకలితో పాఠాలు వినే దుస్థితి నెలకొంది. ఫలితంగా హాజరు, ఉత్తీర్ణత శాతంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**ఇదీ పరిస్థితి** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గ్రామీణ నేపథ్యంలోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుతుంటారు. ఇటీవల సర్కారు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి చేసింది. ఉదయం, మధ్యాహ్నం విద్యార్థుల ఫొటోలు తీసి అధ్యాపకులు అధికార వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఉదయం 9:30 గంటల్లోపే సదరు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. గ్రామాల నుంచి రాకపోకలు సాగించే విద్యార్థులకు బస్సులు లేక చేరుకోలేని పరిస్థితి ఉంది. ఉదయాన్నే కళాశాలకు హాజరయ్యే హడావుడిలో చాలామంది అల్పాహారం, మధ్యాహ్నానికి భోజనం బాక్సులు లేకుండా కాలేజీకి వస్తుంటారు. సాధారణంగా సర్కారు కాలేజీల్లో చదివే పిల్లలు పేద, మధ్య తరగతికి చెందిన వారే. ఉదయం భోజనం వండుకుని తిని, బాక్సుల్లో కళాశాలకు తీసుకురావడం సాధ్యం కావడం లేదు.రాత్రి మిగిలిన అన్నం తిని చాలా మంది కళాశాలకు వస్తుంటారు. మధ్యాహ్నానికి చాల మంది ఆకలి పేరుతో కళాశాలకు డుమ్మా కొడుతున్నారు. భోజనం చేయకుండా ఉన్న విద్యార్థులు నీరసానికి లోనవుతున్నారు. ఇక మధ్యాహ్నం పస్తులుండి పాఠాలు వినే పరిస్థితి మెజారిటీ విద్యార్థులది. ఇలాంటి చర్యలతో విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతోపాటు, పాఠాలపై శ్రద్ధ చూపలేరు. దీంతో వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణతపై ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి సమస్యల నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు తగ్గుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను పంపేందుకు



ఆసక్తి కనబర్చడం లేదని చెబుతున్నారు. వసతిగృహ సదుపాయం కలిగిన కళాశాలలు, ప్రైవేటు విద్యా సంస్థలకు పంపుతున్నారు. అంత స్థోమత లేని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోకి వస్తున్నారు. ఇప్పటికైనా సర్కారు మానవతా దృక్పథంలో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే విద్యార్థులకు చాలా ప్రయోజనం కలుగుతుందని, వెంటనే అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

**దాతలు ముందుకొస్తే..**

అన్ని కళాశాలల్లో కలిపి 2,595 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆకలి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఒక్కో కళాశాలను దత్తత తీసుకొని కనీసం అల్పాహారం, రాగిజావ అందించేలా చర్యలు చేపడితే మేలు చేకూరుతుంది.

జిల్లాలో...ప్రభుత్వ జూనియర్ కళాశాలలు – 10

ప్రథమ సంవత్సరం విద్యార్థులు – 1410

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు – 1185

## వామ్మో వరుస.. ఆందోళన లేదిక తెలుసా

హైదరాబాద్: ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రదేశాలకు వెళ్లినప్పుడు కచ్చితంగా టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు గంటల కొద్దీ వరుసలో నిల్చొని సమయం వృథా చేసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు సరిపడా చిల్లర లేకపోతే ఇబ్బందులు తప్పవు. అందుకు ప్రభుత్వం 'మీ టికెట్' యాప్ అందుబాటులో ఉంచింది.

**తీసుకోవడం ఎలా..**

మీ టికెట్ యాప్‌లో చరవాణి నంబరు ద్వారా ఓపెన్ చేసి పాస్‌వర్డు ఏర్పాటు చేసుకోవాలి. మీకు కావల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి. అందులో ఏ రోజు టికెట్ కావాలో ఎంపిక చేసుకోవచ్చు.

రోజు ఎంచుకున్న తరవాత ఎంత మంది వెళ్లాలనుకుంటున్నారో, మీ వెంట కెమెరాలు తీసుకెళ్లానుకుంటున్నారా అనే ఆప్షన్‌ను పూర్తి




చేయాలి. అనంతరం పేమెంట్ ఆప్షన్ వస్తుంది. పూర్తయితే టికెట్ బుక్ అవుతుంది. ఈ టికెట్లు పని సమయాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈవీ ఛార్జింగ్ ఆప్షన్‌లో వాటి ప్రదేశాల దారిని చూపిస్తుంది. గూగుల్ లొకేషన్ ద్వారా మీ దగ్గరలోని పర్యాటక ప్రాంతాలను కూడా చూపిస్తుంది.

**లభించే సేవలు..**

యాప్‌లో 15 గుడుల దర్శనం (భద్రాచలం, బాసర, యాదగిరిగుట్ట, వేములవాడ), మెట్రో, 129 పార్కులు, నాలుగు జూపార్కులు, ఆరు మ్యూజియాలు, ఏడు బోటింగ్ ప్రదేశాలు, మూడు జలాశయాలు, నాలుగు పోర్టులు, ఐదు అడవుల్లోని క్యాంపు ప్రదేశాలు, నగరాల్లోని ఈవీ ఛార్జింగ్ ప్రదేశాల సేవలు.

## యాచారం మీదుగా అమరావతి రోడ్డు

యాచారం : హైదరాబాద్-అమరావతి జాతీయ రహదారిని రంగారెడ్డి జిల్లా యాచారం మీదుగా నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ప్రాథమిక అంచనా రూపొందించారని ముఖ్య అధికారి ఒకరు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అనుమతివ్వాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కోరిన విషయం తెలిసిందే. ఈఅంశంపై 22న హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తామని గడ్కరీ తెలిపినట్లు సీఎంవో కార్యాలయం తెలిపింది. హైదరాబాద్-అమరావతి నిర్మాణం ఎక్కడి నుంచి చేపడితే ప్రయోజనం ఉంటుందనే అంశంపై ఉన్నతస్థాయిలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. వాటిలో శ్రీశైలం,



నాగార్జునసాగర్ అంతరాష్ట్ర ప్రధాన రహదారులను కలుపుతూ చేసిన ఈ ప్రతిపాదనకు ప్రాధాన్యత తెలుస్తోంది.

**ఎక్కడి నుంచి అంటే..**

ఓఆర్ఆర్ రావిరాల నుంచి భారత్ ఫ్యూచర్ సిటీకి ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద ప్రాంతంలో జంక్షన్ ఏర్పాటు చేయనున్నారు. ఆ జంక్షన్ నుంచి మేడిపల్లి, మల్కీజ్ గూడెం, యాచారం వెనుక వైపు నుంచి నల్గొండ జిల్లా మునుగోడు, చండూరు మధ్య నుంచి జాన్‌పహడ్ మీదుగా నిర్మిస్తారని సమాచారం. 11 చోట్ల ఇంటర్ ఎక్స్ఛేంజీలు ఏర్పాటు చేస్తారని చెబుతున్నారు.

## అమ్మో.. మీ'డర్'

హైదరాబాద్: 14.2 లక్షల మంది వినియోగదారులు ఉండగా.. సుమారు ఐదు లక్షలకు పైగా మీటర్లు పని చేయడం లేదని అనధికార అంచనా.

2021లో కాగ్ ఇచ్చిన నివేదికలో 82 శాతం మీటర్లు పని చేయడం లేదని పేర్కొంది. క్యాన్ నంబర్ 618194416 వినియోగదారుడి ఏఎంఆర్ మీటర్లు గతేడాది డిసెంబరు నుంచి పని చేయడం లేదు. అప్పటి నుంచి జలమండలి కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉన్నారు. 30సార్లకు పైగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. బిల్లు చెల్లించాలని నోటీసు మాత్రం ఇస్తున్నారు. తాజాగా రూ.9700 చెల్లించాలని లేదంటే జరిమానా, నీటి కనెక్షన్ తొలగింపు తప్పదని నోటీసు ఇవ్వడం గమనార్హం. జలమండలి నీటి మీటర్ల విధానం తీరూతెన్నూలేకుండా సాగుతోంది. పనిచేయని మీటర్లకూ రూ.వేలకు వేలు బిల్లులతో బాదేస్తున్నారు. వీటిపై వచ్చే ఫిర్యాదులూ బుట్టదాఖలవుతున్నాయి. జలమండలి సిఫారసు చేస్తున్న మీటర్లు వారం పది రోజులు కూడా పనిచేయడం లేదని జనం వాపోతున్నారు. ఆన్‌లైన్ ఫిర్యాదులు పరిష్కరించకుండానే పని చేసినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. మెకానికల్ మీటర్లు.. 25 ఎంఎం కంటే తక్కువ పరిమాణం నీటిని తీసుకొనే నివాసాలకు మెకానికల్ మీటర్లు అధికారులు సిఫారసు చేశారు.

చాలాచోట్ల నీటి పరిమాణాన్ని తట్టుకుని మీటర్లు పని చేయడంలేదని.. పదేపదే మార్చుకోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ఏఎంఆర్.. బహుళ అంతస్తుల భవనాలకు, 25 ఎంఎం కంటే ఎక్కువ పరిమాణం నీటిని తీసుకునే నివాసాలకు ఏఎంఆర్ మీటర్లు బిగిస్తారు.

## కల్తీకల్లు.. మూసుకున్నాం కళ్లు



హైదరాబాద్: రెండు నెలల కిందట కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి 14 మంది మృతి చెందినా.. 50 మందికిపైగా ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆసుపత్రుల్లో చికిత్స పొందినా నగరంలో కల్తీ దందా మాత్రం ఆగడం లేదు. ఈ ఘటన తరువాత కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్నా.. కొన్ని రోజులుగా మళ్లీగా గుట్టుగా సాగుతోంది. కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా.. ఆబ్కారీ శాఖ తనిఖీలు తూతూమంత్రంగా జరుగుతున్నాయి. నగరంలోని కల్లు దుకాణాలను 'ఈనాడు' పరిశీలించగా.. గత పరిస్థితులే కనిపించాయి.

**అధికారులను ఏమార్చి..** గతంలో హైదరాబాద్ పోలీసులు 78 దుకాణాల నుంచి నమూనాలు తెప్పించి పరీక్షించగా.. 58 నమూనాల్లో ఆల్ప్రాజోలం ఉన్నట్లు తేలింది. కల్లు దుకాణాలు మూసేయాలని ఆదేశాలిచ్చినా న్యాయస్థానం నుంచి స్టే తెచ్చుకున్నారు.

ఆబ్కారీశాఖ నిత్యం నమూనాలు సేకరించి పరీక్షించాలి. అధికారులు నమూనాలకు వెళ్తే అసలైన కల్లుఇచ్చి ఏమార్చుతున్నారు.

**తాటి చెట్లు లేకున్నా..** నిబంధనల ప్రకారం తాటి, ఈత చెట్ల నుంచి సేకరించిన కల్లునే విక్రయించాలి. నగరంలో దాదాపుగా తాటిచెట్లు అందుబాటులో లేవు. శివారు, ఇతర జిల్లాల్లో ఉన్నా రోజూ తీసుకొచ్చే పరిస్థితి లేదు.

తాటి, ఈత చెట్లు లేకున్నా నగరంలో కల్లు వరదలై పారుతోంది. పది లీటర్ల కల్లుకు 15 రెట్లు నీళ్లు కలిపి నురగ కోసం కరక్కాయ పొడి, అమ్మోనియం, తీపి కోసం సాక్రిన్, మత్తు కోసం ఆల్ప్రాజోలం, సోడియం బై కార్బోనైట్, డైజోఫాం, క్లోరల్ హైడ్రేట్ లాంటి నిషేధిత పదార్థాలు కలిపి విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అవసరాలు పోను మిగిలిపోయిన కల్లు సేకరించి నగరానికి తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు. అప్పటికే పాడైపోవడంతో రుచి, మత్తు కోసం నిబంధనలు అతిక్రమిస్తున్నారు.

ఆల్ప్రాజోలం వినియోగం అధికంగా ఉంది. ఒక గ్రాము ఆల్ప్రాజోలం కలిపితే డ్రమ్ము నిండా కల్లు మత్తుగా మారిపోతుంది. దీన్నే సీసా రూ.40కి అమ్మేస్తున్నారు.

## కొరత గుబులు.. కర్షకుల బెంబేలు



పరిగి: జిల్లాలో యూరియా రైతులను కలవరానికి గురిచేస్తోంది. సరఫరా చేస్తున్నా, ఎప్పటికప్పుడు అమ్మకాలు పూర్తవుతుండడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో, వాటిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యూరియా లభించదన్న భయం వారిని వెంటాడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా కొరత ఉందన్న సమాచారం కూడా వారిలో గుబులు రేపుతోంది. యూరియా అమ్మకాలతో లాభం ఉండడం లేదని చాలా మంది వ్యాపారులు విక్రయాలకు దూరంగా ఉండడం కూడా సమస్యకు దారితీస్తోంది. **వరికే అధికం:** జిల్లాలో పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 1,30,549 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా కలుపుతీత పనులు పూర్తిచేసిన రైతులు యూరియా చల్లుతున్నారు. ప్రస్తుత సీజన్‌తో పోల్చితే గతేడాదికన్నా 1,607 ఎకరాల సాగు తగ్గినా, 1,768 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా అధికంగా జరిగింది. వ్యవసాయ శాఖ అదనపు కోటా విడుదల చేయాలని ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టింది. అయినా రైతులను, అధికారులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

**అధిక వర్షాలే కారణం..**

ఈసారి జులైలో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. పత్తి, వరి, కంది, పెసర, మొక్కజొన్న పంటలకు 357 ఎకరాల్లో నష్టం జరిగింది. ఈ కారణంగా పంట రక్షణకు యూరియాను అధికంగా వినియోగించారు. ఈ ప్రభావం కొరతకు దారితీసింది.

**రైతులు ఏమంటున్నారంటే..**

గతంలో వ్యాపారులందరి వద్దా యూరియా లభించేది. అలాంటిది కేవలం ఒకటి రెండు దుకాణాల్లోనే పంపిణీ జరుగుతోంది. నిల్వలు ఉంటే అవసరాలకు అనుగుణంగా తీసుకువెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

**మోతాదు మించొద్దు..: రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి**

గతేడాది కన్నా, ఈ సారి సమస్య లేకుండా యూరియా సరఫరా చేస్తున్నాం. దొరకదన్న భయంతో కొందరు అధికంగా తీసుకుంటున్నారు. మోతాదు మించి వినియోగిస్తే నష్టమే అధికం.

## నిబంధనలు పట్టవు.. అనుమతులు గిట్టవు!



కరీంనగర్ : ఏడాదిన్నర కిందట ఉమ్మడి జిల్లాలో వరుసగా మూడు వారాల పాటు ప్రైవేటు ఆస్పత్రుల అనుమతులు, ఇతరత్రా సౌకర్యాలపై తనిఖీలు చేపట్టారు. మొత్తంగా 793 ప్రైవేటు ఆస్పత్రులను పరిశీలించి అందులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 263 ఆస్పత్రు లకు తాఖీదులు అందించారు. పలు రకాల లోపాలపై సంజాయిషీ కోరారు. ఇప్పటికీ అందులో చాలా ఆస్పత్రులు వివరణ ఇవ్వలేదు. అధికారులు కూడా తనిఖీల విషయాన్ని మరిచిపోయారు. 2022 తరువాత ఏ ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్నా క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం ప్రకారం ప్రారంభోత్సవం నాటికే అన్నిరకాల అనుమ తులు తీసుకోవాలి. కానీ గడిచిన రెండేళ్లలో దాదాపు 60కిపైగా ఆస్పత్రులు ప్రారంభమవగా ఇందులో ఎక్కువ శాతం కేవలం వైద్యారోగ్యశాఖకు దరఖాస్తు చేసుకుని పూర్తిస్థాయి పత్రాలు జారీ కాకుండానే సేవలను మొదలుపెట్టాయి. కనీసం ప్రొవిజినల్ ధ్రువపత్రాన్ని అయినా పొంది సేవలకు ఉపక్రమించాల్సి ఉండగా అవేమీ తమకు పట్టవనే విధంగా కొందరు ఇష్టారాజ్యంగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**ఇవన్నీ ఉండాల్సిందే..**

కొత్తగా ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (డీఆర్ఏ) నుంచి అనుమతులు పొందాలి. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో నియంత్రణలో ఉండే ఈ కమిటీనే కొత్త ఆస్పత్రులకు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ (సీఈఏ) ప్రకారం అనుమతులు జారీ చేస్తుంది. ఆస్పత్రి ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించి, పడకల సంఖ్య ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజును నిర్ధారిస్తుంది. ఆ అనుమతి అయిదేళ్ల వరకు మాత్రమే వర్తిస్తుంది. అనంతరం పునరుద్ధరించుకోవాలి. ప్రతి నెలా ఆస్పత్రిలో చికిత్స పొందే రోగుల రికార్డులను వైద్యారోగ్యశాఖకు పంపాలి. ఎక్కడైనా ఫిర్యాదు అందితే డీఆర్ఏ విచారణ చేపట్టాలి. నిర్వాహకులతోపాటు వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయోవ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ, ట్రేడ్ లైసెన్స్ పత్రాలను పొందాలి.

**120కిపైగా ఆస్పత్రులు!**

నాలుగు జిల్లాల పరిధిలో గడిచిన రెండేళ్లుగా రెన్యువల్స్ చేసుకోని ఆస్పత్రులు 120కిపైగా ఉన్నట్లు సమాచారం. కొన్నేళ్ల కిందట ఏర్పాటైన వీటికి కొత్త నిబంధనల ప్రకారం ఉండాలనే షరతు వల్ల ఇవి పెండింగ్‌లో ఉంటున్నాయి. అయినా సేవలందిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా అగ్నిమాపక శకటం తిరిగేందుకు వీలుగా భవనం ఉండటంతోపాటు ఆస్పత్రికి రాకపోకలకు 40 అడుగుల రోడ్డు ఉండాలనే నిబంధన వారికి ఇరకాటంగా మారింది. దీంతో రెన్యూవల్‌కు ప్రయత్నిస్తూనే యాజమాన్యాలు వైద్య సేవలు కొనసాగిస్తున్నాయి.

**లోపాలిలా..** కొన్నాళ్లు ఒక పేరుతో నడిచిన ఆస్పత్రి భవనంలో కొత్త యాజమాన్యం ఆస్పత్రి నెలకొల్పి పాత అనుమతులతో కొనసాగిస్తున్నారు. బోర్డుల ఏర్పాటు, ఫీజుల వివరాలు కొన్నింట మాత్రమే కనిపిస్తున్నాయి. ఒకే అనుమతితో రెండు చోట్ల నడుస్తున్నవి కూడా ఉన్నాయి. 90 శాతం ఆస్పత్రుల చుట్టూ అగ్నిమాపక శకటం తిరిగే పరిస్థితులు లేవు. మంటలార్పే ఉపకరణాలు అందుబాటులో ఉండవు. ఆపరేషన్ థియేటర్లు, ప్రసూతి గదులు, రోగులకు సంబంధించిన గదుల నిర్వహణ వసతులు చాలాచోట్ల సక్రమంగా లేవు. అర్హత లేకున్నా వైద్యసేవలు అందించే వారు కూడా ఉంటున్నారు. పేరొందిన వారి స్థానంలో వీరే సేవలు అందిస్తున్నారు.

## కేరాఫ్ కెఫే

హైదరాబాద్ : ఒకప్పుడు కెఫే అంటే నలుగురు స్నేహితులు కలిసి టీ, కాఫీ తాగి సరదాగా కాసేపు గడిపే అడ్డా. మారుతున్న ఆధునిక పోకడలకు అనుగుణంగా కెఫేల సంస్కృతి ఇప్పుడు మారుతోంది. స్నేహితులు, సహోద్యోగులు, వ్యాపార భాగస్వాములతో సమావేశాలు నిర్వహించుకునే ప్రదేశాలుగా మారాయి.

**ఆహ్లాదకర వాతావరణం**

వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. విలాసవంతమైన సోఫాలు, ఉచిత వైఫై, ఏసీ, నేపథ్య సంగీతం వంటివి తప్పనిసరిగా ఉంటున్నాయి. పర్యావరణ అనుభూతి పొందేలా లోపల వాతావరణాన్ని తీర్చిదిద్దుతు న్నారు. కొన్నింట్లో పాత కాలంనాటి ఇటుక గోడలు, వింటేజ్ ఫర్నీచర్‌తో విభిన్నంగా మలిచారు. పెంపుడు జంతువులతో కాలక్షేపం, ఆఫీస్ వర్క్ చేసుకోవడానికి వీలుగా, పుస్తకాలు చదువుకోవడానికి అనుకూలంగా ఉంటున్నాయి.

**పుస్తక పరిచయ వేదిక** పుస్తకాలు చదవాలంటే గ్రంథాలయాలకు వెళ్లేవారు. అలాంటి ప్రశాంత వాతావరణమే కెఫేల్లోనూ కల్పిస్తున్నారు. కాఫీ సిప్ చేస్తూ.. పుస్తకాలు చదివేవారి సంఖ్య పెరుగుతుంది. పుస్తక పరిచయ వేదికలు సైతం నిర్వహిస్తున్నారు. యువ రచయితలు తమ పుస్తకాలను పరిచయం చేయడానికి ఓ కెఫేని ఎంచుకుని ఉచిత ప్రవేశంతో 'మీట్ అండ్ గ్రీట్' యువతను ఆహ్వానిస్తున్నారు. పుస్తకావిష్కరణలు సైతం చేస్తున్నారు.

**ఎక్కడెక్కడ..?**



జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, మణికొండ, పంజాగుట్ట కార్పొరేట్ కార్యాలయాలుగా.. ఆఫీస్ పనిని ఇప్పుడు ఎక్కువగా కెఫేల్లోనే కూర్చొని చేస్తున్నారు. ఇందుకు ఇక్కడ 'వర్క్ ఫ్రెండ్లీ' వాతావరణం ఉండటమే కారణం. ల్యాప్‌టాప్ ఒక్కటి తెచ్చుకుంటే చాలు. ప్రైవేటు క్యాబిన్లు అందుబాటులో ఉంటున్నాయి. వ్యాపార సమావేశాలు, గంటల తరబడి కూర్చొని పనిచేయడానికి అనుకూలంగా ఉంటాయి. ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులు ఇక్కడే పని చేసుకుంటూ తమ క్లయింట్స్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**పెట్స్‌తో కాలక్షేపం**

ఇటీవల అన్ని కెఫేల్లోకి పెట్స్‌నీ అనుమతిస్తున్నారు. అవి ఇష్టంగా తినే ఆహార పదార్థాలతో ప్రత్యేక మెనూ, విశాలమైన స్థలాన్ని కేటాయిస్తున్నారు. వాటి యజమానులు కలుసుకోవడానికి వారి అనుభవాలను పంచుకోవడానికి కొత్త స్నేహితులను కలుసుకునేందుకు కెఫేలు వేదికవుతున్నాయి.

## బిల్లు పెట్టు.. కొల్లగొట్టు

హైదరాబాద్ : కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తే కొన్నేళ్ల పాటు మరమ్మతుల సమస్య ఉండదు. జీహెచ్‌ఎంసీలోని అవినీతి అధికారులు అంతకుమించి అంటున్నారు. పని చేయని వాహనాలకూ బిల్లులు పెట్టి రూ.లక్షల్లో ఖజానాకు చిల్లు పెడుతున్నారు.

జీహెచ్‌ఎంసీలో వాహనాలకు మరమ్మతుల పేరుతో నెలకు సగటున ఒక్కో వాహనానికి రూ.20 వేలు వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన అధికారులు తిరిగే కార్లు, ఇతర వాహనాలకు ఏడాదికి రూ.2.4 లక్షలు, 15ఏళ్లకు రూ.36లక్షలు ఖర్చు చేస్తున్నారు.

అక్రమాలపై ఫిర్యాదులతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇటీవల టౌన్‌ప్లానింగ్ విభాగంలోని ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్లను బదిలీ చేశారు. 27 మంది న్యాక్ ఇంజినీర్లను ఉద్యోగం నుంచి తొలగించారు. ఉపకమిషనర్లకూ స్థానచలనం జరిగింది. పార్కింగ్ యార్డులో 10-15 ఏళ్లుగా పాతుకుపోయి, మరమ్మతులకు ఏటా రూ.6కోట్ల మేర దారి మళ్లిస్తున్న చర్యలే లేవు. సొంత వాహనాల మరమ్మతుల ఖర్చు, డ్రైవర్లు, ఇంట్లో పనిచేసే సహాయకుల జీతాలు పార్కింగ్ యార్డు చెల్లిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

**నివేదికలు అడిగితే..**

గతంలో జీహెచ్‌ఎంసీకి సొంతంగా 800ల వాహనాలండేవి. ఆ సంఖ్య 250కి తగ్గింది. అందులో 190 వాహనాలు కవాడిగూడ పార్కింగ్



యార్డు పరిధిలోనివే. మరమ్మతులకు ఇంజినీర్లు ప్రతినెలా రూ.30 లక్షలు వెచ్చిస్తున్నారు. రాకపోకలకు సగటున 3,600 లీ. డీజిల్‌ను ఉపయోగిస్తున్నారు. పని చేయని వాహనాలకూ కూపన్లు వెళ్తున్నాయి. ఇటీవల రికార్డులు సమర్పించాలని ఆదేశించగా.. సగం మంది సిబ్బంది సెలవు పెట్టారు. గడువు అడిగి ఇంట్లో కూర్చొని బిల్లులను సర్దుబాటు చేసి రికార్డులు తయారు చేసినట్లు సమాచారం.

**ఒకటే మూట..**

ప్రతినెలా మరమ్మతులకు రూపొందించే బిల్లులకు.. వాహనాల విడిభాగాల ఫొటోలను జతచేయాలి. పాత విడిభాగాలనే మళ్లీ ఫొటోలు తీస్తున్నారని కొందరుతో తెలిపారు. రూ.30లక్షల విలువైన నకిలీ బిల్లులకు.. గుత్తేదారు సంస్థ అధికారులకు రూ.20లక్షల కమిషన్ ఇస్తోందని ఆరోపిస్తున్నారు.

చురకలు



## సర్కారు వారి పాట

హైదరాబాద్: ప్రభుత్వ భూముల ఆన్‌లైన్ వేలానికి సర్వం సిద్ధమైంది. స్థిరాస్తి మార్కెట్‌లో సానుకూలత కన్పిస్తుండటంతో సర్కారు సైతం స్థలాలను విక్రయించేందుకు ముందుకొస్తోంది. తొలుత రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, మెదక్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను ఈ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ బాధ్యతను ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. ఆప్‌సెట్ ధర చదరపు గజానికి సరాసరి రూ.25–30 వేల వరకు నిర్ణయించే అవకాశం ఉంది. కోకాపేట, చందానగర్, పుప్పాలగూడలాంటి ఖరీదైన ప్రాంతాల్లో ఎక్కువుంటాయి. కోకాపేట్ నియోపొలిస్‌లో గతంలో గజం రూ.లక్ష వరకు పలికింది. ఎకరా ఏకంగా రూ.100 కోట్లకు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. కోకాపేటలోని సర్వేనంబరు 144లో ప్రభుత్వానికి




చెందిన 8,591 చదరపు గజాల స్థలాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైంది. ఇక్కడ సర్వేనంబరు 146లో ప్రభుత్వానికి 1400 చ.గజాల స్థలం ఉంది. ఒకటి రెండు రోజుల్లో ఈ–వేలానికి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

**ఆక్రమణ చెర నుంచి..**

తొలుత హౌసింగ్ బోర్డుకు సంబంధించి స్థలాలను ప్రభుత్వం వేలం వేయడంతో మంచి స్పందన వచ్చింది. వారం క్రితం తొర్రూరులో ప్లాట్లను ఈ–వేలం ద్వారా విక్రయించారు. ఆప్‌సెట్ కంటే మూడు రెట్లు ధర పలకడంతో హెచ్ఎండీఏ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను విక్రయించాలని నిర్ణయించారు. కొన్నింటిలో ప్లాట్లు విక్రయించగా ఇంకా మిగిలి ఉన్నాయి. అక్రమార్కులు వీటిపై కన్నేశారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అనంతరం హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లను వేలం వేయనున్నారు.

## వేగంగా నిర్మాణం.. సరిపోని నిధులు

గోదావరిఖని : గో దావరిఖనిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కోసం సింగరేణి యాజమాన్యం రూ.541 కోట్లు కేటాయించింది. నిర్మాణ పనులు వేగంగా చేపట్టడంతో వైద్య కళాశాల భవన సముదాయాలు పూర్తికాగా ఆసుపత్రి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సింగరేణి కేటాయించిన నిధుల్లో వైద్య కళాశాల భవనాల నిర్మాణాలు పూర్తికాగా మిగిలిన రూ.142 కోట్లతో గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ముందు 9.53 ఎకరాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు అయిదంతస్తుల్లో 3,48,463 చదరపు అడుగుల వైశాల్యంలో భవన నిర్మాణ పనులు చేపట్టారు. పడకల స్థాయితో పాటు వివిధ విభాగాల్లో వైద్య సేవలు మెరుగుపడడంతో ఆసుపత్రి ప్రధాన భవనం సరిపోవడం లేదు. అదనంగా 85 పడకల సామర్థ్యంతో రక్తబ్యాంకు ముందు మరో భవన నిర్మాణం చేపట్టినా ఆసుపత్రి అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో కాలు కదపలేని తీరుగా రోగుల రద్దీ ఉంటుంది.

**పెరిగిన జీఎస్టీ చెల్లింపులు**



ఆసుపత్రి ఆవరణలో అదనపు భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నప్పటికీ కేటాయించిన నిధులు సరిపోవడం లేదు. డిసెంబరులోగా కేటాయించిన నిధులకు సరిపడా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు వేగవంతం చేశారు. రూ.142 కోట్లతో ప్రతిపాదించిన అంచనాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు అయిదంతస్తుల భవనమే ఉండగా అదనంగా మరో అంతస్తు నిర్మాణం చేపట్టాలని ఆసుపత్రి వర్గాలు కోరుతున్నాయి. అయిదంతస్తుల వరకే నిధులు సరిపోయే అవకాశం లేదని గుత్తేదారు ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. అయిదంతస్తుల్లో స్లాబుల నిర్మాణాలు పూర్తయినా రెండు అంతస్తుల్లో మాత్రమే అంతర్గత పనులు పూర్తయ్యే అవకాశముంది. అదనంగా మరో రూ.100 కోట్లు కేటాయిస్తేనే నిర్మాణం పూర్తి కానుంది. వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు మొదలుపెట్టినప్పుడు జీఎస్టీ 12 శాతం మాత్రమే ఉండగా ప్రస్తుతం 18 శాతానికి చేరుకోవడంతో అదనంగా సుమారు రూ.31 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి అదనంగా చెల్లించిన జీఎస్టీ నిధులను తిరిగి చెల్లిస్తే సుమారు మరో రూ.50 కోట్లు కేటాయించినా కొంత మేరకు భవన నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశమున్నట్లుగా భావిస్తున్నారు.

## చెత్త గుట్టలు.. తప్పని చిక్కులు

మంచిర్యాల : మంచిర్యాల నగరపాలక సంస్థలోని అండాలమ్మకాలనీ నివాస గృహాల సమీపంలో తాత్కాలిక చెత్త డంపింగ్‌యార్డు నిర్వహిస్తున్నారు. అక్కడ రెండు ఎకరాల స్థలంలో చెత్తను వేస్తుండటంతో గుట్టలుగా పెరిగింది. తరచూ కార్మికులు కాల్చేస్తుండటంతో పొగతో సమీప కాలనీల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ ప్రక్రియ ఎప్పుడో నిలిచిపోయింది. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో శాశ్వత డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, వెలువడుతున్న చెత్తకు అనుగుణంగా డంపింగ్ యార్డు స్థలాలు ఏర్పాటు చేయడం లేదు. పైగా కుప్పలను కాల్చి ప్రజలను అనారోగ్యాలకు గురి చేస్తున్నారు. పర్యవేక్షణ కరవై ఉన్న స్థలంలోనే చెత్త కొండలుగా పేరుకుపోతోంది. మంచిర్యాలలో నస్పూరు పట్టణం, వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నర్సింగాపూర్ పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు కార్పొరేషన్‌తో పట్టణ పరిధి పెరగడంతో అధికారుల పర్యవేక్షణ లేక ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. పట్టణంలో వెలువడే చెత్తను కొంత అండాలమ్మకాలనీకి, మరికొంత నస్పూరు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

# ఊపిరి సలపనివ్వని ఉద్గారాలు



హైదరాబాద్: పారిశ్రామికవాడల్లో వెలువడే కాలుష్య ఉద్గారాలతో వాయునాణ్యత క్షీణిస్తోంది. జీడిమెట్ల, నాచారం, బాలానగర్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని పాశమైలారం, బొల్లారం పారిశ్రామికవాడ నుంచి వెలువడే కలుషితాలు నగరవాసులకు ఊపిరి సలపనివ్వడం లేదు. దిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) అధ్యయనం ప్రకారం పాశమైలారంలో అత్యధిక కాలుష్యం నమోదవుతోందని పేర్కొంది. 2024–25లో ఇతర నగరాల్లోని ప్రాంతాలతో పోల్చితే.. పాశమైలారం మూడో స్థానంలో ఉందని తెలిపింది. ఘనపు మీటరు గాలిలో 62 మైక్రోగ్రాముల పీఎం 2.5 సీజనల్ సగటు నమోదైందని పేర్కొంది.


**ఇష్టారీతిన వ్యర్థాల పారబోత..**

పాశమైలారంలో ఔషధ, రసాయన పరిశ్రమలు అనేకం ఉన్నాయి. కాలుష్య కట్టడిని విస్మరించి కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయని పరిశ్రమలు వ్యర్థాలను ట్యాంకర్లలో తరలించి నగరంలోని జలాశయాల్లో పారబోస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల రాజేంద్రనగర్ సమీపంలో మూసీలో పారబోస్తున్న సమయంలో స్థానికులు రెడ్ హ్యాండెడ్‌గా ఈ ట్యాంకర్‌నుపట్టుకున్నారు. అలాగే మేడ్చల్ సమీపంలోని సుతార్‌పల్లిలోని చెరువులో వ్యర్థాలను పారబోస్తుండగా స్థానికులు అధికారుల సహాయంతో పట్టుకున్నారు. దీనికి తోడు ఫ్యాక్టరీలోని గొట్టాలకు స్క్రబ్బర్లు అమర్చకపోవడంతో ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దట్టమైన పొగసైతం ఊపిరి సలపనివ్వడం లేదు. ఇక్కడ సగటు వాయునాణ్యత సూచీ 105గా ఉంది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వెంకటాద్రినగర్, గంపలబస్తీ తదితర కాలనీల్లో బోరు నుంచి ఘాటైన రంగు నీళ్లు ఉబుకుతున్నాయి. తాగడానికి, వాడుకోవడానికి చుక్క నీరు పనికిరాకుండా పోతోంది. నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. జీడిమెట్లలోనూ సగటు సూచీ 100 దాటిందని పీసీబీ నివేదిక పేర్కొంది. బొల్లారం పారిశ్రామికవాడలో ఓజోన్ కాలుష్యం సురక్షిత పరిమితులకంటే ఎక్కువగా నమోదవుతోంది. 17 రోజులు వరుసగా ఈ ప్రాంతంలో భూస్థాయి ఓజోన్ అత్యధికంగా ఉందని అధ్యయనాల్లో వెల్లడైంది. వాయుకాలుష్యంతో స్థానికులు ఊపిరితిత్తుల సమస్యలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వ్యర్థ రసాయనాలను ఇష్టానుసారంగా పారబోస్తుండటంతో జల కాలుష్యం పెరిగి స్థానికంగా తాగునీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావంపడుతోంది. వాయునాణ్యత సూచీ సైతం 100కి పైగా ఉంది.

**నియంత్రణ చర్యలేవీ..?**

రాజధాని పరిధిలో 3 నైట్ పెట్రోలింగ్ బృందాలు రాత్రి నుంచి ఉదయం వరకు గస్తీలో ఉంటాయి. ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బంది పారిశ్రామికవాడలతో పాటు పౌరుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో తిరిగి కట్టడికి చర్యలు తీసుకోవాలి. తూతూమంత్రంగానే తనిఖీలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సమాచారం ఇచ్చిన అరగంటకు గానీ ఘటనాస్థలికి చేరుకోవడం లేదని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# లైసెన్సులు వారివి.. ఆటోలు వీరివి!




హైదరాబాద్: గ్రేటర్‌లో కొత్త ఆటోల పర్మిట్ల జారీకి సంబంధించి చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రేటర్‌లో ఎల్‌పీజీ, సీఎన్‌జీ,ఎలక్ట్రిక్ కలిపి మొత్తం 45 వేల కొత్త ఆటో పర్మిట్ల జారీకి ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. మరో 25వేల పాత ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను తీసుకునే అవకాశం కల్పించింది. ఈ క్రమంలో మార్కెట్ ధర కంటే రూ.40వేల నుంచి రూ.60 వేలు అధిక ధరలకు విక్రయించాలని కొందరు ప్రైవేటు ఫైనాన్షియర్లు కొత్త ఆటోలను నల్లబజారు బాట పట్టించడానికి పకడ్బందీగా ప్రణాళిక వేసినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం హైదరాబాద్‌లో కొత్త ఆటో కొనాలంటే ఓఆర్ఆర్ పరిధిలో నివాసం ఉన్నట్లు గుర్తింపు కార్డుతోపాటు ఆటో డ్రైవింగ్ లైసెన్సు, గతంలో తన పేరుతో ఆటో లేనట్లు ధ్రువీకరణ పత్రంతో ప్రొసీడింగ్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడే అసలు తంతు నడుస్తోంది. చాలామందికి గుర్తింపుకార్డు, లైసెన్సు ఉన్నా వారు ఆటో నడిపేందుకు ఆసక్తిగా లేరు. ఈ వివరాలను సేకరించి వారి పేరుతో ప్రొసీడింగ్స్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. తర్వాత వీరి పేరుతోనే కొత్త ఆటో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అలా వాటిని ఫైనాన్షియర్ల గుప్పిట్లో పెట్టుకుని తర్వాత అధిక ధరలకు విక్రయించి వారి పేరుతో ట్రాన్స్‌ఫర్ చేయడం లేదంటే అద్దెకు తిప్పడం చేస్తున్నారు. 20వేల ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోలకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేయగా...ఇందులో కొన్నింటిని బ్లాక్ మార్కెట్ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

**ఒకరి పేరుతో ఆటో.. మరొకరు యజమాని**

గ్రేటర్‌లో ప్రస్తుతం లక్షన్నర వరకు ఆటోలు తిరుగుతున్నాయి. వాటిలో 50–60 వేల ఆటోలకు ఎవరు యజమానో తెలియడం లేదు. ఫైనాన్స్ తీసుకొని ఆటోలుకొన్న చాలామంది ఈఎంఐలు కట్టలేక ఫైనాన్షియర్లకే అప్పగించేస్తున్నారు. వీటిని వారు వేరొకరికి విక్రయిస్తున్నారు. వివిధ కారణాలతో అవి వారి పేరుపైకి మారడంలేదు. అలాంటి ఆటోలను ఉపయోగించి అసాంఘిక శక్తులు నేరాలకు పాల్పడితే ఎవరు బాధ్యులనేది కీలకం. తాజాగా కొత్త ఆటోల కేటాయింపులో బ్లాక్‌చేయడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి దందాకు దారితీసే ప్రమాదం ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ వ్యవహారంలో పారదర్శకత ఉండేలా చూడాలని ఆటో యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

# అయిదు నెలలు.. మూడు సార్లు




రామగుండం : రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో తరచూ సాంకేతిక అవాంతరాలతో యూరియా ఉత్పత్తికి తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలోని అయిదు నెలల్లో మూడుసార్లు అమ్మోనియా పైపులైన్ లీకేజీ కారణంగానే ఉత్పత్తి నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో లీకేజీలను శాశ్వతంగా అరికట్టలేకపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏటా సుమారు నెల రోజుల పాటు కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేసి వార్షిక మరమ్మతు చేపడుతుండగా మిగతా 11 నెలలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉత్పత్తి కొనసాగాల్సి ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 25 రోజుల్లోనే వార్షిక మరమ్మతు పూర్తిచేసుకొని ఉత్పత్తిని ప్రారంభించగా ఈసారి 40 రోజులు పట్టింది. వార్షిక మరమ్మతు కోసం మే 8న ఉత్పత్తి నిలిపివేయగా అనంతరం జూన్ 16న ప్రారంభమైంది. నెల రోజుల్లోనే అమ్మోనియా లీకేజీ కారణంగా జులై 16న ఉత్పత్తి నిలిపివేయగా మరమ్మతు అనంతరం ఆగస్టు 4న ఉత్పత్తి ప్రారంభం కాగా కేవలం 10 రోజుల్లోనే అదే లీకేజీ కారణంగా మరోసారి నిలిపివేయాల్సి వచ్చింది. మరమ్మతుల అనంతరం తిరిగి ఈ నెల 23న ఉత్పత్తి ప్రారంభం కానున్నట్లు భావిస్తుండగా జాప్యం జరిగే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జులై వరకు లీకేజీలు, మరమ్మతు కారణంగా సుమారు ఒకటిన్నర నెలపాటు యూరియా ఉత్పత్తిని కోల్పోవాల్సి వచ్చింది. **శాశ్వత పరిష్కారంపై నిర్లక్ష్యం**ఆర్ఎఫ్‌సీఎల్‌లో తరచూ ఎదురవుతున్న అమ్మోనియా లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటేనే కర్మాగారం పురోగతి సాధించడంతో పాటు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోనుం ది. నిధులు, విద్యుత్తు కొరత, సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోకపో వడంతో పాటు వివిధ కారణాలతో ఖాయిలా పడ్డ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎరువుల కర్మాగారం మూసివేతకు గురైంది. ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలో వివిధ రాష్ట్రాల్లో ఎరువుల కర్మాగారాలు ఉండడంతో దిల్లీలో కేంద్ర కార్యాలయం ఉండేది. ఆర్ఎఫ్‌సీఎల్ పరిధిలో కేవలం రామగుండంలో మాత్రమే కర్మాగారం ఉండడంతో సంస్థ కేంద్ర కార్యాలయాన్ని ఇక్కడికి మార్చాలనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు స్థానిక నాయకులు కేంద్రాన్ని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు.

**పెరుగుతున్న ఒత్తిళ్లు...** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా యూరియా కోసం ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూరియా కేటాయింపులపై ఆయా రాష్ట్రాల నుంచి కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. తమ రాష్ట్రాలకు యూరియాను తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులే స్వయంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు ఆగస్టులో 65వేల టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి మార్గదర్శకాలు జారీ అయినప్పటికీ పక్షం రోజుల్లోనే ఉత్పత్తి నిలిచిపోవడంతో సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. గత ఆర్థిక సంవత్సరం ఆరంభంలోని ఏప్రిల్ నుంచి జులై వరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు మరో అయిదు రాష్ట్రాలకు 4,16,659 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జులై వరకు లీకేజీల కారణంగా కేవలం 2,40,530 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారు. ఆగస్టులో 36వేల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది.

## అను'గృహం' లేనట్టేనా?

నిజామాబాద్: 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. పనులను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. పూర్తయిన వాటిని ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రారంభించి, లబ్ధిదారులతో గృహ ప్రవేశ వేడుకలు జరిపించేందుకు సర్కారు నిర్ణయించింది. కానీ, జిల్లాలో ఇప్పటివరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లూ పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసుకోలేదు. గృహ ప్రవేశాలపై జిల్లా అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

కారణాలివే..

ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే లబ్ధిదారుకు ప్రభుత్వం వివిధ దశల్లో రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తుంది. తొలుత పునాది వరకు సొంతంగా నిర్మించుకుంటే సాయం మంజూరు మొదలవుతుంది. ఇందుకు రూ.లక్ష వరకు ముందే ఖర్చు చేయాలి. చాలామంది లబ్ధిదారులకు ఆర్థిక స్థోమత లేక తొలినాళ్లలో నిర్మాణాలకు ముందుకు రాలేదు. దీంతో పలువురు పేదలను అధికారులు గుర్తించి 'సెర్ప్' ద్వారా రూ.లక్ష వరకు బ్యాంకు రుణాలిప్పించారు. నిర్మాణాలు చేపట్టాక వర్షాలకు ఇసుక కొరత ఏర్పడటంతో పనులు నెమ్మదించాయి. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా భవన నిర్మాణ సామగ్రి ధరలూ



పెరిగాయి. మరోవైపు తాపీమేస్త్రీలు, కూలీల చెల్లింపులు భారంగా మారాయి. ఫలితంగా వందలాది మంది పునాదులు చేపట్టకుండానే చేతులెత్తేశారు. ఇళ్లు కట్టుకునే స్థోమత లేదంటూ ఎంపీడీవోలకు లేఖలు రాసిచ్చారు.

**నగర, పురపాలికల్లో మరింత వెనుకబాటు..**

గ్రామీణ ప్రాంతాల్లో ఎలాగోలా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకొస్తుండగా, పురపాలక సంఘాల్లో పెద్దగా ఆసక్తి కనబర్చటం లేదు. నిజామాబాద్ నగరంలో 1,420కి గాను 498 ఇళ్లు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయి. ఆర్మూర్‌లో 617కి 242, భీమ్‌గల్‌లో 131కి 51, బోధన్ పట్టణంలో 516కి 289 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు ఇసుక కొరత రానివ్వొద్దని గృహ నిర్మాణ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సమీక్షలు నిర్వహిస్తున్నారు.

## పంట నష్టం.. రహదారులు ధ్వంసం!

ఆదిలాబాద్ : కుండపోత వర్షాలు శనివారం జిల్లాను అతలాకుతలం చేశాయి.. పత్తి, సోయా పంటలు నీట మునగగా.. రహదారులకు తీవ్ర నష్టం జరిగింది.. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం నివేదికను సిద్ధం చేస్తోంది. కలెక్టర్ రాజార్షి షాతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు త్వరలో జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో పెన్‌గంగా నదిపై ఇసాపూర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువనున్న జైనథ్, బేల మండలాల్లో వరద ప్రభావం క్రమంగా పెరుగుతోంది.. మరో మూడ్రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించి.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది..

**పంటలపై ప్రతాపం :** జిల్లా మొత్తం 11,152 ఎకరాల్లో పత్తి, సోయా, కంది పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా తేల్చింది. జిల్లాలోని 21 మండలాల్లోని 263 గ్రామాల పరిధిలో 4,086 మంది రైతుల పంటలకు నష్టం జరిగినట్లు ఆ శాఖ నిర్ధారించింది. అత్యధికంగా పత్తి 8,892, సోయా 1,070, కంది 906, మక్క 284 ఎకరాలు ఇతర పంటలు 65 ఎకరాల్లో నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ నివేదిక తయారు చేసింది.

**పీఆర్ పరేషాన్ :** పంచాయతీరాజ్ పరిధిలో తాత్కాలిక మరమ్మతులకు రూ.3.70 కోట్లు, శాశ్వత పనులు చేపడితే రూ.55.80 కోట్లు అవసరమని పీఆర్ విభాగం తేల్చింది. ఆదిలాబాద్ గ్రామీణం, బోథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్ మండలాల పరిధిలో 24 వేర్వేరు ప్రాంతాల్లో 43 కి.మీ. రహదారులు, 28 కల్వర్టులు, 10 లోలెవల్ వంతెనలకు నష్టం జరిగింది.

**విద్యుత్తు శాఖకు దెబ్బ :** జైనథ్, ఇచ్చోడ, ఉట్నూరు, ఇంద్రవెల్లి మండలాల్లో 33 కేవీ లైన్ స్తంభాలు తొమ్మిది, 11 కేవీ స్తంభాలు 20, మరో 27 వ్యవసాయ, గృహ వినియోగ స్తంభాలు నేలవాలినట్లు గుర్తించిన విద్యుత్తు అధికారులు తాత్కాలిక మరమ్మతులకు రూ.9.60 లక్షలు అవసరమని తేల్చారు.

**ఆర్అండ్‌బీ గోడు :** ఆర్అండ్‌బీ పరిధిలో తాత్కాలికంగా 3.15 కోట్ల విలువైన పనులకు నష్టం వాటిల్లింది. శాశ్వతంగా పూర్తిచేయాలంటే రూ.70.20 కోట్లు అవసరమవుతాయని ఆ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఆదిలాబాద్ గ్రామీణం, ఉట్నూరు, ఇంద్రవెల్లి, నేరడిగొండ, తాంసి, తలమడుగు మండలాల పరిధిలో 145 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. మరో 28 కాజ్‌వేలు, 14 కల్వర్టులకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదిక తయారు చేసింది.

## జల పరవళ్లు.. సాగుపై ఆశలు

నిర్మల్ : ఇన్నాళ్లూ నీటి వనరులు పుష్కలంగా ఉన్న జిల్లాపై వరుణుడు కరుణ చూపించలేదు. మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీంలలో వాన బీభత్సం సృష్టించింది. అక్కడి వాగులు పొంగిపొర్లి ప్రవహించాయి. చెరువులన్నీ నిండుకుండలా మారాయి. నిర్మల్ జిల్లాలో మాత్రం ప్రాజెక్టులు, చెరువుల్లో నీళ్లు లేక బోసిపోతూ కనిపించాయి. ఈసారి జిల్లాపై వరుణుడు కరుణించాడు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, ఒర్రెలు పొంగి పొర్లుతున్నాయి. నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు నీటితో నిండుకుండలా కనిపిస్తున్నాయి.

**'గేట్లు' తెరుచుకున్న జలాశయాలు**జిల్లాలోని స్వర్ణ, గడ్డెన్నవాగు, కడెం, ఎస్సారెస్పీ జలాశయాలు జలకళ సంతరించుకు న్నాయి. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో పరవళ్లు తొక్కుతున్నాయి. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఎత్తడంతో వేల క్యూసెక్కుల నీరు గోదావరిలో కలుస్తుండటంతో ఎస్సారెస్పీలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. లక్షకుపైగా క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుండటంతో జిల్లాలోని సరస్వతి ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షాకాలం మొదలై రెండున్నర నెలలు గడిచినా భారీ వర్షాలు కురవ లేదు. ఆదిలోనే వరుణుడు మురిపించాడు. ఆ వానకు చెరువుల కింద ఆయకట్టు రైతులు వరినార్లు వేసుకున్నారు. తర్వాత అడపాదడపా ముసురుతో వాన కురిసినా జిల్లాలో ఆయకట్టు ఉన్న 661 చెరువుల్లోకి నీరు రాలేదు. వీటి కింద 56 వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతుల్లో ఆందోళన మొదలైంది. వేసిన వరి నార్లు ముదురుతుండటంతో వరి సాగు కష్టమేనని భావించారు.

చురకలు



# క్వారీల సీనరేజీ వసూలు ప్రైవేటుకు..!

ఒంగోలు: గ్రానైట్, ఇతర క్వారీల నుంచి సీనరేజీ వసూలు చేసే బాధ్యత ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఓ ప్రైవేటు సంస్థ చేపట్టనుంది. టెండరులో పోటీపడి దక్కించుకున్న ఏఎంఆర్ సంస్థ నెలకు రూ.47 కోట్లు చొప్పున రెండేళ్ల కాలానికిగానూ రూ.1,135 కోట్లు ప్రభుత్వానికి జమ చేయనుంది. దీనికి సంబంధించి గనులశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో క్వారీలను ఈ నెల 25వ తేదీలోగా భూగర్భ గనులశాఖ అధికారులు అప్పజెప్పనున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో గ్రానైట్ క్వారీలతో పాటు కంకర, గ్రావెల్ చిన్నా చితక క్వారీలు మొత్తం 600 వరకు ఉన్నాయి. వీటిలో 90 శాతం గ్రానైట్ క్వారీలే ఉన్నాయి. భూగర్భ గనులశాఖ అధికారులు గ్రానైట్ క్వారీలో ముడిరాయి క్యూబిక్ మీటరుకు రూ.5 వేలు వరకు వసూలు చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వానికి జిల్లా పరిధిలో సీనరేజీ రూపంలో రూ.450 కోట్ల వరకు వచ్చింది. వాస్తవానికి క్వారీ నుంచి రాళ్లు, గ్రావెల్ వంటివి బయటకు తరలించాలంటే నిబంధనల ప్రకారం సీనరేజీ చెల్లించాలి. క్వారీలు నాయకుల చేతిలో ఉండడం, పలు ఒత్తిళ్లతో పన్ను వసూళ్లు కొంత వరకు తక్కువగానే ఉంటున్నాయి. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేటు గుత్తేదారు కొలత ప్రకారం ఎంత ముడిసరకు బయటకు వెళ్లిందో లెక్కించి అందుకనుగుణంగా పన్నుల వసూలు చేపడతారు. గనులశాఖ స్థానంలో ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యతలను చేపడతారు.



ఈ నెల కొంతే పన్నులు వసూలయ్యాయని తప్పించుకోకుండా నెలకు ఠంచనుగా రూ.47 కోట్లు గుత్తేదారు సంస్థ చెల్లించాల్సిందే. సీనరేజీ అంచనా వేసిన మేరకు విభాగాల వారీగా ఆయా ప్రభుత్వ ఖాతాలకు నెల వారీ సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. గ్రానైట్, కంకర తదితరాలే మాదిరే గ్రామాల్లో మట్టి, గ్రావెల్ వంటివి తరలించినా పన్ను రాబట్టేందుకు ప్రయత్నిస్తారు. సొంత పొలంలో తవ్వి తరలించినా, ఇంట్లో అవసరాలకు తీసుకెళుతున్నా ముక్కు పిండి మరీ పన్ను వసూలు చేస్తారు.

**నెలవారీ గుత్తేదారు చెల్లింపుల వివరాలు (రూ.కోట్లలో)**

సీనరేజీ రూపేణ: 38.94

జిల్లా ఖనిజనిధి: 6.6

ఖనిజాన్వేషణ నిధి: 0.80

ఇతరేతర ఖర్చులు: 0.92

# పారని పథకం... జారని ఉదకం!

టంగుటూరు: జిల్లాలోని అధిక శాతం పంటలు వర్షాధారం పైనే సాగవుతున్నాయి. ఇక్కడ కరవును పారదోలడంతోపాటు తాగు, సాగునీరందిచాలనే లక్ష్యంతో గత తెదేపా ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపడితే గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాల నిర్వహణపై దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గత తెదేపా ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 160 చిన్న, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలు నిర్మించింది. సుమారు 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేవిధంగా దర్శి, కనిగిరి, కొండపి, మార్కాపురం, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో ప్రవహించే గుండ్లకమ్మ, ముసి, పాలేరు, ఇనగలేరు, ముట్టేరు నదులు, వాగులపై పథకాలు నిర్మించారు. పథకాలు మరమ్మతులకు గురవ్వడం, ఎగువ నుంచి నీరు రాకపోవడం, మోటార్లు కాలిపోవడం, విద్యుత్తు పరివర్తకాలను దొంగలు ధ్వంసం చేయడం తదితర కారణాలతో వినియోగంలో లేకుండాపోయాయి. వీటికి మరమ్మతులు చేసేందుకు



2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనంతరం అధకారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం 25 శాతం పనులు జరగని ప్రాజెక్టులను నిలిపివేయాలని జీవో విడుదల చేయడంతో పథకాలు మూలకు చేరాయి. సుమారు 2 లక్షల మంది రైతులకు ఉపయోగపడే పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతాంగం కోరుతోంది. ఈ విషయమై జిల్లా నీటిపారుదలశాఖ ఈఈ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మరమ్మతులకు గురైన చిన్న పథకాలను బాగుచేసేందుకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించామన్నారు. నిధులొచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు.

# విలువల విద్య.. భావితరానికి చేయూత

నెల్లూరు :నెల్లూరులో ఉన్నత స్థితిలో ఉన్న దంపతులకు ఇద్దరు సంతానం. వారిద్దరిని బాగా చదివించారు. కుమార్తె విదేశాల్లో ఉంది. కుమారుడు పక్క రాష్ట్రంలో ఉన్నాడు. ఆస్తి కుమార్తెకు ఎక్కువ ఇచ్చారని కొడుకు, కోడలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రి మృతిచెందినా రాలేదు. గ్రామాల్లో తల్లిదండ్రులకు పింఛన్ నగదు వస్తుండటంతో వారికి అండగా ఉంటున్నారు. దీనికి ముఖ్య కారణం సమాజంలో విలువలు దిగజారడమేనని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలు 428 వరకు ఉన్నాయి. వీటిలో 6 నుంచి పదో తరగతి వరకు సుమారు 80 వేల మంది విద్యార్థులున్నారు. వారికి విలువల విద్యతో కూడిన పుస్తకాలందిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎన్ని మార్కులొచ్చాయి. ఎంత ర్యాంకు వచ్చిందని మాత్రమే ఎక్కువ మంది తల్లిదండ్రులు చూస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో ఎలాగైనా సంపాదించాలి.. ఏం చేసైనా.. అనే ధోరణులు పెరిగాయి. ఇలాగే ఎదిగితే లాభనష్టాలు తప్ప తల్లిదండ్రులపై ప్రేమ, మమకారాలు మరిచిపోతున్నారు. ఇది గమనించిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు విలువల విద్యనందించాలని ప్రత్యేకంగా పుస్తకాలు రూపొందించి పంపిణీ చేస్తోంది. విలువల విద్య పుస్తకాలను రాష్ట్ర శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్టీ) చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రూపొందించారు.పుస్తకాల్లో ప్రసిద్ధుల గురించి అంశాలు, నైతిక విలువలు, రాజ్యాంగం, లింగ సమానత్వం, బాల్య వివాహం వంటి సామాజిక అంశాలున్నాయి.

# వైద్య సేవలెన్నో.. కేజీహెచ్‌లో!




విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయిని కింగ్‌జార్జ్ ఆసుపత్రిలో (కేజీహెచ్) ఓపీ(అవుట్ పేషెంట్) విభాగం సేవలు అత్యంత కీలకం. అత్యవసర కేసులు మినహాయిస్తే మిగిలిన రోగులంతా ఓపీ విభాగాలకు వచ్చి వైద్యులను సంప్రదించాలి. వారి ఆరోగ్య స్థితిని అంచనా వేసి, అవసరమైతే ఇన్‌పేషెంట్లు(ఐపీ)గా చేర్చుకుని వైద్యం అందిస్తారు. నిత్యం దాదాపు రెండు వేల మంది ఇక్కడికొస్తుంటారు.

**24 గంటలు ఇలా..** అత్యవసర విభాగం(క్యాజువాల్టీ)లో ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్లు, క్లినిక్ లేబొరేటరీ, బ్లడ్ బ్యాంకు, కార్డియాలజీ వార్డు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. మిగిలిన విభాగాలు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తాయి.

ఓపీ ఎక్స్‌రే విభాగం మాత్రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే సేవలు అందిస్తుంది.

సాధారణ ఓపీలకు ఆదివారం సెలవుగా పరిగణిస్తారు. అయితే ఇన్ పేషెంట్లకు కేస్ షీట్లు 24 గంటలూ జారీ చేస్తారు.

**విభాగాలు.. గదులు**

సోమవారం నుంచి శనివారం వరకు అందుబాటులో ఉండే అన్ని రకాల ఓపీలకు ఇటీవల ప్రత్యేకంగా గదులు కేటాయించారు. ఆ వివరాలు..

విభాగం పేరు(గది నంబరు): ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్(1), క్యాజువాల్టీ(2), ఫార్మసీ(3), క్యాజువాల్టీ ఫార్మసీ(3ఏ), డెంటల్(4), ఫార్మసీ స్టోర్(5), అత్యవసర ఓపీ(6), ఇన్‌జెక్షన్ రూమ్(7), న్యూరో, కార్డియాలజీ, సీటీ సర్జరీ (8), జనరల్ సర్జరీ(9), ఆర్థోపెడిక్స్ (10), ఫిజియోథెరపి (11), ఆయుర్వేదం(11ఏ), యూరాలజీ(12), ఎక్స్‌రే(13), పీడియాట్రిక్ సర్జరీ(14), జనరల్ మెడిసిన్(15), గర్భిణుల ఓపీ(16), గైనకాలజీ(17), కుటుంబ నియంత్రణ(18), పీడియాట్రిక్స్ (19), క్షయ నియంత్రణ(టీబీ)(20), వెల్‌నెస్ సెంటర్(21), ఎస్‌టీడీ(22), టీఆర్ ఐసీయూ(23), గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ(24), డెర్మటాలజీ(25), క్లినికల్ లేబొరేటరీ(26), బ్లడ్ బ్యాంకు(27), కార్డియాలజీ వార్డు(28), రేడియాలజీ (స్కాన్)(29), ఆప్తమాలజీ(30), ఎండోక్రైనాలజీ (31), ఏఆర్‌టీ సెంటర్(32), డీఈఐ సీఓపీ(33), సైకియాట్రిక్ ఓపీ(34), సీటీఎంఆర్ఐ(35), మెడికల్ ఆంకాలజీ(36), రేడియో థెరపి(37), సర్జికల్ ఆంకాలజీ (38), వాస్కులర్ సర్జరీ(39), న్యూక్లియర్ మెడిసిన్(40), ప్లాస్టిక్ సర్జరీ(42), ప్రివెంటివ్ సర్జరీ(222).

# ఉచితానికి తూట్లు!



చిత్తూరు : వైకాపా హయాంలో ఐదేళ్లపాటు ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగింది. స్వర్ణముఖి, అరణియార్, నీవా తదితర నదుల్లో రోడ్లు వేసి మరీ టిప్పర్లలో ప్రకృతి సంపదను తరలించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణదారులకు మేలు చేసేందుకు ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చి వినియోగదారులపై గణనీయంగా భారం తగ్గించింది. అయినప్పటికీ కొందరు అక్రమార్కులు పాత పంథా వీడలేదు. తామే ఇసుకను సరఫరా చేస్తామని చెప్పి ఇతరులను నదీ పరీవాహక ప్రాంతంలోకి రానివ్వకుండా తమ దందా సాగిస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టి సారిస్తే దోపిడీకి చరమగీతం పాడవచ్చు.

**గూడలి నుంచి తమిళనాడుకు**

తిరుపతి జిల్లా కోట మండలం గూడలిలోని స్వర్ణముఖి నది ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో చక్రం తిప్పే నాయకుడు ఈ దందా వెనుక ఉన్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల చిత్తూరు మండలం పాలంతోపు వద్ద పైన పొట్టు.. కింద ఇసుకతో వెళుతోన్న లారీ పట్టుబడినా సూత్రధారిపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు జంకారు. లారీ ఇసుకను రూ.1.50 - రూ.2 లక్షలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. రోజూ 15- 20 లారీలు తమిళనాడుకు తరలుతున్నాయి.

**శ్రీకాళహస్తిలో మారని తీరు**

జిల్లాలో ఎక్కడా లేనంతగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రేణిగుంట, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో స్వర్ణముఖి నదిని గుల్ల చేస్తున్నారు. పలువురు ప్రైవేటు భూముల్లోనూ తవ్వకాలు చేస్తున్నారు. గనులు, రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారు. సమీపంలో ఉన్న తిరుపతి నగరంతోపాటు తమిళనాడుకూ తరలిస్తున్నారు. రోజూ వందలాది ట్రిప్పుల ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రిళ్లు కూడా పంపిస్తున్నారు. ప్రజాప్రతినిధులకూ ఇందులో హస్తం ఉండటంతో యంత్రాంగం పట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

నాగలాపురం మండలంలో అరణియార్ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. ప్రధానంగా రాత్రిళ్లు వాహనాలు సరిహద్దులు దాటుతున్నాయి. పక్కనే తమిళనాడు రాష్ట్రం ఉండటంతో అక్కడకు ప్రకృతి సంపదను పంపిస్తున్నారు. అడపాదడపా మాత్రమే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# అడగకున్నా.. అక్కరకు వచ్చేలా..!

చిత్తూరు : మీరు ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం కోసం చేసిన దరఖాస్తు అందింది. 25 రోజుల్లో ప్రాసెస్ పూర్తవుతుంది. ఇలా ఏపీ గవర్నమెంట్ పేరుతో సంక్షిప్త సందేశం చరవాణిలకు కొన్ని రోజులుగా వస్తోంది. దరఖాస్తు చేయకుండానే ధ్రువీకరణ పత్రం జారీ చేయడం ఏంటనే అనుమానం పలువురిలో కలుగుతోంది.


విద్య, ఉపకార వేతనాలు, ఉద్యోగం, అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధికి ప్రామాణికమైన కుల ధ్రువీకరణ పత్రాన్ని ప్రజల ఇంటికే నేరుగా అందించాలని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే చరవాణిలకు సందేశాలు వస్తున్నాయి. ఇప్పటివరకు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే సచివాలయం, రెవెన్యూ కార్యాలయాలకు పలుమార్లు వెళ్లాల్సి వచ్చేది. ఈ అవసరం లేకుండా అక్టోబరు 2న ఇంటికే ఆ పత్రాన్ని అందించేందుకు రెవెన్యూ శాఖ ఈ కసరత్తు చేస్తోంది.

**ఇలా ఎందుకంటే..**

గతంలో వీఆర్వోలు చేపట్టిన కుటుంబాల సర్వేలోని వివరాల ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలన చేపడుతున్నారు. ఈ సర్వే ఇంకా కొనసాగుతోంది.

**15లోపు పూర్తి చేయాలి..**

ధ్రువపత్రాల జారీలో భాగంగా వీఆర్వో లాగిన్ నుంచి ఆర్ఐకి అక్కడి నుంచి తహసీల్దార్ వద్దకు వెళ్లి వెబ్‌ల్యాండ్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కొన్ని ఆర్డీవో, జేసీల పరిశీలనకు వెళ్తున్నాయి. అర్హుల జాబితాను రెవెన్యూ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. అవసరమైనప్పుడు సులువుగా పత్రాలు తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఈనెల 15లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

**చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ధ్రువపత్రాల వివరాలు..**

పరిశీలనలో : 4,49,746

పరిశీలించినవి : 3,32,670

పెండింగ్ : వీఆర్వోల వద్ద 2,90,500

తహసీల్దార్ల వద్ద: 42,752

ఇప్పటివరకు ఆమోదించినవి : 94,136

# ఉపాధికి ఊరట!

ఒంగోలు : ఉపాధి హామీ పథకం కూలీలకు నెలల తరబడి పేరుకుపోయిన వేతన బకాయిలను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. దీంతో జిల్లాలోని సుమారు రూ.1.50 లక్షల మంది కూలీల ఖాతాల్లోకి మరో వారం రోజుల్లోగా నగదు జమ కానుంది. జిల్లాలోని 38 మండలాల పరిధిలో పనికి వచ్చే కూలీలు రూ.6.80 లక్షల మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌తోపాటు త్వరలోనే రబీ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధిహామీ పథకం కూలీలు వ్యవసాయ పనులపై ఆధారపడుతున్నారు. దీంతో ప్రస్తుతం రోజుకు సరాసరిన 2 వేల మందికి మించి కూలీలు పనులకు రావడం లేదు. మార్గ దర్శకాల మేరకు వారం రోజులకొకసారి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే 29వ తేదీ నుంచి కూలీలకు వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. ఉపాధిహామీ పథకం పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని మండలాల వారీగా లక్ష్యాలు పెట్టినా క్షేత్రస్థాయిలో బకాయిలపై డ్వామా సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.



**మూడు నెలలకుపైగా బకాయిలు**

కూలీల వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. కేంద్రం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో మూడు నెలలకుపైగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లాలో సుమారు 1.50 లక్షల మందికి రూ.119.73 కోట్ల మేర వేతన బకాయిలున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్య పనుల కింద గ్రామాల్లో పంట కుంటలు, పశువుల నీటి తొట్టె నిర్మాణ పనులతోపాటు, చెరువుల అభివృద్ధి, ఫీడర్ ఛానల్, పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. తాజాగా వేతన బకాయిలు విడుదల కావడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధిహామీ పథకం కింద జారీ చేసిన కార్డులు : 4.42 లక్షలు**

పనికి వస్తున్న కుటుంబాలు: 3.81 లక్షలు

కూలీలు: 6.80 లక్షలు

2025-26 సంవత్సరానికి ఇప్పటివరకు ఖర్చు చేసింది: రూ.252.45 కోట్లు

ఈ ఏడాది మే 29 వరకు విడుదలైన మొత్తం : రూ.132.72 కోట్లు

పెండింగ్‌లో ఉన్న బకాయిలు : రూ.119.73 కోట్లు

# మనకూ కావాలోయ్.. మియావాకీ!

నెల్లూరు: నెల్లూరు నగరంలో గాలి నాణ్యత క్షీణిస్తోంది. పారిశ్రామికీకరణ.. పచ్చదనం తగ్గిపోవడం.. భవన నిర్మాణాలు.. వాహనాల రద్దీతో దుమ్ము, ధూళి కణాలు విపరీతంగా పెరిగాయి. హెల్మెట్, కళ్లజోడు లేకుండా ద్విచక్ర వాహనాలపై బయటకు రావాలంటే భయపడే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో జపాన్ వృక్ష శాస్త్రవేత్త అకీరా మియావాకీ అనుసరించిన అధిక సాంద్రతలో మొక్కలు నాటే విధానాన్ని ఇప్పటికే జిల్లాలో ప్రారంభించగా- మంచి ఫలితాలు ఇస్తుండటంతో తాజాగా అటవీశాఖ, డ్వారా అధికారుల ఆధ్వర్యంలో చిట్టడవుల సృష్టికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

**12 చోట్ల ప్రతిపాదనలు**

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం చుట్టూ గతంలో మూడు ఎకరాల్లో 70వేల మొక్కలు నాటగా.. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. ఏడాది కిందట కోవూరు డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కొంత స్థలంలో మియావాకీ విధానంలో మొక్కలు నాటారు. ప్రస్తుతం డ్వామా ఆధ్వర్యంలో ఆరు ప్రాంతాల్లో 25 సెంట్ల చొప్పున ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ కలప, ఫలసాయం ఇచ్చే మొక్కలను ఒకే ప్రదేశంలో 2,500 నుంచి మూడు వేల వరకు నాటాలని నిర్ణయించారు. ఒక యూనిట్‌లో నరేగా పద్దులో.. రెండేళ్ల నిర్వహణకు రూ. 9.87 లక్షలు ఖర్చు చేయనున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలోనూ జిల్లాలోని ఆరు నగరవనాల్లో.. ఈ పద్ధతిలో మొక్కల పెంపకానికి సన్నాహాలు చేస్తున్నారు.

కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ప్రకటించిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్' ర్యాంకులు-2025ల్లో నెల్లూరు నగరానికి 18వ స్థానం వచ్చింది. 3 నుంచి 10 లక్షల్లోపు జనాభా విభాగంలో ఈ స్థానం లభించింది.

నగర, పట్టణ ప్రాంతాల్లో లేఅవుట్ నిబంధనల మేరకు, ఇతర ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఎంపిక చేసి మియావాకీ విధానంలో కృత్రిమ అడవుల ఏర్పాటుకు ముందుకు రావాలి. ప్రభుత్వ బాధ్యతతో పాటు పౌర సమాజం చొరవ చూపాలి. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, విద్యా సంస్థలు దత్తత రూపంలో ఖాళీ స్థలాల్లో ఈ అడవుల సృష్టి బాధ్యత తీసుకోవాలి

# ఏక చెల్లింపుతో టిడ్కో ప్లాట్..

కావలి : టిడ్కో సముదాయాల్లోని మిగులు ప్లాట్లను.. ఏక చెల్లింపు విధానంతో కొత్తవారికి ఇవ్వనున్నారు. 365 చదరపు అడుగుల నిర్మాణాన్ని రూ.3.65 లక్షలు, 430 అడుగులైతే రూ.4.15 లక్షలకు విక్రయించనున్నారు. బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ కమిషనర్లకు దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గత తెదేపా హయాంలో 66 బ్లాకులుగా.. ఇక్కడి టిడ్కో సముదాయాన్ని నిర్మించి.. ఒక్కో బ్లాక్‌లో 32 కుటుంబాలు నివాసం ఉండేలా వెసులుబాటు కల్పించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటి రంగులు మార్చిందే తప్ప.. లబ్ధిదారులకు ఇవ్వలేదు. చాలా మందికి వాటి స్వాధీనంలో సందిగ్ధత నెలకొంది. రుణాలు తీసుకోవడంలోనూ ఇబ్బందులు పడ్డారు. నిర్మించిన ప్లాట్లలో 300 చదరపు అడుగులవి 704, 365 చ.అ 864, 430వి 544 వరకు ఉన్నా.. వాటిలో చేరిన వారి సంఖ్య 800 కుటుంబాల్లోపే. ప్రస్తుతం 300 చదరపు అడుగులవి ఉచితం కావడంతో.. లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. నెల్లూరు నగరంతో పాటు మున్సిపాలిటీల్లో సుమారు 70 శాతం ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఇప్పుడు ఆ రెండు కేటగిరీల్లో ఏక చెల్లింపుతో ఎవరైనా కొత్తగా చేరేందుకు ఉన్నాయి.

చురకలు



## ఎంపీ సోదరుడి భూమి కబ్జాకు యత్నం

పీఎంపాలెం : విశాఖ బీచ్‌రోడ్డు రుషికొండ ప్రాంతాల్లో భూ కబ్జాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే తరహాలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సోదరుడు భరద్వాజ్ భూమిని కొందరు ఆక్రమించేందుకు కుట్ర పన్నారు. చిన రుషికొండ సిల్వర్ ఓక్స్ పాఠశాల ఎదురుగా కృష్ణ కోఆపరేటివ్ లేఅవుట్లో భరద్వాజ్‌కు చెందిన టెక్నో ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 1600 గజాల జిరాయితీ స్థలం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.12కోట్లు ఉంటుంది. 2016లో సంస్థ పేరుతో ఆత్మకూరి సత్యనారాయణ, గోపాల కృష్ణమాచార్యుల నుంచి కొనుగోలు చేశారు.



అప్పటి నుంచి ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. మంగళవారం ఉదయం ఆ భూమిలోకి కొందరు ప్రవేశించి సుమారు 500 గజాల స్థలం తమదంటూ రేకుల షెడ్డు, ప్రహరీ నిర్మాణం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న సంస్థ ఉద్యోగులు ఆక్రమణను అడ్డుకున్నారు. ప్రహరీ నిర్మాణ పనుల్లో ఉన్న కూలీలను ప్రశ్నించగా తమకు ఏమీ తెలియదని పాల వరప్రసాద్ అనే వ్యక్తి పంపించినట్లు చెప్పారు. ఎంపీ సోదరుడు భరద్వాజ్ పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వరప్రసాద్‌ను విచారించగా ముద్దాడ పవన్‌కుమార్ తనకు నిర్మాణ ఒప్పందం ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ ఒప్పంద పత్రం సృష్టించి ఈ కబ్జాకు యత్నించానని, దీనికి పూర్తి బాధ్యుడిని తానేనని పవన్‌కుమార్ అంగీకరించాడు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

## కొండలో దాగిన..
## రూ.100 కోట్ల భూదందా

కర్నూలు: ప్రభుత్వ భూమి కొండ ప్రాంతం.. ఏళ్లుగా పేదలు సాగు చేసుకొంటున్నారు.. దానిపై పెద్దల కన్నుపడింది.. కష్టజీవులను తరిమేశారు.. కొండను తవ్వేశారు.. భూదందాకు తెరలేపారు. కల్లూరు మండలం దూపాడులో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. భూ కుంభకోణంలో ఓ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానిక నేతలు, రెవెన్యూ అధికారులను అనుకూలంగా మార్చుకొని దందా కొనసాగించారు. భూ ఆక్రమణ నిజమేనని తేలినా అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తున్నారు.

**మన్నూ తిన్నారు**

దూపాడు గ్రామంలో 44వ జాతీయ రహదారికి సమీపంలో సర్వే నంబరు-139లో 84.02 ఎకరాలు భూమి ఉంది. దీనికి ఆనుకొని ఉన్న కొండను 50 అడుగుల ఎత్తు వరకు తవ్వేశారు. వచ్చిన మట్టిని యథేచ్ఛగా విక్రయించి సొమ్ము చేసుకొన్నారు. కొండ చదును చేసి కొంత భాగంలో తోటలు వేశారు. మరికొంత భాగంలో లేఅవుట్ వేసి వంద మందికి విక్రయించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేలా లే అవుట్ కొంత భాగం పట్టా భూమిలో వేశారు. ప్రభుత్వ భూమిని అందులో కలిపేశారు. ఆ లేఅవుట్ దగ్గరకు వెళ్లడానికి



రహదారులు, విద్యుత్తు లైన్లు, ప్రహరీలు నిర్మించుకున్నారు. ఆయా భూముల్లోని కొంత భాగానికి ఆన్‌లైన్లో కొందరి పేర్లు కనిపిస్తున్నాయి.

**నిషేధిత భూముల జాబితాలో ఉన్నా**

సర్వే నంబరు- 139ను నిషేధిత భూముల జాబితాలో ఉంచారు. రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం లేదు. దీంతో అక్రమార్కులు తెలివిగా ఆ భూమిని 139-1బి, 139-1సిలుగా విభజించి ఏడుగురికి కేటాయించారు. ఈ ప్రక్రియా నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. కొందరికి అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదించి భూకేటాయింపులు చేసినట్లుగా దస్త్రాలు సృష్టించారు. ఇందుకు రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సహకరించారు.

**బోర్డు పెట్టి**

అధికారులు విచారణ చేసి ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు.. అవి ప్రభుత్వ భూములని బోర్డు పెట్టారు. కబ్జాలు జరిగిన తీరు, సూత్రధారులు ఎవరన్న అంశాలతో సమగ్ర నివేదిక ఇచ్చినా.. ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దూపాడుకు చెందిన పలువురు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని ఆశ్రయించి గోడు వెళ్లబోసుకున్నారు. ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించేసుకున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీ కూడా విచారణ చేయాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**ఆక్రమణలు వాస్తవమే- ఆంజనేయులు, తహసీల్దార్, కల్లూరు**

దూపాడులో సర్వే నంబరు-139లోని భూములు కబ్జా అయిన విషయం వాస్తవమే. ఆయా భూముల్లో బోర్డులు ఏర్పాటుచేశాం. విక్రయాలు జరపకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చాం. ఆయా భూములను నిషేధిత భూముల జాబితాలో ఉంచాం.

## ఇక స్మార్ట్ ఈ-పోస్!

మార్టేరు : లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతున్న తరుణంలోనే రేషన్ డీలర్లకు అధునాతన ఈ- పోస్ యంత్రాల (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బియ్యంతో పాటు నిత్యావసర సరకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టాలనే సంకల్పంతో కొత్త యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా స్మార్ట్ రేషన్ కార్డుల స్వైపింగ్‌తో పాటు వేలిముద్రల నమోదు ప్రక్రియ సులభతరం కానుంది. దీంతో కార్డుదారులు దుకాణాల వద్ద పడిగాపులు పడే పరిస్థితి దూరం కానుంది. వేలిముద్రల సమస్యకు సైతం పరిష్కారం చూపేలా ఐరిస్ ద్వారా కూడా సరకులు ఇచ్చేలా కొత్త యంత్రాల్లో ఏర్పాట్లు చేశారు. కార్డులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలతో పాటు ఇవ్వాల్సిన సరకుల సమాచారం కనిపిస్తుంది. తీసుకునే సరకుల వివరాలతో రసీదు సైతం జారీ కానుంది. దీంతో సాంకేతిక సమస్యలతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో 1,052 దుకాణాలకు ఈ యంత్రాలు వచ్చాయని ఏఎస్‌వో రవిశంకర్ తెలిపారు. త్వరలో వారికి అందజేసి వినియోగంపై తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

# క్షణక్షణం.. బిక్కుబిక్కు!!



విశాఖపట్నం : స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు వెళ్లిన విశాఖ వాసులు నేపాల్‌లో చిక్కుకున్నారు. ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తి, జి.సూర్యప్రభ, కేవీఎస్ శ్రీదేవి, కె.సత్యనారాయణ, జీవీవీ పద్మావతి కుటుంబాలు ఈనెల 5న బయలుదేరి నేపాల్ వెళ్లాయి. వారంతా ఒక హోటల్‌లో దిగిన తర్వాత 6న బయలుదేరి ముక్తినాథ్, తదితర ఆలయాలను సందర్శించారు. తిరిగి వచ్చేసరికి వారు బస చేసిన హోటల్‌కు ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. వారి దుస్తులు, కొంత డబ్బు, బంగారం కాలిపోయాయి. ప్రస్తుతం మరో హోటల్‌లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నేపాల్‌లో భారత రాయబార కార్యాలయం అధికారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. విశాఖ కలెక్టరేట్ అధికారులు బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

**మరో హోటల్‌లో తలదాచుకున్నాం:** 'మేం తొలుత బస చేసిన హోటలు ఓ రాజకీయ నాయకుడిదని తెలిసింది. హోటల్‌కు నిప్పు పెట్టడంతో మా సామగ్రి కాలిపోయింది. ప్రస్తుతం కాఠ్‌మాండూలోనే మరో హోటల్‌లో తలదాచుకున్నాం. అక్కడి వారే భోజనాలు పెడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వస్తోంది. వాస్తవానికి 14న బయలదేరి విశాఖకు రావాల్సి ఉంది. అంతకు ముందే ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి తరలిస్తారని చెబుతున్నారు' అని ఎల్ఐసీ ఉద్యోగి ఎ.రాధాకృష్ణమూర్తి ఫోన్‌లో తెలిపారు.

దక్షిణాసియా దేశాల సదస్సుకు హాజరై

మహిళలు, యువత నాయకత్వం, నిర్ణయాత్మక స్థానాల్లో భాగస్వామ్యం, ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు కాఠ్‌మాండూలో బుధ, గురువారాల్లో దక్షిణాసియా దేశాల సెమినార్ ఏర్పాటుచేశారు. ఆరు దేశాల నుంచి 35 మహిళలను ఎంపిక చేయగా.. భారత్ నుంచి ఇద్దరున్నారు. వారిలో విశాఖకు చెందిన వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి గణపతి ఒకరు సోమవారం నేపాల్ వెళ్లిన ఆమె కాఠ్‌మాండూలోని ఓ హోటల్‌లో చిక్కుకున్నారు. ఈ విషయం తెలిసి ఆమెను సంప్రదించగా.. అక్కడి పరిస్థితిని వివరించారు. 'గురువారం ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుందని, శుక్రవారం ఉదయానికి విమానాశ్రయాలు తెరుస్తారని చెబుతున్నారు. మంటలు ఇంకా అదుపులోకి రాలేదు. మా హోటల్ గది నుంచి చూస్తుంటే మంటల్లో కాలిపోతున్న ప్రధాని నివాసం కనిపిస్తోంది. హోటల్ నుంచి బయటకు అడుగు పెట్టడానికి అవకాశం లేదు. ఒక పూట భోజనానికి ఒక్కరికి రూ.3 వేలకు పైగా ఖర్చవుతోంది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పీఏ ద్వారా వివరాలు తెలుసుకుంటున్నారు. ఇందుకు వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి బొల్లినేని, విశాఖకు చెందిన తెదేపా నాయకుడు చలపతిరావు సహకారం అందించారు' అని పేర్కొన్నారు.

# గత వైభవం.. మళ్లీ తెరిస్తే ఉపయోగం



చిలమత్తూరు : చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు బెంగళూరుకు 90 కిలోమీటర్లు, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన మన రాష్ట్రంలో ప్రారంభమయ్యే మొదటి ప్రధానమైన గ్రామం. రాష్ట్రంలో పలు ప్రాంతాలకు వెళ్లడానికి జంక్షన్ పాయింటు ఇదే. దీని మీదుగా రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వ్యాపార కేంద్రంగా మారింది.

**20 ఏళ్ల క్రితమే రిసార్ట్ ..**

సమీప ప్రాంతాల్లో సరైన విడది కేంద్రాలు లేకపోవడంతో పర్యాటకులు, ప్రయాణికుల కోసం 20 ఏళ్ల క్రితమే పర్యాటక శాఖ ఇక్కడ హరితా రిసార్ట్ పేరుతో 5 ఎకరాల స్థలంలో విడిది కేంద్రాన్ని నిర్మించింది. ఉండటానికి గదులు, మంచి ఆహారం, వాహనాలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలం, చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఉద్యానవనం, రెస్ట్‌రూంలు ఇలా అనేక సదుపాయాలు కల్పించారు. పర్యాటకులు, ప్రయాణికులు తమ అవసరాల రీత్యా ఇక్కడ ఆగేవారు. బెంగళూరు-హైదరాబాద్ మధ్య నడిచే ప్రయివేటు, ఆర్టీసీ బస్సులు ఇక్కడ భోజనం చేయడానికి ఆపేవారు. ఇలా రోజు వందలాది వాహనాలు ఇక్కడ నిలిచేవి. లేపాక్షికి వెళ్లే యాత్రికులు ఇక్కడే బస చేసి, ఇక్కడ నుంచి సిద్ధమై వెళ్లేవారు. వీటి కారణంగా హరితా రిసార్ట్‌కు పెద్ద ఎత్తున వ్యాపారం సాగేది. హోటల్ నడపడానికి, ఇతర పనుల నిమిత్తం పర్యాటక శాఖ 30 మంది సిబ్బందిని పొరుగు సేవల విధానంలో తీసుకొని నియమించింది. కొన్నేళ్ల పాటు వైభవంగా నడిచింది.

**శిథిలావస్థకు చేరి..**

ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మూతపడింది. గత వైకాపా ప్రభుత్వంలో పర్యాటక శాఖను పూర్తిగా పక్కన పెట్టడంతో ఈ రిసార్ట్ శిథిలావస్థకు చేరింది. కోట్ల రూపాయలు విలువ చేసే స్థలంలో ఉన్న పాత రిసార్ట్‌ను నూతనంగా పునరుద్ధరించే పనులతో పాటు నిర్వహణను పీపీపీ విధానంలోనైనా ప్రభుత్వం అప్పగిస్తే అటు పర్యాటకులకు, ఇటు ప్రయాణికులకు సదుపాయాలతోపాటు ఉపాధి దొరుకుతుందని స్థానికులు కోరుతున్నారు.

# ఊరించి.. ఉసూరుమనిపించి!



కళ్యాణదుర్గం : ఖరీఫ్‌లో టమాటా సాగు చేసిన రైతుల దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఆనందం వ్యక్తం చేశారు. తొలుత టమాట ధరలు ఎక్కువగా ఉన్నా.. క్రమంగా తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 38 వేల ఎకరాల్లో టమాటా సాగవగా.. కళ్యాణదుర్గం డివిజన్‌లో 9,500 ఎకరాలు, రాయదుర్గం డివిజన్ పరిధిలో సూక్ష్మనీటి సేద్యం ద్వారా 4,200 ఎకరాల్లో పంట వేశారు.

**వర్షాలు తెచ్చిన తంటా..**జులైలో టమాటా ధర 30 కిలోల బాక్సు రూ.950 నుంచి రూ.1000 వరకు ఉండగా.. ఆగస్టులో రూ.500 నుంచి రూ.700లకు, ఈనెల మొదటి వారంలో రూ.200కు పతనమైంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు పడిపోయినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో జిల్లా నుంచి తెలంగాణలోని మెదక్, ఖమ్మం, కరీంనగర్.. కర్ణాటకలోని కోలార్, చింతామణి, తమిళనాడులోని హొసూరు, చెన్నైతోపాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని రైతులు పేర్కొంటున్నారు. .రాయదుర్గం మండలం కదరంపల్లికి చెందిన సోమశేఖర్ 8 ఎకరాలు, బొమ్మక్కపల్లికి చెందిన అశోక్ నాలుగు ఎకరాలు, గ్రామదట్లకు చెందిన రఘు 2 ఎకరాలు, మల్లాపురానికి చెందిన తిప్పేస్వామి రెండెకరాల్లో టమాటా సాగు చేశారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని వారు వాపోయారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం-కృష్ణతేజ, ఉద్యాన శాఖ అధికారి**

పంట దిగుబడి బాగానే ఉన్నా.. కొన్ని రోజులుగా ధరలు తగ్గుతుండటంతో రైతులకు నష్టాలు వస్తున్నాయి. వర్షాల కారణంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారులతో మాట్లాడి ఎగుమతులు జరిగేలా ఏర్పాట్లు చేస్తాం.

# చెరువులను చెరబట్టారు!

శెట్టూరు: అక్రమార్కులు చెరువులను చెరబట్టారు. అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. శెట్టూరు మండలంలో యాటకల్లు, శెట్టూరు, కనుకూరు, ములకలేడు, తిప్పనపల్లి గ్రామాల్లో పలు చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయి. చిన్న చెరువులు, కుంటలు కనుమరుగవగా పెద్ద చెరువుల్లో యాభై నుంచి 100 ఎకరాల భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లింది. ములకలేడు చెరువు శిఖంలో ఏకంగా బోర్లు వేసుకుని సాగు చేస్తుండటం గమనార్హం. కొందరు మట్టి తవ్వకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.ములకలేడు చెరువును ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించి సేద్యం చేస్తున్నాడని శెట్టూరు తహసీల్దారుకు ఇటీవల లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందింది.తిప్పనపల్లి చెరువు హద్దులు చెరిపేసిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు.

**సర్వే చేసి.. తగిన చర్యలు తీసుకుంటాం- ఈశ్వరమ్మ, తహసీల్దారు**

చెరువులు, కుంటల ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు అందజేస్తాం. వారు ఎంతటివారైనా ఖాళీ చేయాల్సిందే. ఇటీవల ములకలేడు చెరువులో ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. విచారించి తగిన చర్యలు తీసుకుంటాం.

## అలగనూరుకు అడుగులు

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుంగిన అలగనూరు జలాశయం మరమ్మతులకు అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని మట్టి పరీక్షలు చేయిస్తోంది. నిపుణుల కమిటీ సూచనలు మేరకు పలు ప్రాంతాల్లో పరీక్షలు చేసి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. కట్ట కుంగడానికి నేల స్వభావం కారణమా ? పనుల్లో నాణ్యత లేకపోవడమా ? సరైన ప్రదేశంలోనే జలాశయం నిర్మించారా ? తదితర అంశాలను పరిశీలించారు.. జలాశయం కింది భాగంలో 5 మీటర్ల లోతులోనే రాయి ఉన్నట్లు గుర్తించారు. జలాశయం భద్రతకు ఇబ్బందేమి లేదని నివేదిక ఇచ్చారు.

**2018లో కుంగిన కట్ట**

కర్నూలు- కడప (కేసీ) కాల్వ ఆధునికీకరణలో భాగంగా అలగనూరు వద్ద జలాశయాన్ని 2004లో నిర్మించారు. అప్పట్లో రూ.70 కోట్లు వెచ్చించారు. తలముడిపి చెరువును అనుసంధానం చేస్తూ 3,636 ఎకరాల్లో దీని నిర్మాణం చేపట్టారు. ఇందులో 2.95 టీఎంసీల నీరు నిల్వ చేసి అవసరాన్ని బట్టి కేసీ కాల్వకు విడుదల చేస్తూ వచ్చారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో కలిపి దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. ఏటా రెండుసార్లు వరి సాగు చేస్తుంటారు. 2018లో కట్ట కుంగడంతో నీటిని నిల్వ చేయడం ఆపేశారు. అప్పటి నుంచి ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి.

**బిల్లులు ఇవ్వని వైకాపా**

మరమ్మతులకు 2021లో రూ.3.57 కోట్లతో టెండర్లు పిలిచింది. సదరు గుత్తేదారు సంస్థ 18.64 శాతం పనులు పూర్తి చేసింది. నిధులు



విడుదల చేయకపోవడంతో పనులు ఆపేశారు. ఒప్పందం కూడా 2023 డిసెంబరుతో ముగిసింది. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు.. కట్ట మరింత కుంగుతూ వచ్చింది.

అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం జలాశయంపై దృష్టి సారించింది. గతేడాది నిపుణుల బృందం జలాశయాన్ని పరిశీలించింది. చేపట్టాల్సిన పనులపై నివేదిక ఇచ్చారు. 2.5 కి.మీ. నుంచి 2.800 కి.మీ. వరకు బండ్‌ను తిరిగి నిర్మించాలని.. 2.825 కి.మీ. నుంచి 2.925 కి.మీ. వరకు మరమ్మతులు చేపట్టాలని.. 3.025 కి.మీ. నుంచి 3.125 కి.మీ. వరకు మరికొన్ని పనులు చేపట్టాలని సూచనలు నివేదికలో రూపొందించారు.

**రూ.36.26 కోట్లతో ప్రతిపాదనలు**

నిపుణుల బృందం పరిశీలన అనంతరం జలవనరుల శాఖ రూ.36.26 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. దెబ్బతిన్న కట్ట పునర్ నిర్మాణంతోపాటు బండ్ పొడవునా వివిధ చోట్ల చేయాల్సిన మరమ్మతులు, భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన పనులపై సమగ్ర నివేదికను రూపొందించింది. దాన్ని పరిశీలించిన ప్రభుత్వం కట్ట మరమ్మతులకు ఆమోద ముద్ర వేసింది. మట్టి పరీక్షలు పూర్తి కావొచ్చాయి.. జనవరిలోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అలగనూరులో నీటిని నింపితే తలముడిపి చెరువు పరిధిలో ఉన్న 2,200 ఎకరాలు, 20 కి.మీ. మేర బోరుబావుల కింద మరో ఐదువేల ఎకరాలు పచ్చని పంటలతో కళకళలాడుతుంటుంది. అలగనూరు, రోళ్లపాడు, తలముడిపి, కొర్రపోలూరు తదితర గ్రామాలకు చెందిన సుమారు 600 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. ఏటా రూ.5 కోట్ల మేర చేపల వ్యాపారం జరుగుతుండేది.

## రూ.కోట్లు మింగిన చెరువులు

వడ్డిగూడెం :ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డిగూడెం గ్రామంలోని తాగునీటి చెరువు. 2022లో ఈ చెరువును ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 1,200 పని దినాలతో రూ.2,40,896 వేతనం చెల్లించి అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ ఫలసాయాన్నిచ్చే కొబ్బరి మొక్కలు వేశారు. ప్రస్తుతం చెరువు వినియోగంలో లేదు. గట్లపై పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో లక్ష్యం నీరుగారిపోయింది.తాగునీటి చెరువులను సంరక్షించి గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ పథకాన్ని 2022లో తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా అధ్వానంగా ఉన్న చెరువుల్లో పూడిక తీత పనులు చేసి గట్లను పటిష్ఠం చేయడంతోపాటు ఫలసాయాన్నిచ్చే మొక్కలు పెంచాలని ఆలోచన చేసింది. చెరువు



గట్లను వాకింగ్ ట్రాక్‌లుగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంలో ఆరోగ్యం అందించాలని నిర్ణయించింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ పథకం పేరుతో జిల్లా వ్యాప్తంగా మండలానికి 2 చొప్పున మొత్తం 80 తాగునీటి చెరువులను సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు. పనులు పూర్తి చేసిన తరువాత స్థానిక పంచాయతీలు వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో చెరువులు అధ్వానంగా మారాయి. చెరువుల చుట్టూ వేసిన మొక్కలు చాలా చోట్ల కానరావడం లేదు. పలు గ్రామాల్లో చెరువుల అభివృద్ధి పనులు అసంపూర్తిగా వదిలివేశారు. అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన చెరువుల పర్యవేక్షణ స్థానిక పంచాయతీలదేనని డ్వామా పీడీ కేసీహెచ్. అప్పారావు అన్నారు. అధ్వానంగా ఉన్న చెరువులను భవిష్యత్తులో ఉపాధి నిధులతో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు.

అభివృద్ధి చేసిన చెరువులు: 80

వెచ్చించిన నిధులు రూ. 3 కోట్లు

## కొన ఊపిరితో ఆయుష్

కొయ్యలగూడెం : టి.నరసాపురం హెూమియో ఆసుపత్రికి సొంత భవనం లేదు. వెలుగు సామాజిక భవనంలో కేటాయించిన గదిలో వైద్యురాలు రోగులకు సేవలందిస్తున్నారు.

సంప్రదాయ వైద్యం ఆయుష్‌ను వైకాపా ప్రభుత్వ హయాంలో పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో ఆయుర్వేద, యునాని, హెూమియోపతి వ్యవస్థలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడాయి. చాలాచోట్ల సొంత భవనాలు లేవు. ఇటీవల కూటమి ప్రభుత్వం చొరవతో వైద్యుల నియామకం జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో భర్తీ కాక కొరత వేధిస్తోంది. సరైన వసతులు లేక ఆయుష్ ఆసుపత్రులు నిరాదరణకు గురవుతున్నాయి.

**జోన్-2లో..** ఉమ్మడి జిల్లాలైన కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మొత్తం 144 ఆయుష్ ఆసుపత్రులున్నాయి. వీటిలో సొంత భవనాలు ఉన్నవి పశ్చిమ గోదావరిలో 21 ఉన్నాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ప్రాంగణాల్లో 36 పని చేస్తుండగా.. మిగిలిన 30 చోట్ల అద్దె చెల్లించనక్కర్లేని భవనాల్లో ఉన్నాయి. నాలుగు చోట్ల అద్దె భవనాల్లో సాగుతున్నాయి. కొన్నిచోట్ల శిథిలమయ్యాయి. సొంత భవనాలు



లేనిచోట్ల దాదాపు ఓపీ సేవలకే కాని రోగులు ఇన్ పేషెంట్లుగా ఉండి చికిత్స పొందే అవకాశం లేదు.

**ఇంకా 32 చోట్ల ఖాళీలు..** ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఆయుష్ వైద్యుల నియామకాల్లో భాగంగా జోన్-2లో ఆయుర్వేదం 22, హెూమియోపతి వైద్యులు 16 మందిని నియమించింది. ప్రస్తుతం ఆయుర్వేదం 88 మందికి 69 మంది, హెూమియోపతిలో 48 మందికి 36 మంది, యునానిలో 8 మందికి ఏడుగురు వైద్యులు పని చేస్తున్నారు. ఇంకా 32 చోట్ల వైద్యుల భర్తీ జరగాల్సి ఉంది. పాడైన భవనాలకు ఏఏఎమ్ నిధులతో కొంతమేర మరమ్మతులు చేసినప్పటికీ ఇంకా మిగిలే ఉన్నాయి. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులు పూర్తి చేయిస్తామని ఏలూరుకు చెందిన ఆయుష్ జోన్-2 ప్రాంతీయ ఉపసంచాలకుడు(ఆర్‌డీడీ) కార్యాలయం అధికారులు చెబుతున్నారు.

## సమీక్షిస్తారా.. సరిపెట్టేస్తారా?

ఏలూరు : జిల్లాలో ఎరువుల కొరత రైతులను వేధిస్తోంది. కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నా వ్యవసాయశాఖ స్పందన నామమాత్రం. పారిశుద్ధ్యం లోపించి దోమలు విజృంభిస్తున్నా, గత పాలకులు పంచాయతీ నిధుల్ని కొల్లగొట్టినా యంత్రాంగానికి పట్టడం లేదు. అధికారుల క్షేత్రపర్యటనలు అరుదుగా ఉండటంతో బ్లీచింగ్, ఫాగింగ్ మొక్కుబడి తంతుగా మారాయి. విద్యుత్తు సంబంధిత సమస్యలతో ప్రధానంగా ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్లయినా ఏలూరు వైద్య కళాశాల భవనాలు పూర్తికాలేదు. ఇవన్నీ డీఆర్సీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**ఇదిగో యంత్రాంగ నిర్లక్ష్యం**

వైకాపా హయాంలో కొందరు సొసైటీ ఛైర్మన్లు, కార్యదర్శులు కుమ్మక్కై ఇష్టానుసారం రుణాలిచ్చి అక్రమాలకు పాల్పడ్డారు. టి.నరసాపురంలో రూ.16 కోట్లు, పోతునూరు, కామవరపుకోటలో రెండేసి కోట్లు,



బాదంపూడి, జంగారెడ్డిగూడెం, సరిపల్లి సొసైటీల్లో రూ.1.50 కోట్ల దాకా పక్కదారి పట్టాయని తేల్చారు. ఏ ఒక్కచోటా ఆస్తులు వేలం వేసి రికవరీలు చేయటానికి దస్త్రాలే సిద్ధం చేయలేదు.

ఏలూరు బోధనాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్య సేవలు కంటితుడుపుగా ఉంటున్నాయి. ట్రామాకేర్ సేవలకు నోచుకోవటం లేదు. కొన్ని విభాగాల్లో వైద్యుల కొరత ఉందని మధ్యాహ్నం తర్వాత సేవలు అందించటం లేదు. హౌస్ సర్జన్లపైనే ఆసుపత్రి నడుస్తోంది.

2021లో వాడిన విద్యుత్తు వినియోగానికి ఇటీవల అధికారులు డిమాండ్ నోటీసులు నోటీసులు పంపారు. నాలుగేళ్ల తర్వాత వసూళ్ల ఏమిటని ఆక్వా రైతులు ప్రశ్నిస్తున్నారు. కైకలూరులో 133 కేవీ స్టేషన్ కార్యరూపం దాల్చలేదు.

నూజివీడు పెద్ద చెరువు గతేడాది అధికవర్షాలకు తెగిపోయింది. దానికి ఇప్పటికీ శాశ్వత మరమ్మతులు చేయలేదు.

చింతలపూడి, పోలవరం, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో పలు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రహదారులు గుంతలుపడి రాకపోకలకు అసౌకర్యంగా ఉన్నాయి.

## పులికి ఆకలేస్తోంది!

పెద్దదోర్నాల : నల్లమల అటవీ ప్రాంతంలో పులులు, చిరుతల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మరోవైపు వాటి ఆహారమైన దుప్పులు, సాంబార్‌లు, ఇతర జంతువుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. దీంతో ఆహార వేటలో భాగంగా అవి అడవి దాటి బయటకు వస్తున్నాయి. ఆ క్రమంలోనే కొద్ది రోజు క్రితం దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం, అర్ధవీడు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆవులు, గేదెలను సంహరించాయి. తాజాగా చిన్నారుట్ల చెంచు గిరిజన గూడెంలో ఓ చిరుత సంచరిస్తుండడం అక్కడి వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో వన్య మృగాల ఆహార కొరత తీర్చేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇతర ప్రాంతాల నుంచి జింకలు, దుప్పులను ఇక్కడకు తరలిస్తోంది.

**వన్యప్రాణుల తరలింపు...**కొందరు పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు ప్రైవేటుగా జూలు ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో వన్యప్రాణులను సాకుతున్నారు. ప్రభుత్వం వీటిని నిషేధించడంతో అధికారులు అక్కడ ఉన్న జంతువులను స్వాధీనం చేసుకుని సమీప అటవీ ప్రాంతాల్లో విడిచిపెడుతున్నారు. ఈ క్రమంలోనే కాకినాడలోని ఓ ప్రైవేటు జూలో వందకు పైగా దుప్పులు, సాంబార్‌లతో పాటు... శ్రీ సత్యసాయి జిల్లాలోని కొండ ప్రాంతంలో మరో నలభైకి పైగా వన్యప్రాణులను స్వాధీనం చేసుకుని నల్లమలకు తరలించారు. వీటిని నేరుగా అడవిలో వదిలేస్తే... కొత్త ప్రాంతం కావడంతో మనలేక ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. ఆ సమస్య తలెత్తకుండా ఇక్కడి వాతావరణం అలవాటు చేసేందుకు ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. **వాతావరణానికి అలవాటు పడేలా...**మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో దోర్నాల రేంజ్‌లోని తెట్టెగుండం, కొర్రప్రోలు రేంజ్‌లోని పెద్దపెంట, నెక్కంటి రేంజ్‌లోని ఆరెపెంట, గంగారపెంట ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు. హెక్టారు విస్తీర్ణంలో ఉండే ఎన్‌క్లోజర్ చుట్టూ తొమ్మిది అడుగుల కంచె వేశారు. బయట నుంచి తెచ్చే వన్యప్రాణులను 21 రోజుల పాటు వీటిలో ఉంచి సంరక్షిస్తారు. వాటికి అవసరమైన గడ్డి, నీరు అందులో అందుబాటులో ఉంచుతారు. ఈ వాతావరణానికి అలవాటు పడ్డాక అడవిలో విడిచిపెడతారు.

# అడ్డగోలు క్రాసింగ్‌లు.. అంతులేని విషాదాలు



పుత్తూరు : శ్రీవారి దర్శనార్థం రోడ్డుమార్గంలో ప్రముఖులు, భక్తులు నిత్యం విచ్చేస్తుంటారు.. స్వామివారిని త్వరగా దర్శించుకోవాలనే ఆత్రుత.. తిరుగు ప్రయాణంలో త్వరగా గమ్యస్థానం చేరుకోవాలనే ఉద్దేశంతో వాహనదారులు వేగం పెంచుతుండగా హఠాత్తుగా అనుకోని ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా మల్లవరం సమీప కాలూరు క్రాస్ నుంచి నగరిలోని తడుకుపేట వరకు అనధికారిక క్రాసింగ్‌లు పెద్దఎత్తున వెలిశాయి.. ఇటీవలి సర్వే ప్రకారం మూడేళ్లలో 172 మంది మరణించగా 254 మంది గాయపడ్డారు.. తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో జరుగుతున్న మృత్యుఘోషపై ప్రత్యేక కథనం.

**తిరుపతి గ్రామీణ పరిధిలో..**

తనపల్లి క్రాస్ వద్ద హెచ్చరిక బోర్డులు లేక 15 ప్రమాదాలు జరిగి 11 మంది మరణించారు. రామచంద్రాపురం కూడలివద్ద నిత్యం ప్రమాదాలే. ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాల బస్సును లారీ ఢీకొని పదిమంది విద్యార్థులు గాయపడ్డారు. ఇప్పటివరకు ఇక్కడ 13 మంది మృతిచెందగా, తొమ్మిది మంది గాయపడ్డారు.

**పుత్తూరు**

పట్టణ పరిధిలోని కొండలచెరువు వద్ద డివైడర్‌ను కొట్టేసి అనధికారికంగా దారి ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటివరకు 15 ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతిచెందారు. సమీప గోవిందపాళెం, మరాఠీగేటు ప్రాంతంలో ఐదుగురు ప్రాణాలు వదిలారు. పుత్తూరు పున్నమి కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతిచెందారు.

**వడమాలపేట..**

అంజేరమ్మ కనుమ, తడుకు రైల్వేస్టేషన్, శిరుగురాజుపాళెం, మజ్జిగగుంట ప్రాంతాల్లో అనధికారికంగా రోడ్డు డివైడర్‌ను కొట్టేసి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఇప్పటివరకు 17 మంది మృత్యువాత పడ్డారు. వడమాలపేట మండలంలో కొటాల వద్ద నలుగురు, కదిరిమంగళం, వడమాలపేట బైపాస్ వద్ద నలుగురు, వెంగళరాజుకండ్రిగ వద్ద ఇద్దరు మృతిచెందారు.

**రేణిగుంట పరిధిలో..**గాజులమండ్యం పారిశ్రామికవాడ వద్ద అనధికారికంగా డివైడర్ పగులగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఏడాదిలో ఐదుగురు మృతిచెందారు. కేఎల్ఎం ఆస్పత్రి వద్ద తిరుపతి-చిత్తూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు, కడపకు వెళ్లే కూడలిలో కనీసం సిగ్నళ్లు లేవు. ఉదయం, సాయంత్రం కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పది ప్రమాదాలు జరిగి నలుగురు చనిపోయారు. **ప్రభుత్వానికి నివేదించాం**

తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో ముఖ్యకూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుతోపాటు అనధికారిక దారులు మూసివేయడంతో ప్రమాదాలు పూర్తిగా నివారించవచ్చు. నిత్యం తనిఖీలు చేయడం, అతివేగంగా వెళ్లేవారికి జరిమానా విధించడంతో చాలావరకు ప్రమాదాలు తగ్గించవచ్చు. ప్రమాదాలు, ఉల్లంఘనలు, తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే సర్వేచేసి ప్రభుత్వానికి నివేదించాం.

చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

# రూ.22.88 కోట్లు పత్తాలేవు



చిత్తూరు : జిల్లా పరిషత్‌లో ప్రజాధనాన్ని హారతి కర్పూరంగా మార్చేశారు.. గత వైకాపా పాలనలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రికి వీరవిధేయుడిగా వ్యవహరిస్తూ వైకాపా నాయకుల కనుసన్నల్లో కొనసాగిన విశ్రాంత సీఈవో ప్రభాకరరెడ్డి.. పలు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.. ఈ ఆరోపణలకు ఆడిట్‌లో వెలుగుచూసిన అంశాలే నిలువెత్తు నిదర్శనం. 2023-24లోనే ఎన్నడూ లేనంతగా 90 అభ్యంతరాలకు సంబంధించి రూ.22.88 కోట్లకు లెక్కల్లేవంటూ ఆడిట్‌శాఖ ధ్రువీకరించింది..

**ఆర్థిక సంఘం.. రూ.13.50 కోట్లు**

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.13.50 కోట్లకు లెక్కల్లేవు. ఈ నిధులను ఎక్కడ, ఏపనికి ఖర్చు చేశారో తెలియదు. నిధులేమో విడుదల చేశారు. పనుల అంచనాలు, టెండర్ల ఊసేలేదు. నిధులు నిర్వహణకే ఖర్చుచేశారా లేదా పనులు జరగకుండానే స్వాహా చేశారా అనేది విశ్రాంత సీఈవోకే తెలియాలి. ట్రెజరీ నుంచి తప్పుడు వోచర్లు సమర్పించి డ్రా చేసినట్లు వెలుగు చూసింది.

**అస్తవ్యస్తంగా పీఎఫ్ విభాగం..**

జడ్పీ పీఎఫ్ విభాగంలో సమగ్రంగా రికార్డులే లేవు. వడ్డీ చెల్లింపులు, రీయింబర్స్‌మెంట్ ఊసే లేదు. క్యాష్‌బుక్ నిర్వహణ గాలికొదిలేశారు. పీఎఫ్ వ్యక్తిగత లగ్జరీ రికార్డులు లేవు. జడ్పీ ఆస్తులు, అతిథి గృహాల వివరాలు లేవు. జడ్పీ ఆదాయ లెక్కలు గాలికొదిలేశారు.

**జీఎస్టీ జమెక్కడ?**

జీఎస్టీ, వ్యాట్, ఐటీ, క్యూసీ తదితర పన్నుల రూపంలో సమకూరిన రూ.25-30 లక్షలు ప్రభుత్వానికి జమ చేయలేదు. దస్త్రాలు లేవు. సర్వీసు పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్ నగదు రూ.2.05 కోట్లు సాధారణ నిధులకు మళ్లించారు. రికార్డులు సక్రమంగా లేవు.

**ఇష్టానుసారంగా ఖర్చు..**

మండల పరిషత్‌లకు నిధుల కేటాయింపుల్లోనూ నిబంధనలు పాటించలేదు. సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఎం.బుక్‌లు, అగ్రిమెంట్లు, టెండర్లు, అంచనాల వివరాలు లేవు. తలసరి గ్రాంట్, సీనరేజీ సెస్సు తదితర పద్దులకు సంబంధించి నిబంధనలు పాటించ లేదనే ఆరోపణలు ఉన్నాయి. జడ్పీ సాధారణ నిధులు ఇష్టానుసారంగా ఖర్చుచేశారు. ఏడాదిలో సభలు, సమావేశాల పేరుతో భోజనం, టిఫిన్ ఖర్చులకు రూ.31.28 లక్షలు వెచ్చించారు.

**అధికారులకు నోటీసులిచ్చాం..**

2023-24 ఆడిట్ అభ్యంతరాలు పరిష్కరించుకోవాలని అప్పటి జడ్పీ సీఈవో, అధికారులకు నోటీసులు ఇచ్చాం. పరిష్కరించుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవు.

గోవిందప్ప, ఆర్‌డీడీ, ఆడిట్ శాఖ


# సరిపోని.. ఊతం

పుంగనూరు : దక్షిణాది రాష్ట్రాల్లో పుంగనూరు, పలమనేరు టమాటా మార్కెట్లకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రైతులు పండించే ప్రముఖ వాణిజ్య పంటల్లో టమాటా ఒకటి. సాధారణంగా మార్చి నెలాఖరు నుంచి జూన్, జులై వరకు పంట సీజన్‌గా పరిగణిస్తారు. ఈ ఏడాది ఆలస్యంగా మొక్కలు నాటడంతో సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. పుంగనూరు, పలమనేరు, కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాల్లో దాదాపు 16 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం సీజన్ ముగియడంతో చాలామంది రైతులు టమాటా పంటతో పెట్టిన పెట్టుబడి రాకపోగా.. కర్రలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దిగుబడులు తగ్గేకొద్దీ ధరలు**

మే, జూన్, జులై నెలల్లో వచ్చిన దిగుబడులు, పలికిన ధరలు చూస్తే దిగుబడులు తగ్గే కొద్దీ ధరలు పలికాయనేది స్పష్టమవుతోంది. పుంగనూరు, పలమనేరు, వి.కోట మార్కెట్లలో మేలో సరాసరి రోజుకు రెండువేల దిగుబడి వచ్చేది. కిలో రూ.5-6 మధ్య పలికింది. జూన్‌లో 1500 టన్నులు రాగా కిలో రూ.17-20, జులైలో 1100 టన్నులు రాగా రూ.30-32 పలికింది.

**250 టన్నులు గగనం..**జూన్ నెలాఖరు నుంచి కొద్దికొద్దిగా ధరలు పెరుగుతూ వచ్చాయి. ధరలు లేకపోవడంతో కొత్తగా మొక్కలు



నాటలేదు. పైగా ఉన్న తోటల సస్యరక్షణ, సస్యరక్షణ పనులు చేయకపోవడంతో దిగుబడులు తగ్గాయి. మేలో రోజుకు రెండువేల టన్నులు రాగా.. ప్రస్తుతం 250 టన్నులు రావడం కష్టంగా మారింది. దీనికితోడు దిగుబడుల నాణ్యత లేకపోవడంతో కాయలు రోడ్డు పక్కన పడేస్తున్నారు. పుంగనూరు, పలమనేరు, వి.కోట మార్కెట్లలో ఆదివారం కిలో రూ.40 నుంచి రూ.42 వరకు పలికింది. 20 రోజులుగా కిలో రూ.40 తగ్గకుండా ధరలు పలుకుతున్నాయి.

## భూములు సిద్ధం.. అనుమతులే తరువాయి

నగరి : చిత్తూరు జిల్లా సరిహద్దులో పారిశ్రామిక హబ్ నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే ఆశయానికి అనుగుణంగా అవసరమైన భూములు సిద్ధంగా ఉన్నాయి. ప్రధానంగా నగరి నియోజకవర్గంలో వీకేఆర్‌పురం, మాంగాడు, కోసలనగరం ప్రాంతాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి పరిశ్రమలకు అనుకూలంగా ఉన్నందున, వాణిజ్య కేంద్రమైన చెన్నైకు 80 కి.మీ. దూరంలో ఉన్నందున పారిశ్రామిక హబ్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం ఆలోచించింది. తదనుగుణంగా భూముల సేకరణ ప్రక్రియ పూర్తి చేసి ఏపీఐఐసీకి అందించింది. ఈ ఆలోచన మొదలైన నాటి నుంచి అనుమతుల కోసం ఎదురుచూపులు తప్పటం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి, బయట నుంచి వచ్చే వారికి నమ్మకం కలిగేలా మొదట మన ప్రాంతంలోని వారికి అవకాశం ఇచ్చి చూపితే ఈ ప్రక్రియ వేగవంతమవుతుంది.

**ప్రతిపాదన దశ దాటని టెక్స్‌టైల్ పార్కు..**

టెక్స్‌టైల్ పార్కు మాట ఇప్పటిది కాదు. 1998 నుంచి నగరిలో వినిపిస్తున్న రాజకీయ హామీ. నియోజకవర్గంలో మరమగ్గ పరిశ్రమ ద్వారా వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ఏడాదికి రూ.3 నుంచి రూ.5 కోట్ల వరకు వస్త్రఉత్పత్తి సాగిస్తున్న పరిశ్రమ నేటికీ కుటీర పరిశ్రమగానే కొనసాగుతోంది. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా ఇక్కడ టెక్స్‌టైల్ హబ్ ఏర్పాటు ప్రతిపాదన



దశ నుంచి అడుగు ముందుకు పడలేదు. నగరి, పుత్తూరులో 26 వేల నేతకార్మిక కుటుంబాలు, 45 మరమగ్గాలు ఉన్నాయి. వారికి సాంకేతిక సహకార కేంద్రంతోపాటు హబ్ ఏర్పాటుచేస్తే ఉపాధి రెట్టింపయ్యే అవకాశం ఉంది. ఇతర పరిశ్రమలు తరలివచ్చే అవకాశం ఉంది.

**చిత్తూరు-తచ్చూరు హైవే పక్కనే..**

ప్రస్తుతం చిత్తూరు తచ్చూరు హైవే నగరి మండలంలో రావటంతో ఇటు చెన్నై, అటు బెంగళూరుకు రవాణా సులవవుతంది. దీనికి అతిచేరువలో పక్కనే వీకేఆర్‌పురం వద్ద 152,13 ఎకరాల భూమి సిద్ధంగా ఉంది. ఇందుకు అవసరమైన రోడ్డు కోసం మరో 8.12 ఎకరాలు ఇటీవలే రెవెన్యూ అధికారులు సేకరించి సిద్ధం చేశారు. మాంగాడులో మరో 89.12 ఎకరాలు సిద్ధంగా ఉంది. ఇందుకు జాతీయ రహదారి నుంచి రోడ్డు కోసం మరో 11 ఎకరాల ప్రభుత్వ భూమి సేకరించారు. ఇలా అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఇక ఆలోచన అమలు చేయడంలో వేగం అవసరం.

## కట్టకుంటే కట్టేయండి

కైకలూరు పేదలకు సొంతింటి కల సాకారం చేస్తామని వైకాపా ప్రభుత్వం బాకాలూదింది. స్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేస్తామనడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రక్రియ ప్రారంభంకాగానే లబ్ధిదారులే ఇంటి నిర్మాణాలు చేసుకోవాలనడంతో చాలామంది ఆసక్తి చూపలేదు. కాగ్ అభ్యంతరం.. రెండున్నరేళ్లవుతున్నా రాష్ట్ర వ్యాప్తంగా ఈ గృహ నిర్మాణాల్లో ఎటువంటి పురోగతి లేదు.ముందస్తు చెల్లింపులపై కాగ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో కూటమి ప్రభుత్వం పునాది దశ పనులు మొదలు పెట్టని వారి నుంచి నగదు తిరిగి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా ముందస్తు నగదు తీసుకున్న లబ్ధిదారులు 3,320 మంది ఉండగా రూ.6.37 కోట్లు నగదు రికవరీ చేయాల్సి ఉంది.

**ముందస్తు చెల్లింపులు..** వైకాపా హయాంలో ఇంటి స్థలం ఇచ్చినా వందలాది మంది నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులతో వెనకడుగు వేయడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. కేంద్రం నుంచి అదనపు నిధులు రావాలంటే గృహ నిర్మాణ సంస్థలో ఉన్న నిధులు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇందుకోసం 2022-23లో పునాది దశ దాటని గృహాలకు సర్దుబాటు నిధులుగా లబ్ధిదారుకు రూ.20 వేలు ముందస్తు చెల్లించారు.

**సదుపాయాలు లేకనే..** వైకాపా అనాలోచిత నిర్ణయాలతో నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో జగనన్న కాలనీల పేరిట స్థలాలు ఇచ్చారు. మోస్తరు వర్షం పడితే చెరువులను తలపిస్తున్నాయి.భవన నిర్మాణ సామగ్రి చేరవేసుకునే వెసులుబాటు లేదు. అవస్థలు పడలేక నగదు ఇచ్చినా ఇంటి నిర్మాణాలు చేయలేక పోయారు. 'పనులు ప్రారంభించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగదు వెనక్కి ఇవ్వాలని నోటీసులు అందిస్తున్నాం. ఇప్పటి వరకు రికవరీ ఏమీ లేదు.' అని గృహనిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ తెలిపారు.

## మళ్లీ మీ సేవలో..

భీమవరం : కూటమి ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 10 మార్కెట్ యార్డులకు ఛైర్మన్ల నియామకాలను దాదాపు పూర్తి చేసింది. ఇక మార్కెటింగ్ శాఖను గాడిన పెట్టి రైతు ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయనుంది. మార్కెట్ యార్డుల్లో చప్టాలు, గోదాములను రైతులు ఉచితంగా వినియోగించుకోవచ్చు. గిట్టుబాటు ధర లేనప్పుడు, వర్షాల సమయంలో ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను ఇక్కడ నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంది. గోదాముల్లో నిల్వ చేసుకునే పంట ఉత్పత్తులకు మార్కెట్ ధర ఆధారంగా మార్కెటింగ్ శాఖ




తక్కువ వడ్డీకి రుణాలు కూడా మంజూరు చేసేది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ యార్డు గోదాముల్లో నిల్వ చేసే పంట ఉత్పత్తులపై రుణం అందించనుంది. ఈ ఖరీఫ్ పంట కాలంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.8.20 కోట్లు రుణం మంజూరు చేయడానికి అవకాశం కల్పించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సునీల్‌కుమార్ తెలిపారు. ఖరీఫ్ కోతలు పూర్తయిన తరువాత రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్ యార్డు గోదాముల్లో నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర వచ్చిన తరువాత విక్రయించుకోవచ్చునన్నారు. ఒక్కో రైతుకు పంట మార్కెట్ విలువ ఆధారంగా రూ.2 లక్షల వరకూ రుణం మంజూరు చేస్తామన్నారు.

## వెయ్యి దీపాలు వెలుగుతూనే ఉన్నాయ్

హిందూపురం : హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, సడ్లపల్లిలోని ఎన్టీఆర్ కాలనీ, కొల్లకుంట, విద్యానగర్ ఇలా అనేక ప్రాంతాల్లో పగలు సైతం వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. పట్టణంలో వీధి దీపాలు లేని ప్రాంతాలను గుర్తించి, మూడవ విద్యుత్తు లైన్ లేకపోయినా దాదాపు వెయ్యి చోట్ల ఏర్పాటు చేశారు. వీటికి ఆన్ ఆఫ్ చేసే వ్యవస్థ ఉండదు. దీంతో పగటి పూటా వెలుగుతూనే ఉన్నాయి. మూడో లైన్ ఏర్పాటు చేయాలని అధికారులు మొదట్లో ఆలోచన చేసినా, ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో నెలకు రూ.లక్షల్లో విద్యుత్తు బిల్లు వస్తోంది.



**రూ.2 లక్షలతో తీగ బిగిస్తే చాలు..**

అన్ని వీధి దీపాలకు ఆన్ ఆఫ్ వ్యవస్థ ఉండాలంటే పట్టణంలో మూడో విద్యుత్తు లైన్ కోసం రెండు కిలోమీటర్ల పొడవైన తీగను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి రూ.2 లక్షలు మాత్రమే ఖర్చవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ సొమ్ము ఖర్చు పెడితే అంతకు మించిన ప్రయోజనం మున్సిపాలిటీకి చేకూరుతుంది. నిరంతరం బల్బులు వెలుగుతుండటంతో బిల్లు తడిసి మోపెడు అవుతుందని తెలిసినా, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. ఇప్పటికైనా అధికారులు మున్సిపాలిటీ తరపున సొంతంగా మూడవ తీగను ఏర్పాటు చేసుకోవడం లేదా.. విద్యుత్తు శాఖతో సమన్వయంతో అయినా బిగించాల్సి ఉంది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి, మూడో తీగ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## సంక్షోభంలో ఆక్వా సాగు

కోట : ప్రస్తుతం ఆక్వా సాగంటే రైతులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం.. ధరలపతనం.. వెరసి రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎగుమతులపై 50 శాతం సుంకం విధించడం, రవాణా, ఇతర ఖర్చులతో రూ.లక్షలు పెట్టి సాగుచేసిన రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. టన్నుకు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు సాగు రైతులు నష్టపోతున్నట్లు అంచనా.

తిరుపతి జిల్లాలో సుమారు రెండువేల మంది రైతులు సుమారు పదివేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. రైతులు ఎక్కువగా వెనామి, టైగర్ సాగు చేస్తున్నారు. ఎకరాకు 2 నుంచి 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ క్రమంలోనే అమెరికాకు 30వేల టన్నుల వరకు ఏటా ఎగుమతి చేస్తున్నారు. వెనామి గతంలో 100 కౌంట్ కిలో రూ.240 ఉండేది. ట్రంప్ పెంచిన సుంకం దెబ్బతో రూ.210లకు పడిపోయింది. దీంతో మూడు టన్నులపై రూ.1.20 లక్షల వరకు రైతులు నష్టపోతున్నారు. మొత్తం మీద రూ.12 కోట్లకు పైగానే జిల్లా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. టైగర్ సాగులోనూ రైతులు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆక్వారంగానికి జీవంపోయాల్సిన అవసరం ఉంది. రాయితీలు ఇతర



ప్యాకేజీలు ప్రకటిస్తేనే ఊరట లభిస్తుందని చెబుతున్నారు.

జిల్లాలో సాగు ఎకరాల్లో..

చిల్లకూరు 2,500 కోట 2,000 వాకాడు 2,500

చిట్టమూరు 2,000

**ప్రభుత్వం ఆదుకోవాలి**

కొక్కుపాడులో పదెకరాలలోపు రొయ్యలు సాగు చేస్తున్నాం. ఎకరా సాగుకు రూ.5 లక్షలకు పైగానే పెట్టుబడి వస్తోంది. 100 కౌంట్‌తో అమ్మితే గతంలోకంటే కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు తక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇలాగైతే సాగు కష్టతరంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి రంగాన్ని కాపాడాలి.

జీతేంద్రరెడ్డి, రైతు, కొక్కుపాడు

**తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు**

అమెరికా, ఇతర దేశాలకు చేసే ఆక్వా ఎగుమతుల కారణంగానే విదేశీ మారక ద్రవ్యం అధికంగా వస్తోంది. అలాంటిది ట్రంప్ సుంకం పెంచడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎగుమతులపై విధించిన సుంకాన్ని తగ్గించేలా అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరపాల్సిన అవసరముంది.

వసంతకుమార్‌రెడ్డి, రైతు, కర్లపూడి

**త్వరలోనే స్పష్టత** ట్రంప్ వేసిన సుంకాలతో వాస్తవంగా ఆక్వా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఇబ్బందులు పడకుండా నష్టాలు నుంచి బయటపడేందుకు కమిటీని వేసింది. తద్వారా అధ్యయనం చేసి రైతులకు మేలు జరిగేటట్లు చూస్తుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.రాజేష్, జిల్లా మత్స్యశాఖాధికారి

## యూరియాకు రెక్కలు.. తేలని లెక్కలు



అనంతపురం : జిల్లా అంతటా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 3 డీసీఎంఎస్‌కు, నందేశ్వర ఫార్మర్ ప్రొడ్యూజర్ కంపెనీకి కలిపి 2,784 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశారు. ఏ సొసైటీలో ఎంత మంది రైతులకు ఎంత యూరియా పంపిణీ చేశారో డీబీటీ నివేదికలు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఆదేశించినట్లు తెలిసింది. అయితే యూరియా పక్కదారి పట్టించినట్లు సమాచారం. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్ విక్రయించే యూరియా లెక్క తేలడం లేదు.

రాయదుర్గంలో తిరుమల ఆగ్రో సెంటర్ నిర్వాహకుడు సుమారు 22.32 మెట్రిక్ టన్నుల (221 బస్తాలు) యూరియాను ఇటీవల బళ్లారికి తరలించే ప్రయత్నం చేశాడు. గోదాములో నిల్వలకు, రికార్డు నిల్వలకు చాలా వ్యత్యాసాన్ని అధికారులు గుర్తించారు. అందులో 14.32 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. జేసీ కోర్టుకు పంపగా విచారణలో ఉంది.

జిల్లాలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా యూరియాకు డిమాండ్ పెరిగింది. అయితే ఎక్కడా నిల్వలు లేవు. జిల్లాలో యూరియా పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. హెూల్‌సేల్, ప్రైవేటు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి, దోపిడీకి పాల్పడుతున్నారు. జిల్లాకు కేటాయించిన యూరియా ఏపీ మార్క్‌ఫెడ్‌కు ఎక్కువ కేటాయింపులు జరగాలి. ఆ తర్వాత డీలర్లకు కేటాయించాలి. అయితే అధికారులు లోపాయికారి ఒప్పందంతో డీలర్లకే ఎక్కువగా కేటాయింపులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. యూరియా అందక రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

**ఈ-పాస్ పక్కనపెట్టి విక్రయాలు**

రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లకు యూరియాను ప్రతినెలా సరఫరా చేస్తూ వచ్చారు. ఈ-పాస్ ఆధార నంబరును నమోదు చేసి రైతుకు యూరియా సరఫరా చేయాలి. అయితే వారెవరూ ఈ-పాస్ యంత్రాలు వాడలేదు. బస్తా ధర రూ.266.50 ఉండగా రూ.350-400 వరకు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇతర జిల్లాల్లోని ఆధార్ నంబర్లతో యూరియాను తరలించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు వారీగా పంపిణీ లెక్కలు బయటకు తీస్తే పెద్దఎత్తున అక్రమాలు బయటపడే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొనడం గమనార్హం.

జిల్లాకు యూరియా కావాలని వ్యవసాయాధికారులు రాష్ట్ర అధికారులను కోరారు. వారు ఆన్‌లైన్‌లో పరిశీలించి మీ వద్ద యూరియా దండిగా ఉందని బదులిచ్చారు. క్షేత్రస్థాయిలో దుకాణాలు, ఆర్‌ఎస్‌కేలు, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లలో పరిశీలిస్తే ఎక్కువ భాగం ఈ-పాస్ యంత్రాలు వాడలేదని బయటపడింది. గత కొన్నేళ్లుగా యంత్రాలను వాడటం లేదు. గాడిలో పెట్టాల్సిన అధికారులు గాలి కొదిలేశారు.

**ఎక్కడా కొరత లేదు**

ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ సంయుక్త సంచాలకులు (అనంతపురం)

జిల్లాలో 4,162 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. ఎక్కడా కొరత లేదు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే డీలర్ల లైసెన్సులు రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం

## పశు సంపదకు ఆపద!



ధర్మవరం : తాడిమర్రి మండల సరిహద్దులోని పెద్దకోట్ల, దాడితోట గ్రామాల సమీపంలోని చౌడమ్మకొండలో అదానీ సంస్థ పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడుతోంది. కొండలో పనులు చేస్తుండటంతో మేతకు ఉపయోగపడే చెట్లు, మొక్కలు నేలకొరుగుతున్నాయి. ఫలితంగా పశువులు, గొర్రెలు, మేకలకు మేత లేకుండా పోతోంది. పాడిరైతులు గ్రాసాన్ని అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయలేక పశువులను అమ్మేస్తున్నారు. మరికొందరు పశువుల మందలను తీసుకుని ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

**ఆ గ్రామాల్లో పశు ఘోష**

తాడిమర్రి మండలంలోని దాడితోట, పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాల్లో పశు సంపద ఎక్కువగా ఉంది. పాడి పరిశ్రమపై వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. మూడేళ్ల క్రితం మూడు లక్షలకుపైగా ఉన్న పశువులు, జీవాలు ప్రస్తుత గణాంకాల ప్రకారం యాభైవేలకు లోపే ఉన్నాయి. కొండంతా ధ్వంసం చేసి ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. పచ్చదనం కనుమరుగవుతోంది. మేత లేని కారణంగా పశువులు తరిగిపోతున్నాయని పాడిరైతులు వాపోతున్నారు.

**హామీ విస్మరించారు**

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పరిశ్రమ వల్ల పశువుల మేతకు కొరత ఏర్పడితే ఆయా అటవీ ప్రాంతాల్లో గడ్డి విత్తనాలు చల్లడం, మొక్కలు నాటడం వంటివి చేస్తామని పరిశ్రమ పెద్దలు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ హామీని విస్మరించారని పాడి రైతులు లబోదిబోమంటున్నారు.

**మేత లేకుంటే ఇబ్బందే**

గంగయ్య, పెద్దకోట్ల గ్రామం

మూడు, నాలుగు గ్రామాలు గొర్రెలు, మేకలు, ఎనుములతోనే కుటుంబాలను పోషించుకుంటున్నాం. పరిశ్రమ వచ్చినప్పటి నుంచి కొండలో బ్లాస్టింగ్ చేపడుతున్నారు. శబ్దాలకు పశువులు కొండపైకి వెళ్లడం లేదు. కొండలో మేత లేకపోవడంతో వలస పోతున్నాం. పరిశ్రమ వస్తే మంచిదే. అయితే పాడి రైతులు కూడా బాగుండాలి కదా. సంక్షేమం కోసం ఏదైనా చేయాలని కోరుతున్నాం.

సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతా భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్

రెండు రోజుల్లో అదానీ సంస్థ ప్రతినిధులను కార్యాలయానికి పిలిపించి ఈ సమస్యపై చర్చిస్తా. పశువులకు మేత లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఉంటాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

## కబ్జా కోరల్లో కాలువ గట్టు!



పరిగి : పెన్నా, జయమంగళి నదుల నుంచి వరద నీటిని పరిగి చెరువుకు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పరిగి కాలువ గట్టు (సప్లయ్ ఛానల్) ఆక్రమణకు గురైంది. కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం గట్టును చదును చేసి తమ సొంత భూముల్లోకి కలుపుకొన్నారు. 10 అడుగుల వెడల్పు ఉన్న గట్టు చివరకు నడిచి వెళ్లేందుకు సైతం లేకుండా పోయింది. వర్షాకాలంలో వరద నీటిని చెరువుకు మళ్లించే సందర్భంలో ప్రవాహం ఉద్ధృతి ఎక్కువైతే బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో కాలువ కోతకు గురయ్యే అవకాశం ఉంది. దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని పరిగి సప్లయ్ ఛానల్‌లో ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్ల వ్యయంతో ఐదేళ్ల కిందట పూడిక మట్టి, ముళ్లకంపను తొలగించి గట్లపై మట్టితో నింపి పటిష్ఠం చేశారు. వరద నీరు ప్రవహించే సమయంలో కాలువ కోతకు గురైతే యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించేందుకు 10 అడుగుల మేర గట్టుపై మట్టి వేయించారు. అయితే కొందరు స్వార్థపరులు గట్లపై ఉన్న మట్టిని తొలగించి ఆక్రమించుకున్నారు.పగిరి మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామ సమీపంలో జయమంగళి నది వరద నీటిని చెరువుకు మళ్లించేందుకు నదికి అడ్డంగా బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖ అధికారులు ఏడు షట్టర్ల గేట్లను ఏర్పాటు చేశారు. 3 కిలోమీటర్ల మేర కాలువను 15 అడుగుల వెడల్పుతో తవ్వారు. అప్పట్లో రైతులు స్వచ్ఛందంగా కాలువ ఏర్పాటుకు తమ పొలాల్లో కొంత భూమిని దానంగా ఇచ్చారు. ఇటీవల తమ పొలాల్లోనే కాలువ వెళుతోందని గట్టుపై ఇరిగేషన్‌శాఖ అధికారులు వేసిన మట్టిని తొలగించి తమ పొలాల్లోకి కలుపుకొన్నారు. కొందరు రైతులు ఏకంగా గట్టుపై ముళ్ల కంచె ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు వర్షపు నీరు కాలువలోకి ప్రవహించకుండా లోతట్టు ప్రాంతాల్లో మట్టిని నింపి పూడ్చేశారు. గతంలో చెరువుకు నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం రైతుల నుంచి భూమిని సేకరించింది. ప్రజా అవసరాల కోసం భూములు ఇచ్చిన రైతులకు వాటిపై హక్కు ఉన్నప్పటికీ ఆక్రమించేందుకు వీలు లేదని చట్టం చెబుతోంది.

**సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం** రమణారెడ్డి, డీఈఈ ఇరిగేషన్ శాఖ, పెనుకొండ పరిగి సప్లయ్ ఛానల్ గట్టు ఆక్రమణకు గురైన ప్రాంతాలను సర్వే చేయిస్తాం. ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటాం. కోతకు గురైన కాలువ గట్లకు మరమ్మతులు చేయిస్తాం.

## బిరబిరా.. కృష్ణమ్మ

కుప్పం : అసలే కరవు ప్రాంతం.. వర్షాలు పడితేగానీ తాగు, సాగు నీరందని దుస్థితి.. ఎలాంటి ప్రాజెక్టులు సైతం లేకపోవడంతో ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన పరిస్థితి.. ఒకానొక సమయంలో తీవ్ర వర్షాభావంతో రైళ్ల ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించాలని యత్నించటం.. ఆ సమయంలోనే వర్షం కురవడంతో చెరువులు నిండి నీటి సమస్య తీరింది.. అలాంటి సమస్య మళ్లీ రాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.575 కోట్ల వ్యయంతో హంద్రీ-నీవా కాలువను కుప్పానికి మంజూరు చేయించారు. అప్పట్లో ఆ పనులు ముందుకు సాగకుండా వైకాపా నాయకులు అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో కుప్పానికి హంద్రీ-నీవా నీరు తెచ్చేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారు.

కుప్పం కరవు తీరేలా హంద్రీ-నీవా జలాలను ఈనెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పురపాలికలోని పరసముద్రంలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే చెర్లోపల్లి రిజర్వాయర్‌కు నీరు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. మరో పది, పదిహేను రోజుల్లో హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పానికి కృష్ణా జలాలు రానున్నాయి. ఈ దఫా వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో కృష్ణమ్మ జలాలు



ఎప్పుడెప్పుడు వస్తాయా అని రైతులు, ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ జలాలు కుప్పం నియోజకవర్గంలోని చివరి చెరువు అయిన పరమసముద్రం చెరువుకు చేరనున్నాయి.

**సామర్థ్యం పెంచేందుకు చర్యలు..**

హంద్రీ-నీవా జలాలతో కుప్పం నియోజకవర్గంలోని 430 చెరువులు నింపనున్నారు. ఈ నేపథ్యంలో చెరువుల సామర్థ్యం, చెక్‌డ్యాంలను బాగు చేయడం, నీటినిల్వలో ఎలాంటి లోపాలు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు, నాయకులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

**పనులు వేగవంతం** హంద్రీ-నీవా పనులు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయి. కృష్ణా జలాలతో చెరువులన్నీ నింపి కరవు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం. త్వరలో కుప్పానికి నీళ్లు రానున్నాయి.కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ

## దోచుకుంటున్నా.. కేసుల్లేవ్..!

తిరుపతి : తిరునగరిలో మెప్మా గాడినపడటం లేదు. 26వ డివిజన్ పరిధిలో రెండేళ్ల కిందట ఓ ఆర్పీని, కార్పొరేటర్ భర్త సహకారంతో నియమించుకున్నారు. సదరు ఆర్పీ రూ.29 లక్షలు స్వాహా చేసింది. మెప్మా అధికారులు, వైకాపా నాయకులు రాయభారం చేయగా రూ.12 లక్షలు మాత్రమే చెల్లించి చేతులెత్తేసింది. మెప్మా అధికారులు ఆర్పీకి ఫోన్‌చేస్తేకార్పొరేటర్ భర్త అడ్డుపడుతూ వచ్చారు. సీవో, సీఎంఎం మెప్మా నియమించిన ఆడిట్ బృందంతో కాకుండా ప్రైవేటు ఆడిట్ చేయించడంపై అప్పట్లో విమర్శలు ఉన్నాయి. ఇటీవలే లక్ష్మీపురం, పార్వతిపురం ఝాన్సీ లక్ష్మీభాయి సమాఖ్య ఆర్పీ లత రూ.కోటి వరకు కాజేశారు. ఈ సొమ్ము వస్తుందో రాదో తెలియని పరిస్థితి. 26 సంఘాలకు చెందిన మూడువేల మంది మహిళలు బాధితులుగా మిగిలారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. సంఘాల్లో జరిగే మోసాలు వాటంతటవే బయటపడితే తప్ప అధికారులు పట్టించుకోరు. రూ.కోట్లలో అక్రమాలు జరిగినా మెప్మా సిబ్బంది, అధికారుల పంచాయితీతో సమసిపోతుందే తప్ప కనీసం ఒక్క పోలీస్ కేసు



నమోదుకావడం లేదు. పోలీస్ కేసులు నమోదు కాకపోవడం, ప్రైవేటు ఆడిట్ బృందాలచే ఆడిట్ చేయించడం, ఆర్పీలను లాగిన్ లేకుండా కొనసాగించడం వెనుక ఉన్నతస్థాయి సిబ్బంది హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా ఏకంగా 13 మంది ఆర్పీలు లాగిన్‌లు తొలగించినప్పటికీ అనధికారింగా కొనసాగుతున్నారు. సంఘాలపై పెత్తనం కొనసాగిస్తున్నారు.

**వీడని వైకాపా వాసనలు**

సభలు, సమావేశాలు, వైకాపా నేతల వ్యక్తిగత ప్రచారం, జనసమీకరణ వంటి అంశాలకు గత పాలనలో మెప్మా వేదికైంది. అప్పట్లో కీలకంగా పనిచేసిన సిబ్బందే ఇప్పటికీ మెప్మాను శాసిస్తున్నారు. బదిలీ చేసినా పలుకుబడి ఉపయోగించి ఇక్కడే కొనసాగుతున్నారు.

## వర్గోన్నతే..విధానం పాతదే

భీమవరం : జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య సిబ్బంది కొరత వేధిస్తోంది. 30 నుంచి 100 పడకలకు వర్గోన్నతి పొందిన ఈ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై గత వైకాపా ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించింది. వ్యాధి నయం కోసం ఆసుపత్రికెళ్తే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. గతంలో సీహెచ్‌లుగా ఉన్న ఆసుపత్రులు ప్రస్తుతం ప్రాంతీయ ఆసుపత్రులుగా వర్గోన్నతి పొందినా పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బంది నియామక టెండరు ప్రక్రియలో మాత్రం సామాజిక ఆసుపత్రులుగా ఉండడంతో పాత విధానాన్నే కొనసాగిస్తున్నామని డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. టెండరు ఖరారు సమయంలో సరిచేసి ఆసుపత్రి హెూదాకు తగ్గట్టుగా సిబ్బంది నియామకం చేపడతామన్నారు.

**పదకొండు మంది సిబ్బందితో సేవలు..** భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి నిత్యం 350 మంది రోగులు వస్తారు. ప్రాంతీయ ఆసుపత్రుల్లో 22 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది ఉండాలి. ఇక్కడ మాత్రం 11 మందే ఉన్నారు. వారికి కూడా రెండు మూడు నెలలకోసారి వేతనాలు అందుతున్నాయి. ఆసుపత్రి పాత భవనంతోపాటు కొత్తగా నిర్మించిన భవనంలోని గదులను శుభ్రం చేయడం వారికి పని భారమవుతోంది. పాలకొల్లు, నరసాపురంలో కూడా ఇదే పరిస్థితి. **పరిసరాల్లో అపరిశుభ్రత..** ఆసుపత్రుల ప్రాంగణాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. వర్షాకాలంలో వివిధ జ్వరాలు, జలుబు, దగ్గు ఇతరత్రా రుగ్మతల రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఆసుపత్రి ప్రాంగణాలు, రోగులుండే వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపం ఆసుపత్రికి వచ్చేవారికి శాపంలా మారింది.

## ఫ్యాషన్ కి కేరాఫ్ అడ్రస్ గా జాన్వీ.. 'ప్రాడాశారీ' తో అందరి దృష్టి తన వైపే!

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తాజాగా టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం(TIFF)లో మెరిసింది. అక్కడ ఈమె వేసుకున్న బంగారు రంగు 'ప్రాడా శారీ' అందరి దృష్టిని ఆకర్షించింది.. ఈ TIFF లో అందరికంటే జాన్వీ కపూర్ సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలవడంతో జాన్వీ కపూర్ వేసుకున్న ఆ బంగారు వర్ణపు ప్రాడా సారీ గురించి సోషల్ మీడియాలో ఎన్నో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరి ఇంతకీ ఈ గోల్డెన్ కలర్ ప్రాడాశారీ స్పెషాలిటీ ఏంటి.? దీని వెనుక ఉన్న కథ ఏంటి.?అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. జాన్వీ కపూర్ తాను వేసుకున్న డ్రెస్ తో భారతీయ సంప్రదాయం ఎలాంటిదో ప్రపంచ దేశాలకు చాటి చెప్పింది. ఓవైపు ఫ్యాషన్ గా ఉంటూనే మరోవైపు తన డ్రెస్ తో భారతదేశ గొప్పతనాన్ని TIFF లో ప్రదర్శించింది.. రియా కపూర్ స్టైల్ చేసిన జాన్వీ కపూర్ వేసుకున్న



ఈ ప్రాడా స్ప్రింగ్ 2004 కలెక్షన్ నుండి బంగారు దుస్తులలో బయటికి వచ్చింది.. జాన్వీ కపూర్ వేసుకున్న ఈ ప్రాడా శారీ లుక్ డీకోడింగ్ శారీతో ప్రేరణ పొంది పట్టుతో తయారు చేయబడిన స్ట్రాప్ లెస్ బంగారు వర్ణం శారీ ఇది.. అలాగే జాన్వీ కపూర్ తన భుజాలపై ధరించిన మ్యాచింగ్ కోటు ఆమె అందాన్ని మరింతగా పెంచింది.. తక్కువ మేకప్.. అందమైన జుట్టుతో జాన్వీ కపూర్ అందర్నీ ఆకర్షించింది. అలాగే ఐకానిక్ కొల్హాపురి చప్పల్ నీ రీ క్రియేట్ వెర్షన్ అయిన అప్రజిత టూర్ రూపొందించిన బంగారు పట్టి చెప్పులు.. ఆమె వేసుకున్న డ్రెస్ కి మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. జాన్వీ కపూర్ స్టైల్ చేసిన ఈ ప్రాడా స్ప్రింగ్ 2004 కలెక్షన్ గురించి చూసుకుంటే.. భారతీయ వారసత్వానికి ప్రతీక అయిన మియాసియు ప్రాడా స్ప్రింగ్.. 2004లో దీన్ని ఆవిష్కరించారు.. ఇది సాంస్కృతిక సూచనలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. జాన్వీ కపూర్ వేసుకున్న ఈ గోల్డెన్ దుస్తులు 1950 నాటి డిజైన్ తో స్ఫూర్తి పొందింది. ఈ ప్రాడా శారీ.. 2004 సేకరణకు చెందిన శారీ సిల్హౌట్ ను గుర్తుకు తెస్తోంది అని ఫ్యాషన్ ప్రియులు కూడా కామెంట్లు చేస్తున్నారు. . ఇలాంటి దుస్తులు భారతదేశ సాంప్రదాయ వస్త్రాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. అలాగే ఈ దుస్తులను గోల్డెన్ ప్రాడా శారీ అని అంటారు. అలా జాన్వీ కపూర్ ఈ స్పెషల్ డ్రెస్ తో టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలిచింది. జాన్వీ కపూర్ సినిమాల విషయానికొస్తే.. రీసెంట్ గానే ' పరమ్ సుందరి' మూవీతో ప్రేక్షకులను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం రామ్ చరణ్ 'పెద్ది' మూవీలో నటిస్తోంది. అలాగే బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ తో కలిసి 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' అనే సినిమాలో కూడా నటిస్తోంది.

## రష్మిక జీవితంలో కొత్త మలుపు

రష్మిక జీవితంలో ఊహించని మలుపును చూడబోతున్నాం. త్వరలోనే ఈ భామ ఎంటర్ ప్రెన్యూర్ కాబోతోంది. బాలీవుడ్ టాలీవుడ్ లో ఇప్పటికే చాలా మంది కథానాయికలు ఎంటర్ ప్రెన్యూర్లుగా ఎదుగుతున్నారు. ఇప్పుడు వారి బాటలోనే రష్మిక కూడా అనూహ్యమైన స్టెప్ తీసుకుంటోంది. రష్మిక త్వరలోనే వ్యాపార రంగంలో అడుగుపెట్టబోతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునేందుకు ఈ కూర్గ్ (కన్నడ) బ్యూటీ ప్రయత్నాలు ప్రారంభించిందని తెలుస్తోంది. అయితే రష్మిక ప్రారంభించబోయే వ్యాపారం ఏమై ఉంటుంది? అంటే దానికి ఇంకా ఎలాంటి సమాధానం లేదు. చాలా మంది అగ్ర కథానాయకలు వస్త్ర వ్యాపారంలో ఉన్నారు. రకరకాల ఫ్యాషన్ లేబుల్స్



ప్రారంభించి భారీగా లాభాలార్జిస్తున్నారు. దీపిక పదుకొనే, సోనమ్ కపూర్, ఆలియా భట్ వంటి ప్రముఖులు ఫ్యాషన్ రంగంలో రాణిస్తున్నారు. ఇప్పుడు రష్మిక కూడా అదే బాటను అనుసరిస్తోందా? లేక ఏదైనా ఇతర రంగాల్లో అడుగుపెడుతుందా? అన్నది వేచి చూడాలి. రష్మిక తన జీవితంలో కొత్త మలుపు గురించి ప్రస్థావిస్తూ.... తాను త్వరలో కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వెల్లడించింది. ఈ రోజు నేను చాలా చాలా ముఖ్యమైన దాని కోసం షూటింగ్ చేయబోతున్నాను.. నువ్వు చెప్పినట్టే నేను ప్రారంభించబోయే వ్యాపారానికి సంబంధించిన షూట్ చేసాను! అని తన మామ్ కి రష్మిక వెల్లడించింది. ఈ సందర్భంగా తన తల్లి గురించి ప్రస్థావించిన రష్మిక.. అమ్మ ఎప్పుడూ ముందుగా తెలుసుకుంటుంది.. అని చెప్పింది. తన మనసులో ఆలోచనలను తన మాతృమూర్తి ముందే తెలుసుకున్న విషయాన్ని పేర్కొంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... రష్మిక తదుపరి పుష్ప 3లో నటించాల్సి ఉంటుంది. అంతకంటే ముందే రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ది గర్ల్ ఫ్రెండ్ అనే లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో కనిపించనుంది. అటు బాలీవుడ్ లోను పలు చిత్రాల్లో నటిస్తోంది.




## స్టార్ హీరో సినిమాకు రిలీజ్ డేట్ ఇబ్బందులు



కోలీవుడ్ స్టార్ హీరోగా మంచి క్రేజ్ ఉన్న సూర్యకు గత కొన్ని సినిమాలుగా సరైన సక్సెస్ లేక ఇబ్బంది పడుతున్నారు. సూర్య నుంచి ఆఖరిగా వచ్చిన కంగువ, రెట్రో సినిమాలు ఎలాంటి ఫలితాన్నిచ్చాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కమర్షియల్ గా సక్సెస్ అయిన పెద్ద డైరెక్టర్లతో సినిమాలు చేసినప్పటికీ ఆ సినిమాలు సూర్యకు మర్చిపోలేని చేదు అనుభవాన్ని మిగిల్చాయి.

**వరుస ఫ్లాపులతో దెబ్బతిన్న సూర్య మార్కెట్....** ఆ ఫ్లాపుల కారణంగా సూర్య మార్కెట్ దారుణంగా దెబ్బతింది. ప్రస్తుతం సూర్య, ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. కరుప్పు అనే టైటిల్ తో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ ను జరుపుకుంటుంది. ఈ మూవీకి ఫాంటసీ టచ్ కూడా ఉండటంతో మాస్ లో కరుప్పు పై ఆడియన్స్ లో భారీ అంచనాలున్నాయి.

**సంక్రాంతికి భారీ పోటీ...** వాస్తవానికి కరుప్పుని వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేద్దామనుకున్నారు కానీ జనవరి 9న దళపతి విజయ్ జన నాయగన్, జనవరి 14న పరాశక్తి రిలీజవుతుండటంతో దీన్ని వాయిదా వేస్తున్నారని తెలుస్తోంది. అటు జన నాయగన్, పరాశక్తిపై భారీ క్రేజ్ ఉండగా, కరుప్పు మీద మాత్రం పెద్దగా హైప్ లేదు. అందుకే ఇప్పటివరకు కరుప్పు రిలీజ్ డేట్ గురించి మేకర్స్ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.

**ఇంకా జరగని ఓటీటీ బిజినెస్...** పైగా సంక్రాంతి టైమ్ లో తెలుగు నుంచి కూడా భారీ పోటీ ఉంది. ప్రభాస్ రాజా సాబ్, చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు, రవితేజ 76 కూడా పండక్కే వస్తున్నాయి. వీటితో పోటీ ఎందుకులే అని కరుప్పు ను ఏప్రిల్ 14న రిలీజ్ చేద్దామని చూస్తున్నారట మేకర్స్. పైగా ఈ సినిమాకు ఓటీటీ డీల్ కూడా జరగలేదట. డైరెక్టర్ గా ఆర్జే బాలాజీకి పెద్దగా మార్కెట్ లేకపోవడంతో ఆ ఎఫెక్ట్ కరుప్పుపై పడిందని అంటు న్నారు. అందుకే రిలీజ్ డేట్ విషయంలో మేకర్స్ ఆచితూచి వ్యవహరిస్తు న్నారట. మరోవైపు వెంకీ అట్లూరితో సూర్య చేస్తున్న సినిమా శరవేగంగా పరుగులు పెడుతుంది. ఆ సినిమాను సమ్మర్ లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ కరుప్పు ఏప్రిల్ లో రిలీజ్ అయితే వెంకీ సినిమా దసరా, దీపావళికి పోస్ట్‌పోన్ చేయాల్సి ఉంటుంది. మరి రిలీజ్ డేట్ విషయంలో కరుప్పు మేకర్స్ ఎలాంటి డెసిషన్ తీసుకుంటారో చూడాలి.

## ప్రభాస్ కామెడీ..వారంతం అదే పనా!




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో 'ది రాజాసాబ్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. డార్లింగ్ 'పౌజీ' షూటింగ్ తో పాటు ఏక కాలంలో రాజాసాబ్ చిత్రీకరణకు హాజరవుతున్నారు. ఇప్పటికే రాజాసాబ్ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సింహభాగం షూటింగ్ పూర్తయింది. తాజాగా కొత్త షెడ్యూల్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. దీనిలో భాగంగా ప్రభాస్ తో పాటు, వీటీవీ గణేష్, ప్రభాస్ సీన్ పై కామెడీ ట్రాక్ తెరకెక్కిస్తున్నారు. ఈ వారంతం వరకూ షూటింగ్ అక్కడే జరుగుతుంది. సినిమాలో ఈ కామెడీ ఎపిసోడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటున్నారు. ప్రభాస్ కామెడీ సైతం పండిచగల నటుడు. కెరీర్ ఆరంభంలో ప్రభాస్ నటించిన చాలా చిత్రాల్లో కామెడీ ట్రాక్ లో నూ కనిపించారు. కాల క్రమంలో భారీ యాక్షన్ థ్రిల్లర్ల వైపు వెళ్లడంతో కామెడీ కి పూర్తిగా దూరమయ్యారు. ఈనేపథ్యంలో మారుతి హారర్ థ్రిల్లర్ కామెడీ కథ వినిపించడంతో డార్లింగ్ మరో ఆలోచన లేకుండా కమిట్ అయ్యారు. తాను పెద్ద పాన్ ఇండియా స్టార్ అయినా మారుతి ఇమేజ్ తో పనిలేకుండా కమిట్ అయ్యారు. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ విషయంలో మారుతి తొలుత కాన్ఫిడెంట్ గా లేకపోవడంతో సినిమా చేయకూడదనుకున్నాడు. కానీ ప్రభాస్ ఒత్తిడి తీసుకురావడంతో కమిట్ అయ్యారు. ఈ విషయాన్ని మారుతినే స్వయంగా ఓ సందర్భంలో రివీల్ చేసిన సంగతి తెలిసిందే. తాజా షెడ్యూల్ అనంతరం పాటల చిత్రీకరణ మొదలవు తుందని సమాచారం. ఇందులో ముగ్గురు భామలు హీరోయిన్లగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. హీరోయిన్ల పాత్రల విషయంలోనూ డార్లింగ్ హస్తముంది. సినిమాలో తొలుత ఒకే హీరోయిన్ అనుకున్నారు. కానీ మరో నాయిక ఉంటే బాగుంటుంద ప్రభాస్ సూచించడంతో? ఇద్దరు కాదు...ముగ్గురని రిద్ది కుమార్ ని థర్డ్ లీడ్ కి ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

## 2026 నుంచి మెగా కోడలు మళ్లీ బిజీ బిజీ!

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లైన దగ్గర నుంచి సినిమాలకు దూరమైన సంగతి తెలిసిందే. కోడలిగా ఇంటి బాధ్యతలకే పరిమితమయ్యారు. పెళ్లైన తర్వాత లీలావతి సినిమాకు కమిట్ అయి పట్టా లెక్కిం చినా సీరియస్ గా ఆ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఆ సినిమా ఇంకా ఆన్ సెట్స్ లోనే ఉంది. పెళ్లికి ముందు ఓ తమిళ సినిమా కు కమిట్ అయింది. ఆ సినిమా కూడా ఇంకా రిలీజ్ అవ్వలేదు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ కానుంది.

**కుటుంమంతా సంతోషంగా:** మరి తాజా పరిణామాల నేపథ్యంలో మెగా కోడలు మళ్లీ సినిమాల్ని సీరియస్ గా తీసుకోతున్నారా? మును పటిలా బిజీ నటిగా మారే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారా? అంటే అవుననే లీకులందుతున్నాయి. ఇటీవలే లావణ్య త్రిపాఠి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మెగా ఫ్యామిలీ ఫుల్ ఖుషీగా ఉంది. ఇల్లాంతా ఆడ పిల్లలతో నిండిపోయింది వారసుడు కావాలి అంటూ చిరంజీవి అన్న నేపథ్యంలో వరుణ్ తేజ్ కు కొడుకు పుట్టడంతో



ఆయనెంతో సంతోషంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో లావణ్య త్రిపాఠి మళ్లీ నటిగా బిజీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**సినిమాలతో మళ్లీ బిజీ:** వచ్చే ఏడాది మిడ్ నుంచి మళ్లీ లావణ్య సీరియస్ గా కెరీర్ పై దృష్టి పెట్టే అవకాశం ఉందంటున్నారు. కొత్త సినిమాలతో జోరు పెంచాలని ఆమె కూడా ఆసక్తిగా ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం లావణ్య బాలింత కావడంతో విశ్రాంతిలో ఉన్నారు. కోలుకున్న అనంతరం మళ్లీ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చే ఛాన్స్ ఉంది. ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో పెళ్లికాని నటీమణులు కంటే పెళ్లైన నటులకే ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. వరుసగా స్టార్ హీరోలతో అవకాశాలు అందుకునే వారు వారే.

**రెండు ప్రయాణాలు సాఫీగా:** పారితోషికం కూడా రెట్టింపు అందు కుంటున్నారు. ఈ నేపథ్యంలో లావణ్య కూడా కంబ్యాక్ అవ్వడానికి అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రొఫెషనల్ గా మెగా ఫ్యామిలీ ఎలాంటి అడ్డంకి చెప్పదు. కావాల్సినంత స్వేచ్ఛ కల్పిస్తున్నారు. ఇప్పటికే నిహారిక కూడా సినిమాలతో యాక్టివ్ అయిన సంగతి తెలిసిందే. చిరంజీవి పెద్ద కుమార్తె సుస్మిత ఇంతకాలం మీడియా కంట కనిపించడం తక్కువైనా? నిర్మాతగా మారిన నేపథ్యంలో సుస్మిత కూడా నెట్టింట వైరల్ అవుతున్నారు. ఇలా మెగా ఫ్యామిలీ నుంచి ఇద్దరు ప్రొపెషనల్ -పర్సనల్ కెరీన్ ని బ్యాలెన్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లావణ్య త్రిపాఠి కూడా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి.

## తెలుగు నటి యూరప్‌లో రచ్చ రచ్చ

దక్ష నగర్కర్ పరిచయం అవసరం లేదు. టాలీవుడ్ లో హుషారు అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తొలి ప్రయత్నం సక్సెసైంది. తనదైన అందం హుషారైన నటనతో యువతరంలో మంచి ఫాలోయింగ్ సంపాదించింది. అటుపై జాంబీరెడ్డి తో మరో పెద్ద సక్సెస్ ని ఖాతాలా వేసుకుంది. ఆ తర్వాత బంగార్రాజులో స్పెషల్ అప్పీరియన్స్ తో ఆకట్టుకుంది. నాగచైతన్య-నాగార్జునలతో కలిసి ఓ పాటలో కనిపించింది. దక్ష ప్రస్తుతం తెలుగు పరిశ్రమ సహా ఇరుగు పొరుగునా బిజీ నటిగా మారుతోంది. ఇక సోషల్ మీడియాలో దక్ష స్పీడ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు టెంప్టింగ్ ఫోటోలతో ఇన్ స్టాని హీటెక్కించడం ఈ భామ ప్రత్యేకత. ఇంతకుముందు జిమ్,



ఫిట్నెస్ కి సంబంధించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేసిన దక్ష ఇటీవల గ్లామర్ ఎలివేషన్ కి సంబంధించిన ఫోటోషూట్లపైనా ఫోకస్ చేస్తోంది. దక్ష ప్రస్తుతం యూరప్ ట్రిప్‌లో ఫుల్‌గా చిల్ చేస్తోంది. బుడాపెస్ట్ నుంచి ఇంతకుముందే ఒక వీడియోని, కొన్ని ఫోటోలను కూడా దక్ష షేర్ చేసింది. ఈ హాలి బ్యూటీ పాక్షికంగా అందాలను హైలైట్ చేసే బ్లాక్ అండ్ బ్లాక్ లుక్ తో యువతరం హృదయాలను మరిగిస్తోంది. డార్క్ థీమ్డ్ ఫోటోషూట్ తో దక్ష అందం పదింతలైంది. యూరప్ లో దక్ష బోలెడంత రచ్చ చేయబోతోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536